# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - సోమవారం 11 మే 2026 | సంపుటి: 10 | సంచిక: 125 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా..





దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంది

# దేశ భక్తిని చాటుకోవాల్సిన సమయమిది



## ● భారత్ ఆత్మనిర్భర్‌కు పాటు పడండి.. ● స్వదేశీ ముద్దు.. విదేశీ వద్దు

### పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గించి ప్రజా రవాణాను వినియోగించండి

### ఏడాది పాటు బంగారం కొనబోమని శపథం చేయాలంటూ పిలుపు

### రసాయనాల నుంచి భూమాతను రక్షించాలె

### తెలంగాణ మే అబ్ కీ బార్ బీజేపీ సర్కార్

### మావోయిస్టుల హింసతో తెలంగాణ నష్టపోయింది

### పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో ప్రధాని మోడీ

### నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా అంటూ తెలుగులో ప్రసంగం

హైదరాబాద్, మే 10 (మనం బ్యూరో) : దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది...దేశభక్తిని చాటాల్సిన సమయం ఇది. భారత్ ఆత్మనిర్భర్‌కు పాటు పడండి.. ఏడాది పాటు బంగారం కొనొద్దు...విదేశీ పర్యటనలు వద్దు వీటికి దూరంగా ఉంటామని శపథం చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆత్మనిర్భర్ ముఖ్యం, విదేశీ వస్తువులకు దూరంగా ఉండాలి, పెట్రోల్, డీజిల్ వాడకం తగ్గించాలి, రసాయనాల నుంచి భూమాతను రక్షించాలని పేర్కొన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. నా ప్రియమైన తెలంగాణ ప్రజలారా అంటూ తెలుగులో ప్రసంగించిన ప్రధాని దేశ ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ పరిణామాలపై హైదరాబాద్ బహిరంగ సభ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో దేశంపై తీవ్రంగా పడిందనీ, ముఖ్యంగా ఇంధన వినియోగం, విదేశీ మారక ద్రవ్యం ఆదా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించండి, సొంత వాహనాల కంటే వీలైనంత వరకు మెట్రో రైళ్లు, బస్సులు వంటి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించాలని సూచించారు. సాధ్యమైనంత వరకు ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలనీ, ఆఫీసులకు వెళ్లడం తగ్గించి, వీలైనంత వరకు వర్క్ ఫ్రం హోం, ఆన్‌లైన్ మీటింగ్‌లను నిర్వహించుకోవాలనీ, ఇది ఇంధన ఆదాకు ఎంతగానో తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో విదేశీ మారక ద్రవ్యాన్ని కాపాడుకోవాల్సి అవసరం ఉందని నొక్కి చెప్పిన మోడీ ప్రస్తుతం బంగారం అత్యంత ఖరీదుగా మారిపోయింది, దేశ ఆర్థిక వ్యవస్థను దృష్టిలో ఉంచుకుని కనీసం ఏడాది పాటు దేశ ప్రజలు బంగారం కొనడం ఆపివేయాలని కోరారు. గతంలో యుద్ధ సమయాల్లో దేశం కోసం ప్రజలు బంగారం దానం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాని గుర్తు చేశారు. అలాగే, దేశంలో రాగి కొరత తీవ్రంగా ఉందనీ, వనరులను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. క్లిష్ట పరిస్థితుల్లో మధ్య తరగతి ప్రజలు తమ ఖర్చులను

...మిగతా 2లో

## మేరే సే జోడో

రేవంత్‌కు ప్రధాని మోడీ ఆఫర్



2



## రూ. 9,377 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

### వర్చువల్‌గా శంకుస్థాపనలు చేసిన ప్రధాని మోడీ

హైదరాబాద్,మే 10 (మనం,ప్రత్యేక ప్రతినిధి) : దేశ వ్యాప్తంగా రాష్ట్రాల అభివృద్ధి కానిదే దేశాభివృద్ధి సాధ్యం కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మూడోసారి ప్రధాని అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన మోది తెలంగాణ రాష్ట్రానికి వరాల జల్లు కురిపించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని హైటెక్‌సిటీలోని హెచ్‌ఐసీసీ నుంచి ప్రధాని మోదీ ఆదివారం రూ. 9,377 కోట్ల విలువైన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ పదేళ్లుగా గుజరాత్ రాష్ట్రానికి ఎక్కువ నిధులు ఇచ్చారని రేవంత్ రెడ్డి అంటున్నారని, కేంద్రం పదేళ్లలో గుజరాత్‌కు ఎంత ఇచ్చిందో చెప్పాలని రేవంత్ రెడ్డిని ప్రశ్నిస్తున్నా అంటూ ఛలోక్తులు విసిరారు. దీంతో సభికులందరి ముఖాల్లో నవ్వులు పూశాయి. మూడోసారి ప్రధాని అయ్యాక తొలిసారి తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ సరదాగా చేసిన వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌తో పాటు వేదికపై ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తదితరులు నవ్వేశారు.

...మిగతా 3లో

## తెలంగాణతో ప్రధానికి ప్రత్యేక అనుబంధం

### బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు



హైదరాబాద్,మే 10 (మనం ప్రత్యేక ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంతో దేశ ప్రధాని మోడీకి ఎంతో ప్రత్యేక అనుబంధం ఉందని బీజేపీ స్టేట్ చీఫ్ రామచందర్ రావు అన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన సభలో ఆయన ఆసక్తికర ప్రసంగం చేశారు. ప్రధానికి స్వాగతం పలకడానికి సభకు లక్షలాది మంది వచ్చారని, ఈ సభతో తెలంగాణలో రాబోయేది భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రభుత్వానికి సంకేతమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి తెలంగాణతో ఎంతో అనుబంధం ఉందని చెప్పుకొచ్చారు.

...మిగతా 3లో

## సభలో రాజకీయాలు మాట్లాడొద్దు

### 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీ మా లక్ష్యం

### ప్రధాని సహకారం తెలంగాణకు అవసరం

### హెచ్‌ఐసీసీ వేదికలో పీఎంనుద్దేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,మే 10 (మనం,ప్రత్యేక ప్రతినిధి) : నగరంలోని హెచ్‌ఐసీసీలో ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రధాని మోదీల మధ్య ఆసక్తికరమైన అంశం చోటు చేసుకుంది. దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిశాయని, ఈ సభా వేదికలో రాజకీయాలు కాకుండా కేవలం అభివృద్ధిపైనే దృష్టి సారించాలని సీఎం రేవంత్ పరోక్షంగా ప్రధానికి చురకలంటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను ఎన్నోసార్లు కలిశానని, తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. తెలంగాణను నెంబరు వన్ చేయడమే తమ లక్ష్యమని.. తెలంగాణ అభివృద్ధికి మోడీ సహకారం కావాలన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయాయని, ఇక రాజకీయాలు పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే తెలంగాణ కూడా అభివృద్ధి

...మిగతా 2లో



## నేను కూడా రాజకీయాలు మాట్లాడను

### గుజరాత్‌కు ఎన్ని నిధులు ఇస్తున్నామో.. తెలంగాణకు అన్నే ఇస్తున్నం

### రేవంత్ గారూ.. ఇది వింటున్నారా?

### సీఎంకు ప్రధాని మోడీ సమాధానం

తెలంగాణకు కేంద్రం కేటాయిస్తున్న నిధులపై ప్రధాని మోదీ గణాంకాలతో సహా వివరించారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. 'రేవంత్‌రెడ్డి గారూ ఇది వింటున్నారా?. తాను కూడా రాజకీయాలు మాట్లాడనని, తెలంగాణకు కేటాయించిన నిధులపైనే మాట్లాడతానని ప్రధాని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తాను ఇక్కడ రాజకీయాలు మాట్లాడను' అని చేసిన వ్యాఖ్యలకు ప్రధాని స్పందిస్తూ..ముఖ్యమంత్రి గారు రాజకీయాలు మాట్లాడనని చెప్పారు, నేను కూడా రాజకీయాల గురించి మాట్లాడనని, తెలంగాణ అభివృద్ధికి మా ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందని ప్రధాని చలోక్తులు విసిరారు. పదేళ్లలో గుజరాత్‌కు ఎంత ఇచ్చామో.. తెలంగాణకూ అంతే ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని వాస్తవానికి అలా సమానంగా పంచితే మీకే ఎక్కువ లాభం జరుగుతుంది'

...మిగతా 2లో

మహిళలకు ప్రజా ప్రభుత్వ తీపికబురు

## ఇందిరా మహిళా శక్తి భవనాలు సిద్ధం

### జూన్ 2న 22 జిల్లాల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు!

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పేద, మద్యతరగతి ప్రజలకి త్వరలో తెలంగాణ ప్రభుత్వం ఓ భారీ తీపి కబురు చెప్పనుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 22 జిల్లాల్లో రూ.110 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరా మహిళా శక్తి భవనాలను జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఘనంగా ప్రారంభించనుంది. మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం వీటిని శాశ్వత వేదికలుగా తీర్చిదిద్దారు. ఒక్కో భవనాన్ని 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.5 కోట్లతో నిర్మించారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మహిళా సమాఖ్యలకు గొప్ప ఊరటనివ్వడమే కాకుండా ఆర్థిక పురోగతికి మార్గం సుగమం చేయనుంది. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని మహిళా స్వయం

...మిగతా 2లో

## తమిళనాడులో కొలువుదీరిన కొత్త సర్కార్

**ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణ స్వీకారం**

**తొమ్మిది మంది మంత్రులు కూడా..**

**ప్రమాణం చేయించిన గవర్నర్ ఆర్లేకర్**

**హాజరైన రాహుల్ గాంధీ, సినీ ప్రముఖులు**





చెన్నై, మే 10 : తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా టీవీకే చీఫ్ సీ జోసెఫ్ విజయ్ ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నైలోని జవహర్ లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియం వేదికగా ఆయనతో

**మీ పాలన ప్రజారంజకంగా సాగాలె**

ప్రధాని మోడీ శుభాకాంక్షలు 2





**200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం**

యాంటీ డ్రగ్ టాస్క్ ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం ఏర్పాటు దస్త్రాలపై కూడా... 2

## పోరాటాలతో జనగణనలో ఓబీసీ కులగణనను సాధిద్దాం

నిరవధిక దీక్ష విరమణలో ప్రభుత్వ సలహాదారు వీహెచ్

దీక్ష విరమింపజేసిన మధుసూదనాచారి, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్ 3



**సీడీఎస్‌గా సుబ్రమణి** 2

**18న లాసెట్** 3

# విజయ్ ప్రమాణ స్వీకారంలో రాహుల్

● ఇద్దరి దోస్తీ ఈనాటిది కాదు!



**చెన్నై, మే 10 :** సీఎంగా విజయ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. ఈ వేడుకలో రాహుల్-విజయ్ పక్కపక్కనే కనిపించారు. ఇద్దరు కలిసే ఇరు పార్టీల కార్యకర్తలకు అభివాదం చేశారు. వారిద్దరి మధ్య స్నేహం అందరి దృష్టిని ఆకర్షించింది. దీనికి 2009 లోనే పునాది పడిందని తెలుస్తోంది.

2009లో విజయ్ కాంగ్రెస్ లో చేరాలని ప్రయత్నించినట్లు సమాచారం. ఆయన తన తండ్రి చంద్రశేఖర్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. అప్పట్లో కాంగ్రెస్ కేంద్రంలో అధికారంలో ఉంది. నాడు యువజన కాంగ్రెస్ బాధ్యతలు చూస్తున్న రాహుల్.. విజయ్ కి తమిళనాడు యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవిని కూడా ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే అప్పట్లో అది కార్యరూపం దాల్చలేదు. 17 ఏండ్లకు సీన్ మొత్తం రివర్స్ అయింది. విజయ్ టీవీకేను ప్రారంభించి.. చాలా వేగంగా అధికారంలోకి వచ్చారు. ఆయన నేతృత్వంలో ఏర్పాటైన ప్రభుత్వంలో కాంగ్రెస్ చేరింది. ఇంతకాలం డీఎంకేతో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్.. దానితో కలిసే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసింది. కేవలం ఐదు స్థానాలను మాత్రమే గెల్చుకుంది. రాష్ట్రంలో ఆ పార్టీ ప్రాధాన్యం రోజురోజుకూ తగ్గిపోతున్న సమయంలో ఈ ఎన్నికల అనంతరం పొత్తు కుదిరింది.

తన భావజాలానికి దక్షిణ భారతంలో విజయ్ తగిన మిత్రుడని రాహుల్ భావిస్తున్నట్లు విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఎన్నికల ప్రచారంలో భాగంగా డీఎంకే నిర్వహించిన పలు సమావేశాలకు ఈ కాంగ్రెస్ నేత హాజరు కాలేదు. ఇవన్నీ కూడా వారి మధ్య స్నేహానికి ఒక నిదర్శనంగానే కనిపిస్తున్నాయి. విజయ్ గెలిచిన దగ్గరి నుంచి రాహుల్ ఇప్పటివరకు మూడుసార్లు ఫోన్ చేశారట. ఇక ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తూ విజయ్ ఆయన్ను సోదరా అని సంబోధించారు. రావడానికి ప్రయత్నిస్తానని బదులిచ్చిన రాహుల్.. ఈ రోజు విజయ్ వెంటే కనిపించారు. టీవీకేకు మద్దతు ఇచ్చిన ఇతర పార్టీలు వీసీకే, ఐయూఎంఎల్, వామపక్ష పార్టీలు ప్రస్తుతానికి వెలుపల నుంచే మద్దతు ఇస్తామని చెప్పిన సంగతి విదితమే.

# తమిళనాడులో కొలువుదీరిన కొత్త సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ ఆర్లేకర్ ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ, ఇతర రాజకీయ, సినీరంగ ప్రముఖులు హాజరయ్యారు. నీలి రంగు దుస్తుల్లో నటి త్రిష వేదిక వద్ద ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

**తొలి విడతలో తొమ్మిది మంత్రి మంత్రులు..**

సీఎం విజయ్‌తో పాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎన్. ఆనంద్, ఆదవ అర్జున, కె.ఎ. సెంగోటియన్, ఎస్ కీర్తన, కె.జి. అరుణ్ రాజ్, పి. వెంకటరమణన్, సి.ఆర్. నిర్మల్ కుమార్, రాజ్మోహన్, టి.కె. ప్రభు ఉన్నారు. కార్యక్రమానికి భాజపా నేతలు నైనార్ నాగేంద్రన్, కె.అన్నామలై హాజరయ్యారు.

## మీ పాలన ప్రజారంజకంగా సాగాలె

● ప్రధాని మోడీ శుభాకాంక్షలు

**చెన్నై, మే 10 :** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టీవీకే చీఫ్ విజయ్ కి ప్రధాని మోడీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ఆయన పరిపాలన అద్భుతంగా సాగాలని ఆకాంక్షించారు. ప్రజల అభివృద్ధి కోసం అన్ని రకాలుగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరిస్తుందని అన్నారు.

## రేవంత్ శుభాకాంక్షలు

తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ కి అభినందనలు. ప్రజలకు సమన్యాయం, సంక్షేమంతో కూడిన పాలన అందిస్తూ.. రాష్ట్రాన్ని అభివృద్ధిలో ఉన్నత శిఖరాలకు చేరుస్తారని బలంగా నమ్ముతున్నాను.

# 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఫైలుపై తొలి సంతకం

## యాంటీ డ్రగ్ టాస్క్ ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం ఏర్పాటు దస్త్రాలపై కూడా...

**చెన్నై, మే 10 :** తమిళనాడు నూతన సీఎంగా బాధ్యతలు చేపట్టిన విజయ్ గృహావసరాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించే ఫైల్ పై మొదటి సంతకం చేశారు. యాంటీ డ్రగ్ టాస్క్ ఫోర్స్, మహిళల రక్షణకు ప్రత్యేక దళం ఫైల్సుపై సంతకాలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 'తమిళనాడులో ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చింది. లౌకిక, సామాజిక, న్యాయశకం మొదలైంది. డైరెక్టర్ కుమారుడు నేడు సీఎం అయ్యాడు. నేను మీ అందరివాడిని. ఎన్నో కష్టాలు అధిగమించి ఈ స్థాయికి వచ్చా. నన్ను ఎంతోమంది ఎన్నో రకాలుగా ఇబ్బందిపెట్టారు. హామీల అమలుకు కొంత సమయం ఇవ్వండి. డీఎంకే ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లింది. అనుకున్న లక్ష్యాలను సాధిస్తాం. సాధ్యమయ్యేవే చెబుతాం.. చెప్పిందే చేస్తాం. ఎనిమిది కోట్ల మంది నా చెంతనుండగా ఎంతటి అసాధ్యాలనైనా సాధించే విశ్వాసం నాకుంది. ఎవ్వనా సరే ఎదుర్కొనే ధైర్యం నాకుంది. అది చాలు. నేనేమీ దేవదూతని కాదు. మీలాగే ఓ సాదాసీదా జీవితమే నాది కూడా. కాబట్టి మీ ఆకాంక్షలు నాకు తెలుసు.

గుర్తుంచుకోండి.. ఈ విజయ్ ఒక్క పైసా కూడా ప్రభుత్వ సొమ్ము తినడు. నాకు ఆ అవసరం లేదని మీ అందరికీ తెలుసు. నేను తప్పు చేయను. నా చుట్టూ ఉన్నవాళ్లనీ చేయనివ్వను. గెలిచాం కదా.. ఓ ఆట ఆడేద్దాం అన్న ఆలోచన మీలో ఎవరికైనా ఉంటే దాన్ని ఇప్పుడే ఎరేజ్ చేయండి. మిత్రులైనా.. శత్రువులైనా.. అందరికీ తమ ప్రభుత్వంలో ఒకే చట్టం. విద్యార్థుల కోసం విజయ్ మామ అన్నీ మంచి పనులే చేస్తాడు'' అంటూ పవర్ఫుల్ ప్రసంగం చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. టీవీకేలో ఒకేఒక అధికార కేంద్రం ఉందని.. అదే విజయ్ మాత్రమేనని స్పష్టం చేశారు.

**ముందు శ్వేతపత్రం విడుదల చేస్తాం: విజయ్**

తమ ప్రభుత్వం కార్యకలాపాలు ప్రారంభించడానికి ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసే అంశాన్ని పరిశీలిస్తామని విజయ్ వెల్లడించారు. విద్య, ఆహారం, వైద్య సేవలు, మహిళల భద్రతపై తమ ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారిస్తుందని చెప్పారు. విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సంఖ్యా బలాన్ని కూడగట్టుకుంటున్న సమయంలో.. అన్నాడీఎంకే అధికారం కోసం రహస్యంగా ప్రయత్నాలు చేసిందన్న వార్తలు వచ్చాయి. ఈ ప్రసంగంలో అన్నాడీఎంకేపై విజయ్ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. తాను బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తిస్తానని, రహస్యంగా చేయనని పేర్కొన్నారు. తన ప్రయాణంలో విమర్శకులను సైతం కలుపుకొని వెళ్తానని వెల్లడించారు. ''నన్ను విమర్శించి, అవమానించిన వారు కూడా నా ప్రజలే'' అని స్పష్టం చేశారు.

**ఉద్వేగభరితంగా ఉంది : విజయ్ తల్లిదండ్రులు**

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విజయ్ తల్లిదండ్రులు హాజరయ్యారు. మాతృదినోత్సవం రోజునే ఈ వేడుక జరగడం ఎంతో ఉద్వేగభరితంగా ఉందని ఆయన తల్లి శోభా చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు.

**కనిపించని విజయ్ పిల్లలు..**

ప్రమాణ స్వీకారోత్సవానికి విజయ్ కుమారుడు జేసన్ విజయ్, కుమార్తె దివ్య సాశా హాజరుకాలేదు. విజయ్ నుంచి విడాకులు కోరుతూ ఆయన భార్య సంగీత చెంగల్పట్టు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారు ముగ్గురు ఈ కార్యక్రమంలో కనిపించలేదని సమాచారం.

# తిరుచ్చి ఈస్ట్‌కు గుడ్ బై చెప్పనున్న విజయ్

**చెన్నై, మే 10 :** తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన విజయ్ ఏప్రిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్.. రెండు నియోజకవర్గాల్లో పోటీ చేసి రెండిటిలోనూ గెలిచిన విషయం పాఠకులకు విదితమే. అయితే, ఇప్పుడు తిరుచ్చి ఈస్టును వదిలి పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించారు. ఆదివారం ఈ విషయాన్ని రాష్ట్ర అసెంబ్లీ సెక్రటేరియట్ ప్రకటించింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఓ అభ్యర్థి ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయొచ్చు. ఆ రెండు సీట్లలోనూ గెలిస్తే ఒక దానికి రాజీనామా చేయాలి. తమిళనాడులో అన్నాడీఎంకే అధినేత్రి దివంగత జయలలిత తర్వాత ఏకకాలంలో రెండు స్థానాల నుంచి బరిలోకి దిగిన నేతగా విజయ్ గుర్తింపు పొందారు.

# దేశ భక్తిని చాటుకోవాల్సిన సమయమిది

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రించుకోవాలి, అనవసర దుబారా ఖర్చులు, ఆడంబరాలకు దూరంగా ఉండాలని సూచించారు. మధ్య తరగతి ప్రజలు విదేశీ ప్రయాణాలు మానుకోవడం ద్వారా దేశ సంపద బయటకు వెళ్లకుండా అడ్డుకోవచ్చనీ, దేశం ఎదుర్కొంటున్న సవాలుతో కూడిన సమయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రధాని మోడి తన ప్రసంగంలో సూచించారు. వంట నూనెలకు దూరంగా తగ్గించండి ఎరువులు రసాయనాల వినియోగం సగానికి సగం తగ్గించుకోవాలని సూచించారు. రెండు నెలల నుండి యుద్ధం ప్రభావం తీవ్రంగా పడింది. చాలా రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. అయినా దేశ ప్రజలపై ఆ భారం పడకుండా కేంద్ర ప్రభుత్వమే భరిస్తోందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

**తెలంగాణ మే అబ్ కీ బార్ బీజేపీ సర్కార్**

పశ్చిమ బెంగాల్‌లో గెలిచాం.. తదుపరి లక్ష్యం తెలంగాణ, ఈ సారి ఇక్కడ వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై నమ్మకం కోల్పోయారనీ, తెలంగాణమే అబ్ కీ బార్ బీజేపీ సర్కార్ అని ఉద్ఘాటించారు. ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ రాష్ట్ర శాఖ నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగిస్తూ కాంగ్రెస్ ఎక్కడ అధికారంలో ఉంటే అక్కడ అవినీతి ఉంటుందనీ, ఎన్నికలకు ముందు ఆ పార్టీ నేతలు ఆకాశమంత హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేస్తారని పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం కేవలం మూడు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందనీ, అభివృద్ధి, సుస్థిర పాలన కోసం దేశ ప్రజలు బీజేపీకి అధికారం ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. బెంగాల్ విజయంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందనీ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినోళ్లను ప్రజలు ఓడించారనీ, బెంగాల్‌లో బీజేపీ గెలుపుతో బానిస సంకెళ్లు తెగాయనీ, మమత నియంతృత్వ పాలనను బెంగాల్ ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు.

**గతంలో 2 సీట్లు ఇప్పుడు 8 గెలుచుకున్నాం**

దక్షిణాది రాష్ట్రాల్లో ఒకప్పుడు బీజేపీని అంటరాని పార్టీగా చూసే వారని అయితే, కర్ణాటక వంటి రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలో మాకు గతంలో రెండు సీట్లుండేవి మొన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు గెల్చుకున్నామని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణకు రూ.వేల కోట్ల నిధులు ఇస్తున్నామనీ, జహీరాబాద్ ఇండస్ట్రియల్ కారిడార్, వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌తో వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. తెలంగాణ బీజేపీ నేతలు, కార్యకర్తలపై పూర్తి నమ్మకం ఉందనీ, రాష్ట్రాల అభివృద్ధే, దేశాభివృద్ధి, తెలంగాణ అభివృద్ధికి వేల కోట్లు వెచ్చించామనీ, హైదరాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రధాని మోడీ స్పష్టం చేశారు.

**మావోయిస్టుల హింసతో తెలంగాణ నష్టపోయింది..**

మావోయిస్టుల హింసతో తెలంగాణ భారీగా నష్టపోయింది. దేశమంతా మావోయిస్టులు అంతమైనా ఇంకా ఇక్కడ మిగిలే ఉన్నారు. ఇక్కడి పోలీసులకు స్వేచ్ఛ ఇస్తే మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తామని ప్రధాని మోడీ పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మావోయిస్టులను బతికిస్తోంది. ఈ రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు అధికారం ఇస్తే మావోయిస్టులను పూర్తిగా నిర్మూలిస్తామని స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ ముస్లీం లీగ్ అయింది**

కాంగ్రెస్ ముస్లిం లీగ్ కంటే ఎక్కువగా ముస్లిం లీగ్ అయింది. మావోయిస్టులను కాంగ్రెస్ ఎన్నో ఏండ్ల నుండి రక్షిస్తోంది. తెలంగాణ పోలీసులు కేంద్రంతో కలిసి పని చేసి ఉంటే మావోయిస్టులు ఎప్పుడో ఖతం అయ్యే వారు. దేశంలో మావోయిస్టులను అంతం చేసినప్పటికీ తెలంగాణలో ఇంకా ఉన్నారు. కొత్త విజన్, ఆలోచన, వికసిత్ తెలంగాణ పేరుతో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఈ సందర్భంగా ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు.

# ఇందిరా మహిళా శక్తి భవనాలు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

సహాయక సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అడుగు వేసింది. రాష్ట్రంలోని 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి పేరుతో నిర్మిస్తున్న అత్యాధునిక భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్నాయి. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సందర్భంగా వీటిని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగేందుకు ఈ భవనాలు ఇకపై కేంద్ర బిందువులుగా మారనున్నాయి. ఉమ్మడి పది జిల్లాల్లో ఇప్పటికే భవనాలు ఉండగా.. కొత్తగా ఏర్పడిన 22 జిల్లాల్లో ఒక్కో భవనానికి రూ.5 కోట్ల చొప్పున ప్రభుత్వం మొత్తం రూ.110 కోట్లను కేటాయించింది. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అన్ని రకాల మౌలిక సదుపాయాలతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. హనుమకొండ, నిజామాబాద్, జగిత్యాల, ములుగు, సూర్యాపేట, యాదాద్రి వంటి జిల్లాల్లో ఇప్పటికే 17 భవనాల నిర్మాణం



పూర్తి కాగా.. మిగిలిన 5 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ పర్యవేక్షణలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోంది. ఇప్పటివరకు మహిళా సమాఖ్యలకు సొంత కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించాలన్నా, శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలన్నా అద్దె భవనాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇకపై ఆ ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ భవనాల్లో కేవలం కార్యాలయ పనులే కాకుండా, మహిళా సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, మార్కెటింగ్ కార్యకలాపాలు కూడా సాగనున్నాయి. జిల్లా స్థాయి సమావేశాలు, సెమినార్ల నిర్వహణకు ఇవి వేదికలుగా నిలవనున్నాయని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఇదివరకే తెలిపిన సంగతి తెలిసిందే. అయితే, వచ్చే నెల 2వ తేదీ నాటికి ఏవైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మహిళా సాధికారతకు ఈ భవనాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. జూన్ 2న జరిగే సామూహిక ప్రారంభోత్సవ కార్యక్రమం మహిళా లోకానికి ఒక తీపి గుర్తుగా మిగిలిపోనుందని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది.

## సీడీఎస్‌గా సుబ్రమణి



**ఢిల్లీ, మే 10 :** త్రిదళాధిపతిగా (సీడీఎస్) విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి నియమితులయ్యారు. తదుపరి నూతన నౌకాదళాధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ బాధ్యతలు చేపట్టనున్నారు. వీరి నియామకాలను ఖరారు చేస్తూ రక్షణ మంత్రిత్వశాఖ శనివారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్, చైనా వ్యవహారాల్లో నిపుణుడిగా పేరొందిన సుబ్రమణి.. సీడీఎస్ బాధ్యతలతోపాటు రక్షణ మంత్రిత్వశాఖలోని సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగానూ విధులు నిర్వహిస్తారని మంత్రిత్వశాఖ ప్రకటన తెలిపింది.

గతేడాది జులై 31న వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ హోదాలో పదవీ విరమణ చేసిన ఆయన.. ప్రస్తుతం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ కు సైనిక సలహాదారుగా ఉన్నారు. సైనిక దళాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన థియేటరైజేషన్ను అమలు చేయడం, త్రివిధ దళాల మధ్య సమన్వయాన్ని పెంచడం.. సుబ్రమణి ముందున్న ప్రధాన బాధ్యతలు. ప్రస్తుత సీడీఎస్ అనిల్ చౌహాన్ 30న, నౌకాదళాధిపతి దినేశ్ కె.త్రిపాఠి 31న పదవీ విరమణ చేయనున్నారు. వీరి స్థానంలో సుబ్రమణి, స్వామినాథన్ బాధ్యతలు స్వీకరిస్తారు.

**సరిహద్దు భద్రత వ్యవహారాల్లో సిద్ధహస్తుడు..**

లెఫ్టినెంట్ జనరల్ సుబ్రమణి తన 40 ఏళ్ల సైనిక కెరీర్లో జమ్మూ కశ్మీర్, పశ్చిమ, ఉత్తర సరిహద్దు తదితర కీలక ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. పుణెలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీలో, డెహ్రాడూన్ లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో శిక్షణ పొందిన ఆయన గఢ్వాల్ రైఫిల్స్ ఎనిమిదో బెటాలియన్లో అధికారిగా కెరీర్ను ప్రారంభించారు. అస్సాంలో ఉగ్రవాదుల ఏరివేతకు చేపట్టిన 'ఆపరేషన్ రైనో'లో ఓ బెటాలియన్కు నాయకత్వం వహించారు. పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో సైనిక కార్యకలాపాలపై సుబ్రమణికి లోతైన అవగాహన ఉంది. లక్నో ప్రధాన కేంద్రంగా ఉండే సెంట్రల్ కమాండ్ కు అధిపతిగా చేశారు.

## నేను కూడా రాజకీయాలు మాట్లాడను

(మొదటి పేజీ తరువాయి)

అని చమత్కరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పుడు రైల్వే బడ్జెట్లో కనీసం రూ.1,000 కోట్లు కూడా దక్కేవి కావని, నేడు ఒక్క తెలంగాణకే రూ.5,500 కోట్లు కేటాయించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.15 వేల కోట్ల రైల్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయని, తెలంగాణకు ఇప్పటికే 5 వందే భారత్, 6 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెక్స్ రైళ్లు ఇచ్చామని గుర్తు చేశారు.హెచ్ఐసీసీ సభలో సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యను గుర్తు చేస్తూ మోదీ పై విధంగా వ్యాఖ్యానించడంతో అక్కడున్న వారంతా చిరునవ్వులు చిందించారు. గుజరాత్‌కు యూపీఏ హయాంలో ఎన్ని నిధులు ఇచ్చారో తెలంగాణకు అంతే నిధులు ఇస్తే తెలంగాణకు అందుతున్న నిధుల్లో సగం కోత పడుతుందని ప్రధాని వివరించారు. కాబట్టి మీరు ఎక్కడికైతే చేరుకోవాలనుకుంటున్నారో అది సాధ్యం కాదని, మీరు అనుకున్న లక్ష్యాలు నెరవేరాలంటే మాతో కలవాలంటూ సీఎం రేవంత్‌కు ప్రధాని పిలుపునిచ్చారు

**రూ. వేలకోట్ల నిధులు :**

సైబరాబాద్ అభివృద్ధికి వేల కోట్లు రూపాయలు కేటాయించామని, తెలంగాణలో జాతీయ రహదారులు రెట్టింపు అయ్యాయని ప్రధాని తెలిపారు. దేశాభివృద్ధిలో సైబరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాని కొనియాడారు. 'సైబరాబాద్ సామర్థ్యం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరిందని, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాలలో ఈ నగరం అగ్రగామిగా నిలుస్తోందన్నారుజ ఇక్కడ ప్రాణం పోసుకుంటున్న పెద్ద ప్రాజెక్టులు వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయని, హైదరాబాద్ ఇప్పుడు దేశానికే ఉపాధి కేంద్రంగా మారిందని ప్రధాని వెల్లడించారు.తాజాగా బడ్జెట్లో తెలంగాణకే రూ.5,500 కోట్లు రైల్వే పనులకు కేటాయించామని దేశంలో టెక్స్‌టైల్ రంగానికి ఊతమిచ్చేలా నిర్ణయాలు తీసుకున్నామని, వరంగల్ పీఎం మిత్ర పార్కు ద్వారా దేశంలో టెక్స్‌టైల్ రంగానికి ఊతమిస్తుందన్నారు.అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలతో ఉద్యోగ కల్పన జరుగుతుంది. ఉద్యోగ అవకాశాలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని ప్రధాని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, 2014లో ఉమ్మడి ఏపీలో రైల్వే బడ్జెట్ రూ.1000 కోట్లు మాత్రమే కాగా హైదరాబాద్ అభివృద్ధికి వేలాది కోట్లు కేటాయించామన్నారు. రోడ్లు, రైల్ కనెక్టివిటీని పెంచామని, తెలంగాణ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని ప్రధాని తేల్చిచెప్పారు.

### నిధులు కావాలా?

# మేరే సే జోడో

● రేవంత్‌కు ప్రధాని మోడీ ఆఫర్ ● రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చ

**హైదరాబాద్, మే 10, (మనం బ్యూరో) :** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా చేసిన 'మేరే సే జోడో' వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీశాయి. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రూ.9377 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ వేదికపై ప్రధాని మోడీ, సీఎం రేవంత్ మధ్య జరిగిన సంభాషణ హాట్ టాపిక్‌గా మారింది. ఈ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గతంలో మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా మీరు ఉన్న సమయంలో అభివృద్ధి విషయంలో పూర్తి సహకారం అందించారని గుర్తు చేశారు. అదే తరహాలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పెద్ద మనసుతో సహకరించాలని కోరారు. దీనికి కౌంటర్ ఇచ్చిన ప్రధాని మోడీ రేవంత్ వ్యాఖ్యలను చాకచక్యంగా తిప్పికొట్టారు. నాడు గుజరాత్‌కు అందిన నిధుల కంటే నేడు తెలంగాణకు రెట్టింపు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామనీ, రేవంత్ చెప్పినట్లు గుజరాత్ తరహాలోనే నిధులు ఇస్తే తెలంగాణకు ఇప్పుడు వస్తున్న దానిలో సగమే వస్తాయని చమత్కరించారు. తెలంగాణ ప్రగతి కోసం కేంద్రంతో కలసి నడవాలనీ, రాష్ట్రానికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని రాజకీయ కోణంలో చూస్తే రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి కేంద్రంతో సఖ్యతగా ఉండటాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తుందా అనే సరికొత్త రాజకీయ చర్చ రాష్ట్రంలో ప్రధాని మోడీ పర్యటన సందర్భంగా జోరుగా సాగుతోంది.

# ప్రమాణ స్వీకారోత్సవంలో జాతీయ, రాష్ట్ర గీతాల ఆలాపన

● కేంద్రం ఉత్తర్వులు పాటించిన విజయ్

**చెన్నై, మే 10 :** తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ముందు వేదికపై వందేమాతర గేయాన్ని ఆలపించారు. ఆ తర్వాత 'జనగణమన', 'తమిళ తల్లి' గీతాలను ఆలపించారు. అయితే గాయకులు వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలనూ పాడడం అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అన్ని అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరంలోని రెండు భాగాలను మాత్రమే ఆలపిస్తారు. అయితే, ఇకపై అందులోని ఆరు చరణాలనూ పాడాలని సూచిస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే ప్రమాణస్వీకార సమయంలో విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం కేంద్రం నిబంధనలను పాటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బంకించంద్ర ఛటర్జీ తొలుత 1875లో వందేమాతరాన్ని రచించారు. తర్వాత తన ఆనంద్మఠ్ నవలలో దీన్ని భాగం చేశారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం వందేమాతరాన్ని జాతీయ గేయంగా ప్రకటించింది. దీనిలో ఆరు చరణాలుగా ఉండగా..



అందులో మతపరమైన ప్రస్తావన లేని రెండు భాగాలను మాత్రమే నాటి ప్రభుత్వం స్వీకరించింది. అయితే 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆరు చరణాలనూ పాడాలని సూచిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని రకాల పౌర పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని సూచించింది.

## సభలో రాజకీయాలు మాట్లాడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చెందాలని, ప్రధాని మోడీపై తెలంగాణ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ ఎకానమీ చేయడమే తన లక్ష్యమని అన్నారు. ప్రధాని దేశాన్ని అభివృద్ధి చేస్తున్నారని, తెలంగాణ విజ్ఞప్తులను మోడీ వెంటనే పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. ఫ్యూచర్‌సిటీ, మూసీనది అభివృద్ధికి ప్రధాని మోడీ సహకారం అవసరమని, తెలంగాణను నంబర్ 1 చేయడానికి రైజింగ్ పాలసీ తీసుకొచ్చామని తెలిపారు.

## అధికారం కోసం మిత్రుడిని వదిలేసిన కాంగ్రెస్

### కష్ట సమయంలో డీఎంకేను వదలడంపై మోడీ విమర్శ

**చెన్నై, మే 10 :** కాంగ్రెస్ పార్టీవి అవకాశవాద రాజకీయాలని ప్రధాని మోడీ విమర్శించారు. 30 ఏండ్లుగా డీఎంకేతో కాంగ్రెస్‌కు సన్నిహిత సంబంధాలున్నాయని.. ఆ పార్టీతో పొత్తు వల్లే కాంగ్రెస్ అనేకసార్లు సంక్షోభాల నుంచి బయటపడిందని అన్నారు. 2014కు ముందు పదేండ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం డీఎంకే వల్లే మనుగడ సాగించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ కష్టసమయంలో కాంగ్రెస్.. స్టాలిన్ పార్టీని వదిలి టీవీకేతో చేతులు కలిపిందని విమర్శించారు. అధికారంపై ఉన్న దురాశతో.. దొరికిన తొలి అవకాశంలోనే మిత్రుడికి వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందన్నారు.

కర్ణాటకలోనూ అంతర్గత అధికార పోరాటాల కారణంగా సుపరిపాలన అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని మోడీ దుయ్యబట్టారు. గత మూడేండ్లుగా రాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి బదులుగా.. అంతర్గత కలహాలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు. సీఎం ఎంతకాలం కొనసాగుతారో.. మరో వ్యక్తికి అవకాశం లభిస్తుందో లేదో కూడా కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించలేకపోతోందన్నారు. సరైన ఎజెండా లేకపోవడం వల్లే కాంగ్రెస్ కు ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. దేశప్రజల్లో ఆ పార్టీకి ఆదరణ తగ్గిపోతుందన్నారు.

సురక్షిత పాలన, అభివృద్ధి కోసం దేశ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. అందువల్లే తాజా ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రజలు కాషాయ పార్టీకి పట్టం కట్టారన్నారు. భవిష్యత్తులో కర్ణాటకలోనూ భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## 9 మంది మంత్రుల ప్రమాణ స్వీకారం

**చెన్నై, మే 10 :** తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు మరో తొమ్మిది మంది టీవీకే నేతలు మంత్రులుగా ప్రమాణం చేశారు. యువత, రాజకీయ అనుభవానికి తన క్యాబినెట్లో ప్రాధాన్యం కల్పించిన విజయ్.. పరిపాలనలోనూ సహాయంగా ఉండేలా సహచరులను ఎంచుకున్నారు.

# నేటి నుంచి విద్యా వారోత్సవాలు

- ఎల్బీ స్టేడియంలో ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 10 : ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యాశాఖ ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వారోత్సవాలను నిర్వహించనుంది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, విద్యా నాణ్యత మెరుగుదలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమాన్ని రేపు సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ వేదికపై నుంచి క్యూర్ రీజియన్లోని పాఠశాలలకు సంబంధించిన వివిధ అభివృద్ధి పనులను, మౌలిక సదుపాయాల కల్పన కార్యక్రమాలను సీఎం ప్రారంభించనున్నారు. ఈ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమానికి సంబంధించి ఆయా జిల్లాల డీఈఓలకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రేటర్ పరిధిలోని విద్యార్థులను 15 వేల మంది విద్యార్థులను బస్సుల ద్వారా కార్యక్రమానికి హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర గీతంతో వారోత్సవాల కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం పాఠశాల బ్యాండ్లు, ఎన్సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలు మార్చ్ పాస్ట్ నిర్వహిస్తారు. కార్యక్రమంలో ప్రతిభా అవార్డులు ప్రదానం చేయనున్నారు. అలాగే ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించిన కేజీబీవీ యంగ్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎక్సెలెన్స్ విద్యార్థులకు ల్యాప్ టాప్స్ పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభ్యసన కేంద్రాలుగా మార్చడం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తోడ్పడటం. వారం రోజుల పాటు పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విజయాలు, ఉపాధ్యాయుల చొరవలు, కొత్త అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, స్థానిక కమ్యూనిటీ సభ్యులను ఈ ఉత్సవాల్లో భాగస్వాములను చేస్తారు. పాఠశాలల్లో సృజనాత్మక ప్రదర్శనలు, హాజరు గుర్తింపు వంటి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా సాగుతాయి. Also Read - బంగారం కొనడం మానేద్దాం : దేశ ప్రజలకు మోడీ పిలుపు

**వారం రోజుల పాటు కార్యక్రమాలు:**

మే 11న పీఎంశ్రీ పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులను ప్రారంభిస్తారు. ఈ క్యాంపులో అకడమిక్, కోడింగ్, కళలు, క్రీడలు, యోగా నేర్పిస్తారు. 12 న పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు పీఎంశ్రీ పాఠశాలల్లో రెమిడియల్ క్యాంపులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహిస్తారు. 13న జిల్లా స్థాయిలో అందరు సర్పంచులను ఆహ్వానించి సమావేశం నిర్వహిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, అకడమిక్ కార్యక్రమాలు వివరించాల్సి ఉంటుంది. మే 14 న బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారు. అన్ని పాఠశాలలను శుభ్రపరిచి అలంకరించి ఇంటింటికి ప్రవేశాలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. తల్లిదండ్రులతో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఉంటుంది. మే 15న పాఠశాలలు, గ్రామ కమ్యూనిటీ లైబ్రరీలో కార్యక్రమాలు ఉంటాయి. పుస్తక ప్రదర్శనలు, పఠన పోటీలు నిర్వహిస్తారు. మే 16న మండల స్థాయిలో విద్యార్థులకు ఆరట్స్ అండ్ క్రాఫట్స్ పై శిక్షణ ఇస్తారు. కళలు, హస్తకళలు, సంగీతం, నాట్యం, నాటకం, సాహిత్య తదితర సాంస్కృతిక పోటీలు ఉంటాయి. పర్యావరణ హిత పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయాల్సి ఉంటుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతిభా ప్రదర్శనలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపాల్సి ఉంటుంది. మే 17 న ప్రతి జిల్లా కేంద్రంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, టీచర్లకు సన్మాన కార్యక్రమంతో పాటు, కల్చరల్ ప్రోగ్రాంలను నిర్వహిస్తారు.

# మైనర్ బాలికపై బలత్కారం

- కేంద్ర మంత్రి కుమారుడిపై పోక్సో కేసు?.. ఎందుకు పెట్టలే
- మండిపడ్డ ఆర్ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, మనం ప్రతినిధి : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్పై పోక్సో కేసుకు సంబంధించి బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కీలక విషయాలు వెల్లడించారు. తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని స్వయంగా మైనర్ బాలిక వచ్చి పోలీసుల ముందు చెప్పిందని తెలిపారు. బాధితురాలు న్యాయం కోసం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఇంతకీ ఆమె ఏం పాపం చేసింది, ఆమె కుటుంబం చేసిన పాపమేంటని ప్రశ్నించారు. ఈ మేరకు హైదరాబాద్లోని తెలంగాణ భవన్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. బాధితురాలి తల్లితో తానే స్వయంగా మాట్లాడానని తెలిపారు. బిడ్డకు న్యాయం జరగాలని ఆ తల్లి పడ్డ వేదన బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశంలో న్యాయం ఇంత ఘోరంగా ఉంటుందా అని వ్యాఖ్యానించారు. చట్టం ఉన్నవాళ్లకు చుట్టంలా ఉంటదా అని అనిపిస్తోందని మండిపడ్డారు. ఆ తల్లితో మాట్లాడుతుంటే.. ఆమె చెప్పిన విషయాలు బాధ కలిగించాయని వివరించారు. 'మే 8వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో ఆమె పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్కు వెళ్లింది. అక్కడ కంప్లయింట్ అక్నాలెడ్జ్మెంట్ ఇవ్వడానికి 5 గంటల సమయం పట్టిందని దుయ్యబట్టారు. కంప్లయింట్లో ఉన్న కంటెంట్ మార్చాలని పోలీసులు ఒత్తిడి పెట్టారని ఆయన ఆరోపించారు. ఇందులో పెద్దపెద్ద వాళ్లు ఉన్నారని బెదిరించారు. పెద్దపెద్ద వాళ్ల పేర్లు రాయొద్దని సూచించారని, చివరకు ఆ తల్లి నా బిడ్డ, నేను మోదీ సభలో ఆత్మహత్య చేసుకుంటామని భయపెడితే తప్ప కంప్లయింట్కు అక్నాలెడ్జ్మెంట్ ఇచ్చారన్నారు. అప్పటికి కూడా ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ వారికి ఇవ్వలేదని,. ఎఫ్ఐఆర్ కాపీ వచ్చిందో? రాలేదో? బాధితులకు తెలియదన్నారు. తాను ఆ తల్లితో మాట్లాడిన తర్వాతే ఎఫ్ఐఆర్ డీటెయిల్స్ తెలిశాయని... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇది హోంమంత్రిగా ఉన్న రేవంత్ పాలనలో నాలుగు పాదాలపై నడుస్తున్న ధర్మమని మండిపడ్డారు. ఈ దేశానికి స్వయంగా మీరు ప్రధాని.. అంటూ మీ నోటా.. బేటీ బచావో అనే నినాదం వచ్చిందని గుర్తు చేశారు. కానీ, ఈ దేశంలో మహిళలపై అడుగడుగునా అఘాయిత్యాలు జరుగుతున్నాయి.

# 18న లాసెట్

## రేపటి నుంచి హాల్ టికెట్స్ డౌన్లోడ్స్

## లేట్ ఫీజుతో 15 వరకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు

హైదరాబాద్, మే 10 : రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ లాసెట్, పీజీ ఎల్ సెట్ 2026 పరీక్షలు ఈనెల మే 18న నిర్వహించనున్నట్లుగా ప్రవేశ పరీక్షల కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి ఇవాళ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షను ఉన్నత విద్యామండలి తరపున ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహించనుంది. ఈ ఏడాది మొత్తం మూడు సెషన్లలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహించనున్నారు. మూడేళ్ల లా కోర్సుకు సంబంధించి ఉదయం 9.30 నుంచి 11 వరకు సెషన్ 1, మధ్యాహ్నం 12.30 నుంచి 2 వరకు సెషన్ 2 పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు మొత్తం 47,400 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా కోర్సు, పీజీఎల్సెట్ పరీక్ష సాయంత్రం 4 నుంచి 5.30 వరకు జరుగనుంది. టీజీ లాసెట్ పరీక్షకు 14,020 మంది, పీజీ కోర్సు కోసం 5,200 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. మొత్తంగా మూడు సెషనల్లో నిర్వహించే ఈ పరీక్షల కోసం ఇప్పటివరకు 66,620 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ వెల్లడించారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ వివరాలను నమోదు చేసి, మే 12వ తేదీ నుండి అధికారిక వెబ్సైట్ ద్వారా హాల్టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకోని వారికి ఆలస్య రుసుముతో దరఖాస్తు చేసుకునేందుకు చివరి అవకాశం కల్పించారు. రూ. 4,000 ఆలస్య రుసుముతో మే 13 వరకు, రూ. 10,000 ఆలస్య రుసుముతో మే 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

# రెండో రోజుకు చేరిన వీహెచ్ నిరవధిక దీక్ష




హైదరాబాద్, మే 10 : జనగణనలో ఓబీసీల కులగణనను చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు చేపట్టిన నిరవధిక దీక్ష రెండో రోజుకు చేరింది. హైదరాబాద్ అంబర్ పేటలోని ఆయన నివాసం వద్ద దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష శిబిరాన్ని పీసీసీ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ యాదవ్, యాదగిరి శ్రీకాంత్ గౌడ్తో పాటు పెద్ద ఎత్తున కాంగ్రెస్, బీసీ నాయకులు తరలివచ్చి వీహెచ్ కు సంఘీభావం ప్రకటించారు. ఆదివారం అంబర్ పేట సీఐ కిరణ్ కుమార్ వీహెచ్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

# ప్రధాని మోడీకి.. బేగంపేట ఎయిర్ పోర్టులో ఘనస్వాగతం

- తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన
- స్వాగతం పలికిన గవర్నర్, డిప్యూటీ సీఎం భట్టి
- రూ.9,377 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్లో బహిరంగ సభ
- మూడోసారి ప్రధాని అయ్యాక రాష్ట్రానికి తొలిసారి రాక

హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన నిమిత్తం ఆదివారం హైదరాబాద్కు చేరుకున్నారు. ఈ సందర్భంగా బేగంపేట విమానాశ్రయంలో దిగిన ఆయనకు తెలంగాణ ప్రభుత్వం తరఫున గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బీజేపీ నేతలు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని రోడ్డు మార్గంలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)కి బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మొత్తం రూ.9,377 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసి వాటిని జాతికి అంకితం చేశారు. అభివృద్ధి కార్యక్రమాల అనంతరం సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. 3వ ప్రధాని అయ్యాక మోడీ రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి కావడంతో ఈ పర్యటనకు రాజకీయంగా ప్రాధాన్యం ఏర్పడింది. ప్రధాని పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ నగర వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతతో పాటు పటిష్ఠమైన నిఘా ఏర్పాటుచేసినట్లు అటు పోలీసులతో పాటు ఇటు పార్టీ శ్రేణులు సైతం తెలిపాయి. బహిరంగ సభ ముగిశాక మోడీతో తెలంగాణ బీజేపీ నేతలు సమావేశమైనట్లు పార్టీ నేతలు వెల్లడించారు.

# రేపు.. బీఆర్ఎస్ కీలక సమావేశం

- ఎర్రవెల్లి ఫామ్ హౌజ్లో కేసీఆర్ అధ్యక్షతన మీటింగ్
- కేటీఆర్ సహా..హాజరుకానున్న పార్టీ ప్రధాన కార్యదర్శులు, అసెంబ్లీ, మండలి ఉప నేతలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఈనెల 12న(రేపు) బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన కీలక సమావేశం జరగనున్నది. ఈ మేరకు మంగళవారం,మధ్యాహ్నం 2 గంటలకు కేసీఆర్ ఫామ్ హౌజ్ ఎర్రవెల్లి నివాసంలో సమావేశం జరగనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా...పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసన సభాపక్షాల ఉప నాయకులు పాల్గొననున్నట్లు పార్టీ వెల్లడించింది. మధ్యాహ్నం లంచ్ అనంతరం జరిగే సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, పార్టీ ఇన్చార్జిల నియామకం..సహా పార్టీ బలోపేతం, తదితర విషయాలపై కీలక చర్చ జరుగనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

# మానవత్వం చాటిన ప్రధాని మోడీ

## బీఆర్ఎస్ నేత కొడుకు పెళ్లి..

## హెలికాప్టర్ ల్యాండింగ్ రద్దు.. 18 కిలోమీటర్లు రోడ్డు మార్గంలో ప్రధాని ప్రయాణం

## పెళ్లి వేడుకకు భద్రతాపరమైన ఇబ్బందులు కలగకూడదనే ఈ నిర్ణయం

## రాజకీయాలకు అతీతంగా ప్రధాని చూపిన చొరవపై ప్రశంసలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ప్రధాని నరేంద్ర మోదీ తన హైదరాబాద్ పర్యటనలో పెద్ద మనసు చాటుకున్నారు. ఒక వివాహ వేడుకకు తన వల్ల ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో, చివరి నిమిషంలో తన ప్రయాణ ప్రణాళికను మార్చుకుని అందరి మన్ననలు పొందారు. రాజకీయాలకు అతీతంగా ఆయన తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రధాని మోడీ తెలంగాణకు వచ్చారు. షెడ్యూల్ ప్రకారం, ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ హైటెక్ సిటీ.. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే, అదే ప్రాంగణంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి కుమారుడు అజిత్రెడ్డి, ఐపీఎస్ అధికారిణి లక్ష్మీ సౌజన్యల వివాహం జరగాల్సి ఉంది. ఈ విషయం ప్రధాని దృష్టికి వెళ్లగానే, ఆయన వెంటనే స్పందించారు. తన భద్రతా ఏర్పాట్ల వల్ల పెళ్లికి హాజరయ్యే దాదాపు 5,000 మంది అతిథులకు, కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని సూచించారు. దీంతో అధికారులు హెలికాప్టర్ ల్యాండింగ్ను మరోచోటికి మార్చి, అక్కడి నుంచి ప్రధాని దాదాపు 18 కిలోమీటర్ల దూరం రోడ్డు మార్గంలో ప్రయాణించి వేదికకు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ప్రధాని మోడీ తెలంగాణలో రూ.9,400 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. వరంగల్లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి 'పీఎం మిత్ర పార్క్' (కాకతీయ మెగా టెక్స్టైల్స్ పార్క్), మహబూబ్నగర్-గూడెబెల్లూరు మధ్య 167వ నంబరు జాతీయ రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు.

# పవన్కి.. ప్రధాని మోడీ పరామర్శ

## హైదరాబాద్ పర్యటన సందర్భంగా పవన్ ఇంటికి వెళ్లి పరామర్శించిన ప్రధాని

## ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష..

## ఇంటికి వచ్చి మరి పరామర్శించడం పట్ల మోడీకి పవన్ కృతజ్ఞతలు

హైదరాబాద్, మనం ప్రతినిధి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కను ప్రధాని నరేంద్ర మోడీ పరామర్శించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న ప్రధాని, ఆదివారం జూబ్లీహిల్స్లోని పవన్ కల్యాణ్ నివాసానికి ఆయన ప్రత్యేకంగా వెళ్లారు. ఇటీవల సైనస్ సమస్య కారణంగా పవన్ శస్త్రచికిత్స చేయించుకుని, ప్రస్తుతం ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ను కలుసుకున్న మోడీ, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని, తిరిగి ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టాలని ఆకాంక్షించారు. తన కోసం స్వయంగా ఇంటికి వచ్చి పరామర్శించడం పట్ల పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీకి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పవన్ను పరామర్శించిన అనంతరం, మోడీ జూబ్లీహిల్స్లోనే ఉన్న పొరుగు రాష్ట్రం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి ఆయన వెళ్లారు.



# రూ. 9,377 కోట్ల విలువైన అభివృద్ధి పనులు

(మొదటి పేజీ తరువాయి)




**సైబరాబాద్లోనే..పెద్ద ప్రాజెక్టులు :**

గుజరాత్తో సమానంగా తెలంగాణకు నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని మోదీ ప్రకటించారు. సైబరాబాద్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, అనేక పెద్ద ప్రాజెక్టులు ఇక్కడ ప్రాణం పోసుకుంటున్నాయని తెలిపారు. సైబరాబాద్ అతి పెద్ద ఉపాధి కేంద్రంగా మారిందన్న మోదీ, సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని గుర్తు చేశారు. సైబరాబాద్ సామర్థ్యం జాతీయంగా, ప్రపంచవ్యాప్తంగా ఉందని, తెలంగాణకు, దేశానికి వికాస కేంద్రంగా దోహదపడుతోందన్నారు. సైబరాబాద్ తెలంగాణకు దేశానికి పెద్ద ఉత్పత్తి తయారీ కేంద్రంగా అవతరించిందని, అక్కడ అనేక పెద్ద పెద్ద ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయన్నారు. సైబర్ టెక్నాలజీ, విద్యుత్, ఈవీ రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోందని ప్రధాన వివరించారు. వరంగల్ పీఎం మిత్ర టెక్స్టైల్ పార్కును ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని, టెక్స్టైల్ రంగంలో వరంగల్ పీఎం మిత్ర పార్కు కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని ఆకాంక్షించారు. దీంతో అక్కడ ఉద్యోగావకాశాలు భారీగా వస్తాయని వివరించారు. .

**తెలంగాణ రైల్వే బడ్జెట్ :**

ఉమ్మడి ఏపీ కంటే తెలంగాణకు రైల్వే బడ్జెట్ పెంచామని ప్రధాని మోదీ తెలిపారు. హైవేలపై కేంద్రం రూ.లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, వాటి అభివృద్ధి ద్వారా తెలంగాణ కూడా లాభపడుతోందన్నారు. ఉమ్మడి ఏపీలో రైల్వే బడ్జెట్లో రూ.వెయ్యి కోట్లు కూడా దక్కేవి కావని గుర్తు చేశారు. ఇప్పుడు ఒక్క తెలంగాణకే రూ.ఐదున్నర వేల కోట్లు కేటాయించామని తెలిపారు. 'సీఎం రేవంత్తెడ్డి గారూ ఇది వింటున్నారా? తెలంగాణ అభివృద్ధికి కేంద్రం భరోసా ఇస్తుందంటూ ప్రధాని మోదీ ప్రత్యేకంగా చెప్పారు. తెలంగాణ వికసిస్తే దేశం కూడా వికసిస్తుందని అన్నారు.తెలంగాణలో గత పదేళ్లలో జాతీయ రహదారులు రెట్టింపు అయ్యాయని ప్రధాని మోడీ గుర్తు చేశారు. ముఖ్యంగా రైల్వే రంగంలో రాష్ట్రానికి అందుతున్న ప్రాధాన్యతను ఆయన గణాంకాలతో వివరించారు. 2014కు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెయ్యి కోట్ల కంటే తక్కువ రైల్వే బడ్జెట్ ఉండేదని, కానీ ఇప్పుడు కేవలం తెలంగాణకే ఏడాదికి రూ. 5,500 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ. 15 వేల కోట్ల విలువైన రైల్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.తెలంగాణ ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే 5 వందే భారత్ ఎక్స్ప్రెస్ రైళ్లు , 6 అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ రైళ్లను అందించినట్లు వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని తాను బలంగా నమ్ముతానని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడంలో కేంద్ర ప్రభుత్వంతో కలిసి సాగాలని ఆయన సూచించారు.

**శంకు స్థాపనలు :**

హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ వేదికగా తెలంగాణకు ప్రధాని వరాల జల్లు కురిపించారు. సుమారు రూ. 9,377 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు , శంకుస్థాపనలు చేశారు.హైదరాబాద్-పనాజీ ఎకనామిక్ కారిడార్ (ఎన్హెచ్-167)లో భాగంగా గుడెబల్లూర్ నుంచి మహబూబ్నగర్ వరకు రూ.3,180 కోట్లతో నిర్మించనున్న 4 లేన్ల రహదారి పనులకు వర్చువల్ విధానంలో ప్రధాని పునాది వేశారు. అలాగే రూ.2,360 కోట్లతో జహీరాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా అభివృద్ధి పనులకు శంకుస్థాపన గావించారు. కాజీపేట-విజయవాడ మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులో భాగంగా పూర్తయిన రూ.1,250 కోట్ల వివిధ విభాగాల పనుల ప్రారంభించారు. కాజీపేటలో రూ.300 కోట్లతో నిర్మించిన రైల్ అండర్ రైల్ బైపాస్ లైన్ ప్రారంభంవరంగల్లో రూ.1700 కోట్ల అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన పీఎం మిత్ర పార్క్(కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్)ను జాతికి అంకితం చేశారు. అదేవిధంగా దాదాపు రూ. 610 కోట్లతో హైదరాబాద్ మల్కాపూర్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ నిర్మించిన అత్యాధునిక గ్రీన్ ఫీల్ పీఓఎల్ టెర్మినల్ను మోదీ ప్రారంభించారు.

**గుజరాత్కు మన్మోహన్ : సీఎం**

హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ వేదికగా సీఎం రేవంత్రెడ్డి మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ హయాంలో ప్రధాని మన్మోహన్ సింగ్ గుజరాత్ అభివృద్ధికి ఎలా సహకరించారో, ఇప్పుడు తెలంగాణకు ప్రధాని మోడీఈ అలాగే సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన ప్రధాని మోడీ.. రాజకీయాల గురించి మాట్లాడనని రేవంత్ రెడ్డి అన్నారు, తాను కూడా ఇక్కడ రాజకీయాలు మాట్లాడను. కానీ వాస్తవాలను గమనించాలి అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఒకవేళ గత పదేళ్లలో గుజరాత్కు ఇచ్చినన్ని నిధులే తెలంగాణకు ఇస్తే, ఇప్పుడు వస్తున్న దానికంటే సగం నిధులు మాత్రమే వస్తాయన్నారు. అప్పుడు మీరు ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగదని చురకలంటించారు. రాజకీయాలకు అతీతంగా మాతో కలిసి పనిచేయాలని సీఎంకు సూచించారు.

# భయపడటానికి నేను ఫామ్ హౌజ్లో ఎలుకను కాదు

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్,మే 10(మనం న్యూస్): 'జై శ్రీరామ్' అనే నినాదం వింటేనే కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 'జై శ్రీరామ్' అంటే కడుపు నిండుతుందా? అని కాంగ్రెస్ నేతలు హేళనగా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. అదే నినాదంతో బెంగాల్లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిందనే విషయాన్ని కాంగ్రెస్ నేతలు మర్చిపోవద్దని, తెలంగాణలోనూ వచ్చే ఎన్నికల్లో పక్కాగా బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సనాతన ధర్మం కోసం భాజాపానిరంతరం పనిచేస్తుందని,మా ధర్మాన్ని కించపరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు' అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

**ఆరు గ్యారంటీలపై నిలదీత:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీ ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఈ



క్రమంలోనే రాష్ట్ర బీజేపీ నేతలకు కీలక సూచన చేశారు. నాయకులు తమ మధ్య ఉన్న అభిప్రాయభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజకీయ ప్రత్యర్థులపై విరుచుకుపడుతూ.. 'బీజేపీ కార్యకర్తను అయినందుకు నేను ఎంతగానో గర్వపడుతున్నానని, పార్టీ తల వంచుకునే పని నేను ఎప్పుడూ చేయలేదు. నన్ను రాజకీయంగా ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బెదిరింపులకు భయపడటానికి నేనేమీ ఫామ్హౌజ్లో దాక్కునే ఎలుకను కాదు' అని బండి సంజయ్ ఫైర్ అయ్యారు.

# తెలంగాణతో ప్రధానికి ప్రత్యేక అనుబంధం

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకంటే నాడు నిజాం నుంచి హైదరాబాద్ స్టేట్ను దేశంలో విలీనం చేసిన రోజు సెప్టెంబర్ 17 అని, అదే రోజు ప్రధాని మోడీ పుట్టిన రోజు అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అయితే, ప్రధాని తెలంగాణలో అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 9,700 కోట్ల ప్రాజెక్టులను రాష్ట్రానికి, దేశానికి అంకితం చేశారని తెలిపారు. నాడు భారత దేశంలో నక్సలైట్లు బీజేపీ, ఏబీవీపీ కార్యకర్తలను హతమార్చారని గుర్తుచేశారు. నేడు భారత దేశం మొత్తం కూడా నక్సలైట్స్ ముక్త్ భారత్గా అవతరించిందని, దాని ఘనత నరేంద్ర మోడీదన్నారు. మనం దేశ వ్యతిరేక శక్తులతో పోరాడుతున్నామని ఫైర్ అయ్యారు. దేశాన్ని దక్షిణాది, ఉత్తరాది అంటూ విభజించే పార్టీలతో కొట్లాడుతున్నామని వివరించారు. కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని దోచుకున్న శక్తులతో మనం పోరాడుతున్నామని చెప్పుకొచ్చారు.

# డిజిటల్ యుగంలో గ్రంథాలయాల ఆవశ్యకత



ప్రాచీన కాలంలో కావ్యాలను తాటాకుల మీద రాసేవారు. వాటిని అన్నింటిని కలిపి ముడి వేసేవారు. 'గ్రంథీ' అంటే 'ముడి' అని అర్థం. అలా అది గ్రంథమైంది. నేటి కాలంలో దానినే మనం పుస్తకం అని వ్యవహరిస్తున్నాము. అనేక అక్షరాల సమాహారమే పుస్తకం. 'అక్షరం ' అంటే నాశనం లేనిది అని అర్థం. కానీ నేడు అక్షరం నశిస్తోంది. తాళపత్ర గ్రంథాల నుంచి పుస్తకాల దాకా పరిణామం చెంది నేడు కనుమరుగువుతోంది. దానిని కాపాడుకోవడం అందరి బాధ్యత.

పుస్తకాలు జ్ఞానభాండాగారాలు. అవి మనలో జ్ఞాన జ్యోతులను వెలిగిస్తాయి. దానివల్ల మన జీవితాలను దేదీప్యమానం చేసుకోవచ్చు. అందుకే 'పుస్తకం హస్తభూషణం' అన్నారు పెద్దలు. అత్యంత వేగంగా మారుతున్న నేటి సాంకేతిక యుగంలో ఆ స్థానంలో ( చేతిలో) సెల్‌ఫోన్ వచ్చి చేరింది. సెల్‌ఫోన్ చేతిలో వుంటే ప్రపంచం గుప్పిట్లో ఉంటుందన్న మాట వాస్తవమే అయినా అతి వాడకం వల్ల వెర్రితలలు వేస్తోంది. ఇది ఎవరికీ మంచిది కాదు. ఈ విషయంలో పుస్తక ప్రియులకు, రచయితలకు, కవులకు, మేధావులకు భవిష్యత్తరాలపట్ల బెంగ పట్టుకుంది. సామాజిక బాధ్యతతో వీళ్ళలో కొందరు పుస్తకాన్ని పునరుజ్జీవింపజేసే ప్రయత్నం మొదలు పెట్టారు. అందులో భాగంగా మరో గ్రంథాలయోద్యమం పురుడు పోసుకుంది. సాంకేతికాభివృద్ధిని తప్పకుండా స్వాగతించాలి. కానీ పూర్వపద్ధతులకు తిలోదకాలివ్వడం సరైంది కాదు. కంప్యూటర్, సెల్‌ఫోన్ లాంటి ఆధునిక పరికరాలు పుస్తకానికి ప్రత్యామ్నాయం కాదు. కానీ జరుగుతున్నది అదే. పుస్తకం విలువ పుస్తకానిదే. చేతితో పుస్తకం పట్టుకొని పేజీ పేజీ తిరగేస్తూ చదివితే కలిగే అనుభూతి పుస్తక ప్రియులకు మాత్రమే అవగతమవుతుంది.

పుస్తకాన్ని పునరుజ్జీవింపజేయడంలో భాగంగా వ్యక్తిగత స్థాయిలో గ్రంథాలయాల ఏర్పాట్లు జరుగుతున్నాయి. 2003లో నేను పనిచేసిన లాలాపేట బాలికోన్నత పాఠశాలలో గ్రంథాలయం లేదు. కారణం అది అప్‌గ్రేడెడ్ పాఠశాల కావడమే. పుస్తకాల ప్రియులమైన కొందరు ఉపాధ్యాయులం ఆ ఆవశ్యకతను గుర్తించాం. గ్రంథాలయ ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలుపెట్టాం. హైదరాబాదు బుక్ ట్రస్టు నిర్వాహకురాలు గీతారామస్వామి కొన్ని పుస్తకాలు ఉచితంగా యిచ్చారు. మంచి పుస్తకం పబ్లిషర్ సురేశ్ మరికొన్ని పుస్తకాలు ఇచ్చారు. పిల్లల రచయిత భూపాల్ ఇంకొన్ని పుస్తకాలు ఇచ్చారు. మణికొండ వేదకుమార్ మూడు అల్మారాలను విరాళంగా యిచ్చారు. ఈ విధంగా పాఠశాలలో గ్రంథాలయం ఏర్పడింది. దానిని రెడ్డి రాఘవయ్యగారు ప్రారంభించారు.

2020లో ప్రధానోపాధ్యాయులుగా పదవీవిరమణ పొందిన సి.హెచ్ మల్లేశం తమ గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసారు. గ్రేడ్‌వన్ తెలుగు ఉపాధ్యాయునిగా పదవీ విరమణ పొందిన హనుమయ్య కొడంగల్ మండలంలో తమ స్వగ్రామమైన సంగాయిపల్లిలో 2024 ఏప్రిల్ 24 తేదీన తమ తల్లిదండ్రుల పేరిట కీశే శివమ్మఅచ్చప్ప స్మారకగ్రంథాలయం ఏర్పాటు చేసారు. అందులో 3000 పుస్తకాలున్నాయి. వాటితో పాటు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు కూడా ఉన్నాయి. ఆ గ్రంథాలయం ఉదయం ఎనిమిది గంటలనుంచి పదకొండు గంటలవరకు పనిచేస్తుంది. సాయంత్రం ఐదు గంటలనుంచి రాత్రి ఎనిమిది గంటలదాకా పనిచేస్తుందని చెప్పారు. దాని నిర్వహణ కొరకు తన పెన్షన్ డబ్బుల నుంచి నెలకు 3000/ రూపాయలను వేతనంగా చెల్లిస్తూ ఒక ఉద్యోగిని నియమించారు.

మణికొండ వేదకుమార్ గారు బాలచెలిమి పేరుతో వంద గ్రంథాలయాలను స్థాపించే దిశగా ఇప్పటికే పాతిక గ్రంథాలయాలను పాఠశాలల్లో ఏర్పాటు చేసారు. కాసుల రవికుమార్ శోభ దంపతులు లీడ్ లైబ్రరీ పేరుతో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇలా వ్యక్తిగత స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలతోపాటు మంచికంటి వెంకటేశ్వర్లుగారి సైకిల్ యాత్రవల్ల మరో గ్రంథాలయోద్యమం ఊపందుకుంది.

ఈ సందర్భంగా ప్రాచీన గ్రంథాలయోద్యమాన్ని ప్రస్తావించడం అవసరం. 1886లో విశాఖపట్టణంలో మంతెన సూర్యనారాయణ మూర్తి మొదటి గ్రంథాలయాన్ని స్థాపించినట్లు తెలుస్తోంది. 1905 నాటికి ఇలాంటివి 20పైగా ఏర్పాటయ్యాయి. 1913కు వాటి సంఖ్య 123కు చేరింది. ఆ తర్వాత అయ్యంకి వెంకటరమణయ్య గారి నాయకత్వంలో గ్రంథాలయోద్యమం మొదలైంది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కొమర్రాజు లక్ష్మణరావు, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి లాంటి మహా మహుల కృషితో గ్రంథాలయోద్యమం ఊపందుకుంది. అది ప్రజలను చైతనపరుస్తూ ఆనాటి రాజకీయ, సామాజికావసరాలను తీర్చింది. అలాగే నేటి సామాజికావసరాలకు అనుగుణంగా అతిగా సెల్‌ఫోన్ వాడకం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరిస్తూ పుస్తక పఠనం వల్ల కలిగే ఆనందానుభూతులను విశదపరుస్తూ పఠనాసక్తిని పెంచడం మరో గ్రంథాలయోద్యమం ప్రధాన లక్ష్యం. భారతదేశంలోనే ఉన్న పుస్తకాల గ్రామం గురించి తెలుసుకోవడం ఈసందర్భంగా చాలా అవసరం. మహారాష్ట్రలోని 'భిలార్'అనే ఊరు దేశంలోనే మొదటి పుస్తకాల గ్రామమని మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అది విస్తీర్ణంలో, జనాభాలో చాలా చిన్న గ్రామం. 35 ఇళ్ళు మాత్రమే ఉన్నాయి. ప్రతి ఇంట్లో కనీసం వెయ్యి పుస్తకాలతో ఒక గ్రంథాలయం ఉండడం ఆ వూరి ప్రత్యేకత. అది అప్పటి సాంస్కృతిక శాఖా మంత్రి వినోద్ థావ్ డే కృషి వల్ల జరిగింది. ప్రభుత్వాలు తలచుకుంటే ఏదైనా సాధ్యమేననడానికి ఇదొక ఉదాహరణ.

తెలుగు రాష్ట్రాలలో ఇలాంటి ప్రగతి జరిగేదాకా మరో గ్రంథాలయోద్యమం నిరంతరం కృషి చేస్తోంది. పుస్తకంతో నడక, పార్కుల్లో పుస్తక పఠనం, ప్రభుత్వ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి మూడో తేదీదాకా బస్‌యాత్రను చేపట్టింది. దానిలోప్రభుత్వాధికారులు, కలెక్టర్లు, విద్యావేత్తలు, మేధావులు, కవులు, రచయితలు, ప్రజాసంఘాలు, ప్రచురణ కర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మొదలైనవారు భాగమయ్యారు.



2026ఫిబ్రవరి ఒకటవతేదీన అఫ్జల్ గంజ్ స్టేట్ సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డా. రియాజ్ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కవి యాకూబ్, వొమ్మి రమేశ్ బాబు, సామాజిక వేత్త సజయ మొదలైన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. తర్వాత మరో గ్రంథాలయోద్యమ సభ్యులతో బస్సు ఉస్మానియా విశ్వ విద్యాలయంలోని ఆరట్స్ కాలేజీవద్దకు చేరుకుంది. అక్కడ వీక్షణం పత్రిక ఎడిటర్ ఎన్.వేణు గోపాల్, ఈనాడు దినపత్రిక ఎడిటర్ నాగేశ్వరరావు, సాహిత్య విమర్శకుడు ఏ కే ప్రభాకర్, యాత్రనుద్దేశించి ప్రసంగించారు. ఆర్ట్స్ కాలేజీ ప్రిన్స్‌పాల్ ప్రో.కాశీం పుస్తకం ప్రాముఖ్యతను గురించి మాట్లాడి 'జయహో పుస్తకం 'ను ఆవిష్కరించారు.

తరువాత పుస్తక బస్సు యాత్ర మధ్యాహ్నానికి భువనగిరికి చేరుకుంది. అక్కడ పౌర గ్రంథాలయంలో ప్రజాసంఘాలతో సమావేశం ఏర్పాటు చేసారు. ప్రచురణ కర్త మలుపు బాల్ రెడ్డి, డి.టి.ఎఫ్ శ్రీనివాసాచార్యులు, స్థానిక నాయకులు, యాత్రలో పాల్గొన్న పలువురు సభ్యులు గ్రంథాలయ ఆవశ్యకతను వివరించారు. అక్కడినుంచి మధ్యాహ్న భోజనం ముగించుకొని రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామానికి చేరుకున్నాం. పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ళ విఠలాచార్య గ్రంథాలయంలో పలువురు ప్రముఖులు స్వాగతం పలికారు. ఆ గ్రంథాలయం ఎందరో పరిశోధకులను, ఉన్నతోద్యోగులను సమాజానికి అందించింది. విఠలాచార్యగారిని కలిసి ముచ్చటించడం అద్భుతమైన అనుభవం. 86ఏళ్ళ వయసులో కూడా ఆయన నిలువెత్తు పుస్తకంలాగా అగుపించారు. అక్కడి నుంచి నల్గొండ మహాత్మాగాంధీ యూనివర్శిటీకి వెళ్ళాం. తెలుగుశాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న అనిత ఆదివారం కావడంవల్ల హాస్టల్ విద్యార్థులతో స్వాగతం పలికారు. ఆ చల్లని సాయంకాలం వేళలో యూనివర్శిటీ ప్రాంగణంలో చెట్లకింద సమావేశమయ్యాం. తెలుగు ఎం. ఏ రెండు తరగతులలో కలిపి 150 పై చిలుకు విద్యార్థులుండడం చాలా సంతోషాన్నిచ్చింది. నేను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో చదివిన అనుభవాలను వాళ్ళతో పంచుకున్నాను. వాళ్ళ ఉత్సాహాన్ని చూసినప్పుడు తెలుగు భాష ఎప్పుడూ కనుమరుగు కాదనే భరోసా కలిగింది. పాటలతో, కవితాపఠనంతో, మాటలతో ఆ సాయంత్రం ఉల్లాసంగా గడిచింది. అక్కడినుంచి వెళ్ళి సాయంత్రం ఆరుగంటలకు జిల్లా గ్రంథాలయంలో సమావేశమై పురజనులతో పుస్తక ప్రాధాన్యాన్ని గురించి ముచ్చటించాము.

మూడు రోజుల బస్ యాత్రలో భాగంగా మొదటి రోజు రాత్రి సులోచన దంపతులు ఇచ్చిన ఆతిథ్యం మరువలేనిది. అమెరికాలో స్థిరపడకుండా ఇండియాకు వచ్చి సేవచేయడం వారి మూలాలపట్ల వారికున్న అభిమానాన్ని, గౌరవాన్ని సూచిస్తుంది. దేశ భవిష్యత్తు బాగుండాలంటే చిన్న పిల్లలను తీర్చిదిద్దడం ఒక్కటే మార్గం. అందుకే ఆ దంపతులిద్దరూ మద్రాసు వెళ్ళి ఒక ఏడాది మాంటిసోరి విద్యావిధానంలో శిక్షణ పొంది వచ్చారట. వారితో ముచ్చటలో సమాజంలో పిల్లలు కోల్పోతున్నబాల్యం, విద్యావిధానం, సాంకేతికాభివృద్ధి వల్ల మరో వైపు చాపకింద నీరు లాగా విధ్వంసమవుతున్న విలువలు మొదలైన మౌలికమైన అంశాలు చర్చకు వచ్చాయి. రెండోరోజు ఉదయమే బయలుదేరి నకిరేకల్ ప్రభుత్వ పాఠశాల పిల్లలతో ముచ్చటించాము. పిల్లలు చాలా ఉత్సాహంగా ఉన్నారు. అతిగా సెల్ ఫోన్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను మాలో కొందరు సోదాహరణంగా వివరించారు. అక్కడి నుంచి సూర్యాపేట, కోదాడ, డిగ్రీ కళాశాలల విద్యార్థులతో సంభాషించడం జరిగింది. రెండో రోజు రాత్రి తేజ రెసిడెన్షియల్ స్కూల్లో మాకు వసతి ఏర్పాటు చేసారు. అక్కడి విద్యావిధానం భిన్నంగా ఉంది. అకడమిక్ చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మకత పెంపొందించే విధంగా ఉండడం గమనార్హం. ఆ పిల్లలతో ముచ్చట రాత్రి పదిగంటలదాకా సాగింది. అది వాళ్ళలోని సృజనాత్మక శక్తులను బహిర్గతం చేసింది. పిల్లల ఆత్మ బంధువు సి. ఏ. ప్రసాద్ గారితో నా పరిచయం ఈ సందర్భంగా గాఢతను సంతరించుకొంది. పాఠశాల యజమాని సోమిరెడ్డిగారి సింప్లిసిటీ నన్ను ముగ్ధురాలిని చేసింది. మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి పిల్లలకు ఆయన నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. మూడోరోజు ఉదయమే మేం సత్యాన్వేషణ మండలికి వెళ్ళాం. మండలి స్థాపకులు పుట్టా సురేంద్రబాబు గారితో సంభాషణ ఆయనలోని తాత్వికతను బహిర్గతం చేసింది. ఆ వయసులో కూడా ఆయన చాలా ఆరోగ్యంగా ఉన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవన విధానమే అందుకు కారణమనిపించింది. అక్కడి నుంచి 1.30 ని.లకు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయానికి మా బస్ యాత్ర చేరుకుంది. ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి నేతృత్వంలో సమావేశం ఏర్పాటైంది. అది అత్యంత ఆధునికమైన ఏర్పాట్లుతో కూడిన విశాలమైన మీటింగ్ హాల్. ఇతర విద్యార్థులతోపాటు బౌద్ధసన్యాసులు కూడా విద్యార్థులుగా ఉండడం విశేషం. అలా వాళ్ళను చూడగానే నాకు పూర్వకాలం నాటి నలంద విశ్వవిద్యాలయం మదిలో మెదిలింది. ఆచార్యులతోపాటు వైస్ ఛాన్సలర్ కూడా పాల్గొనడం వల్ల ఆ సభ ప్రత్యేకతను సంతరించుకుంది. పెద్దలందరూ మాట్లాడుతూ పుస్తక పఠనంవల్ల కలిగే ప్రయోజనాలను, గ్రంథాలయాల ఆవశ్యకతను నొక్కి చెప్పారు.'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు' అన్న చందంగా ఆ వేదికనుంచి మాట్లాడిన రెండు నిమిషాలే నాకు అపూర్వమైన క్షణాలు. అక్కడే మధ్యాహ్న భోజనం ముగించుకొని బుద్ధ స్టడీస్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్ళాం. ఆ శాఖను ఏర్పాటు చేయడంలో చల్లపల్లి స్వరూపరాణి కృషి సాటిలేనిది. ఈ మధ్య గాయకుడు బాలసుబ్రమణ్యం పేరిట ఆర్ట్స్ అండ్ కల్చర్ విభాగం ఏర్పడినట్లు తెలిసింది. విశ్వవిద్యాలయంలోని గ్రంథాలయాన్ని కూడా చూసి విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయానికి వెళ్ళాం. అది సుమారు వందయేళ్ళ నాటిది. నిర్వాహకురాలు రావి శారద ఆధ్వర్యంలో సమావేశం ఏర్పా టైంది. రచయిత, సాహిత్యవిమర్శకుడు గుమ్మడి లక్ష్మీనర్సయ్య, రచయిత్రి మందరపు హైమవతి, విరసం కృష్ణ, భూమిక సభ్యులు మొదలైన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బస్ యాత్రలో భావితరాలైన బాలలను, యువతను, ప్రజాసంఘాలను, దిశా నిర్దేశం చేసే మేధావులను, సంయమనం పాలించే తాత్వికులను, సాహితీవేత్తలను, విద్యావేత్తలను, సామాన్య ప్రజలను కలవడం అపూర్వమైన అనుభవం. ఈ మూడు రోజుల బస్ యాత్రలో మరో గ్రంథాలయోద్యమాన్ని ప్రారంభించిన మంచికంటి వెంకటేశ్వర్లు, సామాజిక వేత్త, విద్యావేత్త కస్తూరి ప్రభాకర్, లీడ్ గ్రంథాలయ నిర్వాహకులు రవికుమార్ శోభ దంపతులు, కాంతి ఫౌండేషన్ అధినేత కందుకూరి రాము, రచయిత్రులు భండారు విజయ, నల్లూరి కాంతి, గిరిజ పైడిమర్రి పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలలో ఇంటికో గ్రంథాలయం, పాఠశాలకోగ్రంథాలయం ప్రభుత్వం, పౌరసమాజం, మేధావి వర్గం సమిష్టి కృషివల్ల మాత్రమే ఇది సాధ్యమవుతుంది.

**- గిరిజ పైడిమర్రి**
9949443414

## 'ఉన్నస్థితి నుంచి ఉన్నత స్థితికి' పుస్తకావిష్కరణ 17న

తిరుపతి విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో దొర్రై రాజ్ రాసిన 'ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి' పుస్తకావిష్కరణ ఈనెల 17వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు యశోద నగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. కథా రచయిత ఆర్ సి కృష్ణస్వామి రాజు అధ్యక్షతన ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ విసి ఆచార్య జంపాల వెంకటరమణ పుస్తకావిష్కరణ చేస్తారు. ప్రాచ్య పరిశోధన సంస్థకు చెందిన డాక్టర్ టి.రాజశేఖర్,మహిళా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.సుభాషిణి, భాషా శాస్త్రవేత్త ఎస్.భాస్కర్‌రాజు, ఉద్యోగ సోపానం ఎడిటర్ సురేష్ ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు.

**- డాక్టర్ కే. సుబ్రహ్మణ్యం**
9908754149

## ప్రశ్నించే గొంతులకు ప్రాణం పోయండి

చిగురు కొమ్మ చిరుగాలికి
ఊగుతూ ప్రతిస్పందిస్తుంది
ప్రమాదమని తెలిస్తే
పక్షి కఠినంగా కూస్తుంది

చస్తానని తెలిసి కూడా
పాము కసిగా బుస కొడుతుంది
ఆకలని తెలిపేందుకు
పసికందు పిడికిళ్ళు బిగించి ఏడుస్తుంది
ఒరేయ్ మనుషులేందిరా ?
మరి ఇంతలా మొద్దు బారిపోయారు
ఒకడు కంపునోరేసుకొని
నీ దేశం నరక కూపమంటే
ఉలకరు పలకరు !
పోరాట పటిమ లేకున్నామాయే?
కనీసం ఏడ్చే హృదయమన్నా ఉండాలి కదా!
వీళ్ళని కొట్టాల్నా? తిట్టాల్నా?
వీరి కంటే పిచ్చోడే నయం
నాలుగు రోడ్ల కూడలిలో
స్వేచ్ఛగా వివరిస్తున్నాడు పచ్చిగా ప్రశ్నిస్తున్నాడు

ఓ కవులు కళాకారులారా
ఉద్యమ బుద్ధి జీవులారా
ప్రాపగండ ప్రవాహంలో కొట్టుకుపోయే
ప్రజలను తట్టి లేపండి
కొంచెం మానవత్వాన్ని రంగరించి
ధైర్యాన్ని నూరి స్థైర్యాన్ని నింపండి
ప్రశ్నించే గొంతులకు ప్రాణం పోయండి.

**- డా.ఎడ్ల కల్లేశ్**
9866765126

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు
**manamlekhalu@gmail.com**
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి - ఎడిటర్

# భారతీయ సాహిత్య జ్ఞాన పీఠాలు



భారతీయ సాహిత్యంలో అత్యున్నత అవార్డ్ జ్ఞానపీఠ్. ఆ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్న తొట్టతొలి సాహిత్యకారుడు ఒక మలయాళకవి, 'మహా కవిజీ' అని గౌరవంగా పిలుచుకునే గోవింద శంకర కురుప్ జూన్ 3,1901న కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం జిల్లా, నాయతోడ్ గ్రామంలో జన్మించారు. ఆయన కవిత్వం మానవతావాదం,ప్రకృతి ప్రేమ, ఆధ్యాత్మిక చింతన. ఉపాధ్యాయ వృత్తితో తన జీవన ప్రస్థానాన్ని మొదలుపెట్టిన జి.ఎస్.కురుప్ ప్రవృత్తి మాత్రం సాహిత్య సృజనే. ఆయన దాదాపు 40పైనే రచనలుచేస్తే అందులో కవిత్వం, వ్యాసం, అనువాదం, విమర్శ మున్నగు ప్రక్రియలు కనిపిస్తాయి. విశ్వకవి రవీంద్రుని 'గీతాంజలి'ని మలయాళంలోకి అనువదించాడు. ఆయన ఫిబ్రవరి 02,1978న ఎర్నాకుళం, కేరళలో మరణించారు.

తొలి జ్ఞానపీఠ గ్రహీతగా కురుప్‌కు గుర్తింపు లభించడం... సాహిత్య నైపుణ్యం ఏ ఒక్క భాషకూ పరిమితం కాదని, భారతదేశంలోని విభిన్న భాషా పరిసరాల్లో విలసిల్లుతుందని ఈ నిర్ణయం నొక్కిచెప్పింది. మహాకవి జి. శంకర కురుప్ టాగోర్ రచనలతో పోల్చబడే కవిత్వానికి ప్రసిద్ధి. మలయాళంలో ప్రభావవంతమైన కవితలు రచించడంతో భారతీయ సాహిత్యానికి గొప్ప సేవలందించారు. జి.శంకర కురుప్ తన 'విశ్వదర్శనం' అనే కవితా సంకలనానికి 1961లో కేరళ సాహిత్య అకాడమీ కవితా పురస్కారాన్ని అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ 1963లో తమ వార్షిక కవితా పురస్కారంతో ఆయనను సత్కరించింది. 1965లో స్థాపించబడిన భారతదేశపు అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ అవార్డును గెలుచుకున్న మొదటి వ్యక్తిగా జి.శంకర కురుప్ రికార్డ్ నెలకొల్పారు. 1950లో ప్రచురించబడిన తన 'ఒడక్కుళల్'(వెదురు వేణువు) అనే కవితా సంకలనానికి ఆయన ఈ బహుమతిని అందుకున్నారు. 1967లో ఆయన సోవియట్‌ల్యాండ్‌నెహ్రూ అవార్డును అందుకున్న జి.ఎస్.కురుప్ కు 1968లో భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్‌ను అందుకున్నారు.

ఉమాశంకర్ జోషి ఒక సత్యాగ్రహిగా 1931లో జైలు జీవితం అనుభవిస్తూనే 20వ ఏట తన తొలి ఖండకావ్యం 'విశ్వశాంతి' రాశాడు. ఉమశంకర్ జోషి భావోద్వేగం.. స్వాతంత్ర్యం పట్ల విశ్వాసాన్ని ఆ ఖండకావ్యంలో ప్రతిబిం బించడం కవి దార్శనికతకూ ఉదాహరణ. గుజరాత్ రాష్ట్రంలోని ఆరవల్లి జిల్లాలో భిలోడా తాలూకాలోని బమ్నా గ్రామంలో జూలై 21,1911న జన్మించిన ఉమాశంకర్ జోషి కాలేయ క్యాన్సర్‌తో తన 77 సంవత్సరాల వయసులో డిసెంబరు 19,1988న ముంబైలో మరణించాడు. గుజరాతీ సాహిత్యానికి ఆయన రచనల ద్వారా చేసిన సేవకు గుర్తింపుగా 1967లో జ్ఞానపీఠ పురస్కారం అందుకున్నాడు. అతని సాహిత్య రచనల్లో ప్రముఖంగా నిశాంత్ కవితా సంకలనం, గంగోత్రి, విశ్వశాంతి, మహాప్రస్థాన్, అభిజ్ఞ అట్లనే విశామో కథా సంకలనం,హవేలీ నాటకాల సంకలనం, శ్రావణి మేళో కథా సంకలనం, అఖో ఏక్ అధ్యయన్,శకుంతల్ కాళిదాసు రాసిన అభిజ్ఞాన శాకుంతలము అనువాదం,ఉత్తర్ రామ్ చరిత్ భవభూతి ఉత్తర రామచరిత్ర అనువాదం, ఈశావాస్య ఉపనిషత్ ఈశావాస్యోపనిషత్తు అనువాదం తదితర రచనలు ప్రముఖమైనవి. గుజరాత్ విద్యాసభలోని గుజరాత్ వెర్నాక్యులర్ సొసైటీలో పోస్ట్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ స్టడీస్ విభాగంలో ఆచార్యునిగా పని చేశాడు. 1954 జూన్‌లో గుజరాత్ విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేయడం, ఆ విశ్వవిద్యాలయంలోనే భాషా విభాగాధిపతిగానూ బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1966 నవంబరు 30న గుజరాత్ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా బాధ్యతలు తీసుకున్నాడు. 1972 నవంబరు 17న ఉపకులపతిగానే ఉద్యోగవిరమణ చేశాడు. ఆయన



సాహిత్య, పత్రికా రంగాలలో చేసిన కృషి,సేవ ఎన్నదగినది. జోషి 1931లో తన తొలి ఖండకావ్యం విశ్వశాంతి రాయడం విశేషం. ఉమాశంకర్ జోషి 1930 సంవత్సరాల్లో సత్యాగ్రహ పత్రికలో మారుపేరుతోనో, పేరులేకుండానో రచనలు చేసేవాడు. 1930-1934 మధ్యకాలంలో జాతీయోద్యమంలో తీవ్ర అభినివేశంతో పాల్గొనడంతో పాటుగా గుజరాతీలో కవితలు, కథలు, నవలలు, నాటకాలు అనేకం రచించాడు.

రఘుపతి సహాయ్ ఫిరాఖ్ ఉర్దూ సాహిత్యంలో గొప్పకవి, రచయిత, విమర్శకుడు, పండితుడు, ఉపన్యాసకుడు, వక్తగా రాణించారు. 'ఫిరాక్ గోరఖ్‌పురి' కలం పేరుతో ఆయన ఉర్దూ, ఇంగ్లీష్, హిందీ భాషల్లో సాహిత్య సేవ చేశారు. ఆయన రచనలలో గుల్-ఎ-నగ్మా ప్రముఖమైనది. ఆయన ఈ గ్రంథ రచనకు అందుకున్న ప్రసిద్ధ పురస్కారాలలో 1960లో సాహిత్య అకాడమీ అవార్డు,1969లో ప్రతిష్ఠాత్మకమైన జ్ఞానపీఠ అవార్డు లభించాయి. 1968లో పద్మ భూషణ్ సమ్మాన్ అందుకున్నారు. 1970లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్ గౌరవం, 1981లో గాలిబ్ అకాడమీ పురస్కారం పొందారు. జ్ఞానపీఠ అవార్డు పొందిన మొదటి ఉర్దూ కవి రఘుపతి సహాయ్. ఫిరాక్ గోరఖ్‌పురి రచించిన'గుల్-ఎ-నఘ్మా' ఒక అద్భుతమైన కవితా సంకలనం. దీనికి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఇక ఆగస్టు 28,1896న గోరఖ్‌పూర్ జిల్లాలోని బన్వార్‌పర్ గ్రామంలో ఒక సంపన్న, విద్యావంతులైన హిందూకాయస్థ కుటుంబంలో జన్మించిన రఘుపతి సహాయ్ ఉర్దూ, పర్షియన్ మరియు ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన సమకాలీకులలో అల్లామా ఇక్బాల్, ఫైజ్ అహ్మద్ ఫైజ్, కైఫీ అజ్మీ మరియు సాహిర్ లుధియాన్వి వంటి ప్రసిద్ధ ఉర్దూ కవులు ఉన్నప్పటికీ, ఆయన చిన్న వయసులోనే ఉర్దూ కవిత్వంలో తనదైన ముద్ర వేయ గలిగారు. అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యంలో లెక్చరర్‌గా చేరారు. అక్కడే అతను తన ఉర్దూ కవిత్వంలో ఎక్కువ భాగం రాశారు. ఆయన రాసిన ఈ కవిత్వ సంపుటిలోని ఇతివృత్తం ప్రధానంగా శృంగారం, మానవ భావోద్వేగాలు మరింకా భారతీయ సంస్కృతి ప్రతిబింబించే గజల్స్ మరియు నజమ్స్ (కవితలు)ఉన్నాయి. మార్చి 3న,1982న 85 యేండ్ల వయసులో న్యూఢిల్లీలో మరణించిన గోరఖ్‌పురి గజల్, నజ్మ్, రుబాయి మరియు ఖతా వంటి అన్ని సాంప్రదాయ ఛందస్సులలో నిష్ణాతులు. ఆయన డజనుకు పైగా ఉర్దూ కవితా సంపుటాలు, నాలుగు ఆంగ్ల గద్య సంపుటాలు రాశారు.

ఫిరాక్ తన జీవితాంతం లౌకికవాదం కోసం పోరాడారు, మరింకా ఉర్దూను ముస్లింల భాషగా ముద్ర వేయడానికి అప్పటి ప్రభుత్వం చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా కీలక పాత్ర పోషించారు. 'జుబాన్ కిసీ క్వామ్ కి మిల్కియాత్ నహిం/ జిస్నే సీఖీ, ఉస్నే కహీ' అంటే 'భాష అనేది ఏ ప్రత్యేక సమాజానికైనా ప్రత్యేక హక్కు కాదు, దానిని నేర్చుకున్న వ్యక్తి దానిని మాట్లాడతాడు' అనేది భాషపట్ల ఆయనకున్న నిశ్చితాభిప్రాయం. ఫిరాఖ్ గోరఖ్పురి ఆయన రాసిన గజల్స్,రుబాయిలు మానవీయ అనుభూ తులను, ప్రేమను, విరహాన్ని, జీవన తత్వాన్ని చాలా లోతుగా, సున్నితంగా ఆవిష్కరిస్తాయి. ఇలా వైవిధ్యంగా విభిన్నంగా సాహిత్య సేవ చేసిన కవిత్రయం సేవలు ఎన్నదగినవి.

**- డా.టి.రాధాకృష్ణమాచార్యులు**
9849305871

# నిత్య చైతన్యశీలి రవ్వా శ్రీహరి

ఆధునిక తెలుగు భాషా పరిణామ క్రమంలో నిఘంటువు అనేది కేవలం పదాల కూర్పు మాత్రమే కాదు. అది భాషా నిర్మాణానికి పటిష్టమైన ఆధారం. భాషాసౌధానికి నిఘంటువు పునాది వంటిదైతే, ఆ పునాదిని శాస్త్రీయ దృక్పథంతో, పరిశోధనాత్మక పటిమతో నిర్మించిన మహనీయుడు ఆచార్య రవ్వా శ్రీహరి. తెలంగాణ మట్టిలో పుట్టి, సంస్కృతాంధ్ర భాషా సాహిత్యాల్లో అసాధారణ పాండిత్యాన్ని గడించి, ఆధునిక తెలుగు నిఘంటు నిర్మాణ శాస్త్రానికి నూతన దిశానిర్దేశం చేసిన ఆయన కృషి తెలుగు సాహిత్య చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. 1943 సెప్టెంబరు 12న నాటి నల్లగొండ జిల్లా, నేటి యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వెల్వర్తి గ్రామంలో ఒక సామాన్య చేనేత కుటుంబంలో జన్మించారు.

బాల్యంలోనే మాతృ వియోగాన్ని పొంది, అనేక ఆర్థిక సామాజిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ, విద్య పట్ల ఆయనకున్న అచంచలమైన తపన ఆయనను సరస్వతీ పుత్రుడిగా నిలబెట్టింది. సురవరం ప్రతాపరెడ్డి, ఎంనరసింగరావుల వంటి మహనీయుల ప్రోత్సాహం, గురువు కప్పగంతుల లక్ష్మణశాస్త్రి మార్గదర్శకత్వం ఆయనలోని పాండిత్యాన్ని సానబెట్టాయి. యాదగిరి లక్ష్మీనృసింహ సంస్కృత విద్యాపీఠంలో ప్రారంభమైన ఆయన విద్యాభ్యాసం, తదనంతరం హైదరాబాద్‌లోని సీతారాంబాగ్ సంస్కృత కళాశాలలో శఠకోప రామానుజాచార్యులు, ఖండవల్లి నరసింహశాస్త్రి వంటి దిగ్గజాల వద్ద మహాభాష్యాంతం వ్యాకరణ శాస్త్ర అధ్యయనంతో పరిపూర్ణమైంది. సంస్కృత వ్యాకరణ సంప్రదాయంపై ఆయనకు ఉన్న అపారమైన పట్టు, తెలుగు పద నిర్మాణ శైలిపై ఉన్న లోతైన అవగాహన ఆయనను ఒక విశిష్ట భాషావేత్తగా తీర్చిదిద్దాయి. రవ్వా శ్రీహరి పాండిత్యం కేవలం ఒక భాషకు పరిమితం కాలేదు. సంస్కృతం మరియు తెలుగు అనే రెండు ప్రధాన భాషల అంతస్సంబంధాలను ఆయన మౌలికంగా విశ్లేషించారు. సంస్కృతంలోని ధాతువులు, ఉపసర్గలు, విభక్తులు తెలుగు పద నిర్మాణంలో ఏ విధంగా భాగమవుతాయో, వాటి ప్రభావం వల్ల తెలుగు పద సంపద ఎలా రూపాంతరం చెందిందో ఆయన తన నిఘంటు రచనల ద్వారా శాస్త్రీయంగా నిరూపించారు. సాధారణంగా నిఘంటు కర్తలు పదానికి అర్థాన్ని మాత్రమే వివరిస్తారు, కానీ శ్రీహరి ఆ పదము ఏ కాలంలో పుట్టింది, ఏ సందర్భంలో వాడుకలోకి వచ్చింది, కాలక్రమంలో దాని అర్థంలో వచ్చిన మార్పులేమిటి అనే అంశాలను పరిశోధనాత్మకంగా వివరించేవారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్య బిరుదురాజు రామరాజు పర్యవేక్షణలో 'భాస్కర రామాయణం'పై ఆయన చేసిన పరిశోధన తెలుగు సాహిత్య విమర్శలో ఒక మైలురాయిగా నిలిచింది. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సుదీర్ఘకాలం బోధన, పరిశోధనలు నిర్వహించి, ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన, తెలుగు భాషా వికాసానికి వ్యవస్థాగతమైన పునాదులు వేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణల విభాగంలో ఎడిటర్-ఇన్-ఛార్జిగా ఆయన చేసిన సేవలు ఆధ్యాత్మిక సాహిత్య ప్రచారానికి ఎంతో తోడ్పడ్డాయి. భాషా శాస్త్రపరమైన దృష్టితో చూస్తే, రవ్వా శ్రీహరి రచనలు శబ్దశాస్త్రం, రూపశాస్త్రం మరియు అర్థశాస్త్రాల సమాహారం. పదాల ఉచ్చారణలో చోటుచేసుకునే మార్పులు, ప్రాంతీయ మాండలిక భేదాలు, వివిధ సామాజిక వర్గాల వాడుకలో ఉండే పద సంపదను ఆయన గౌరవించారు. ఆయన నిఘంటువులలో గ్రాంథిక భాషా సౌందర్యం ఎంతటి ప్రాధాన్యం పొందిందో, మాండలిక పదాలూ అంతే గౌరవాన్ని పొందాయి.

ముఖ్యంగా తెలంగాణ మాండలికంలోని నుడికారాలను,



పల్లె ప్రజల నోళ్లలో నానిన పదాలను సేకరించి వాటికి శాస్త్రీయ వివరణ ఇవ్వడంలో ఆయన అగ్రగణ్యులు. సంస్కృత ప్రభావం అనివార్యమైన తెలుగు భాషలో, అచ్చతెలుగు లేదా దేశ్య పదాల ఉనికిని కాపాడవలసిన అవసరాన్ని ఆయన గుర్తించారు. క్లిష్టమైన వ్యాకరణాంశాలను సైతం సరళమైన శైలిలో వివరించడం ఆయన ప్రత్యేకత. ఈ స్పష్టత మరియు సరళత వల్లే ఆయన నిఘంటువులకు విశేషమైన ప్రజాదరణ లభించింది. పండిత ప్రకాండుల ప్రశంసలతో పాటు సామాన్య భాషా ప్రేమికుల ఆదరణను పొందడం అరుదైన విషయం, అది శ్రీహరి గారి విషయంలో సాధ్యమైంది.

భాషా సంరక్షణ అనేది కేవలం భావోద్వేగ పూరితమైన నినాదం కాకూడదని, అది శాస్త్రీయమైన నిఘంటు నిర్మాణంతోనే సాధ్యమని ఆయన నమ్మారు. ప్రాచీన కవులు ఉపయోగించిన క్లిష్టమైన పద ప్రయోగాలలోని సౌందర్యాన్ని, భావ వ్యక్తీకరణలోని నైపుణ్యాన్ని విశ్లేషిస్తూ ఆయన రాసిన వ్యాసాలు సాహిత్య విమర్శకు కొత్త ఊపిరిని పోశాయి. భాషాశాస్త్రం మరియు సాహిత్యం అనే రెండు విభాగాలను సమన్వయ పరచడం ద్వారా ఆయన ఒక సమగ్ర పండితుడిగా గుర్తింపు పొందారు. పదాల అర్థాలు సేకరించడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సంస్కృతిని, చరిత్రను వెలికితీయడం ఆయన పరిశోధనలోని వైశిష్ట్యం.

నిజానికి రవ్వా శ్రీహరి ఒక నిఘంటుకర్త మాత్రమే కాదు, సంప్రదాయాన్ని గౌరవిస్తూనే ఆధునికతను ఆహ్వానించిన సమన్వయకర్త. ఆయన జీవితం నేటి తరం పరిశోధకులకు ఒక పాఠం. భాషా వికాసమంటే కేవలం కొత్త పదాలను సృష్టించడం కాదు, ఉన్న పద సంపదను పదిల పరుచుకుంటూ, మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా భాషను మలచుకోవడమని ఆయన నిరూపించారు. భాషాభిమానులు, సాహిత్యకారులు, పరిశోధకులు శ్రీహరి రచనలను ఆశ్రయించకుండా తెలుగు భాషాధ్యయనాన్ని పరిపూర్ణం చేయలేరు. తెలుగు పదం వెలుగుతున్నంత కాలం 'రవ్వ' ప్రకాశిస్తూనే ఉంటుంది. ఈ భాషా తపస్వి సేవలను గౌరవించడం అంటే మన భాషను మనం గౌరవించు కోవడమే. తెలుగు పదాల పొదరిల్లులో ఆయనొక అక్షర శిఖరం. ఆ శిఖరపు వెలుగులో తెలుగు భాషా ప్రయాణం నిరంతరాయంగా సాగుతూనే ఉండాలి.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిల్స్‌ను అందజేసిన ఎమ్మెల్యే



జగిత్యాల మే 10(మనం ప్రతినిధి): రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, ఆపి ప్రైవేంటివ్ హెల్త్ క్లినిక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిల్స్ ను అందజేసే కార్యక్రమం జరిగింది.జిల్లా కేంద్రంలోని పావని కంటి హాస్పిటల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ జగిత్యాల పూర్వ అధ్యక్షుడు, శాసన సభ్యుడు డా. సంజయ్ కుమార్, జగిత్యాల డిఎస్పి పురుషోత్తం రెడ్డి పాల్గొని, దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిల్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో, టౌన్ సీఐ కరుణాకర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కార్యదర్శి మంచాల కృష్ణ, కార్య నిర్వాహక కమిటీ సభ్యుడు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షులు, సభ్యులు కొత్త ప్రతాప్, డా. వెంకటేశ్వర్, డా.విజయ్, డా.శేఖర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్కమిటీ ఛైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి, కౌన్సిలర్ లు సుంకేటి మమత, దుమాల రాజ్ కుమార్, కోరే గంగమల్లు, నాయకులు బాల ముకుందం, ఖజిం అలీ, బాసమహేష్, వేణు, అబ్బూరి మల్లేశం గౌడ్, పులి నర్సయ్యా, వంశీ,మహేష్,రవి గౌడ్, రామకృష్ణారెడ్డి ,కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా రోటరీ క్లబ్ ఆపి, రెడ్ క్రాస్ సొసైటీ లాంటి స్వచ్ఛంద సంస్థలు సమాజ సేవలో ముందుకు వస్తూ వారి వంతు బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న సందర్భంలో ఆయా సంస్థలకు అభినందనలు చెబుతున్నామన్నారు.గత నాలుగు దశాబ్దాలుగా జగిత్యాల ప్రాంతంలో సేవయే పరమావధిగా తామందరము కలిసి చేస్తున్న కృషి ఫలితంగానే ఈరోజు ప్రజలందరి ఆదరణతో శాసనసభ్యుడి స్థాయికి తాను ఎదగగలిగానని అన్నారు. ప్రధానంగా ఉచిత కంటి ఆపరేషన్లు దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అర్హులైన వారికి దివ్యంగా ఉపకరణాలు విద్యార్థులకు కంటి పరీక్షలు రోటరీ గంగా పేరుతో మంచినీటి ట్యాంకులు ఏర్పాటు ఉచిత వైద్య శిబిరాలు లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలను ఎలాంటి లాభపరీక్ష లేకుండా ఒక టీం వర్క్ గా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వాలు పేద ప్రజల కోసం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తోడుగా, స్వచ్ఛంద సంస్థలు చేసే కార్యక్రమాలకు అండగా నిలిచే పారిశ్రామిక వర్గాల వారు, వివిధ వ్యాపార సంస్థల వారు సిఎస్ఆర్ నిధులతో చేపట్టే నిధులు అర్హులైన వారికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. డీఎస్పీ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ రోటరీ ఆపి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఇలాంటి సంస్థలు నిర్వహించే కార్యక్రమాలు పేద ప్రజలకు సమాజంలో ఎంతగానో ఉపయోగపడటం అభినందనీయమని వారు చేస్తున్న కృషి హర్షనీయమని అన్నారు.

# జగిత్యాలలో హిందూ సమ్మేళనం



- మిగిలిన విరాళాలను దేవాలయాల అభివృద్ధికి అందజేత

జగిత్యాల మే 10(మనం న్యూస్): జగిత్యాల పట్టణంలో శ్రీరామ్ బస్తీలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్థాపనకు 100 సంవత్సరాలు పూర్తైన సందర్భం గా హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దాతల నుండి స్వీకరించిన విరాళాలలో మిగిలిన నిధులను శ్రీరామ్ బస్తీలోని పురాతన దేవాలయాల అభివృద్ధి కోసం అందజేశారు., ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి దేవాలయ కమిటి కి రూ.15,001/- , పెద్దమ్మ దేవాలయ కమిటీ కి రూ.11,111/- విరాళంగా అందజేయగా, మార్కెట్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి స్టీల్ గ్లాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హిందూ సమ్మేళన సమితి అధ్యక్షులు రంగు శేఖర్, ఉపాధ్యక్షులు తుదిగని శంకర్, సహాయ కార్యదర్శి గట్ల శ్రీనివాస్, కౌన్సిలర్ సిరిపురపు శ్రీలత, బొలుసాని శ్రీనివాస్, కౌన్సిలర్ నిమ్మల నాగరాజు పాల్గొన్నారు. హిందూ సమ్మేళన సమితి సభ్యులు రాగిల్లా భార్గవ్, జిల్లా సాయికృష్ణ, పిసుక నరేందర్, మ్యాన కైలాస్ పతి, కోరుకంటి సాయి, చెని తిరుపతి, గట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకునేలా చూడాలి



- హనుమాన్ పెద్ద జయంతికి 950 మంది సిబ్బందితో పటిష్ట భద్రత
- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల మే 10(మనం ప్రతినిధి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు హనుమాన్ పెద్ద జయంతి సందర్భంగా భక్తులు ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా 950 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. కొండగట్టు జేఎన్టీయూ కళాశాలలో నిర్వహించిన బ్రీఫింగ్ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ... బందోబస్తును 6 సెక్టార్లుగా విభజించి, 3 షిఫ్టుల విధానంలో పోలీసు సిబ్బందికి విధులు కేటాయించినట్లు వెల్లడించారు. జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే జిల్లా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.సుదూర ప్రాంతాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీసు సిబ్బంది ఓపికతో సలహాలు, సూచనలు ఇస్తూ విధులు నిర్వర్తించాలని, ఎక్కడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో పనిచేసి జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా దేవస్థానం, మాల విరమణ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్లను పాటించేలా చూడాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటల పాటు పోలీసు నిఘా కొనసాగించాలని ఆదేశించారు. ప్రతి భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో ఆంజనేయస్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేలా ప్రతి పోలీసు బాధ్యతగా విధులు నిర్వహించాలని తెలిపారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు:₹ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున భారీ సంఖ్యలో వచ్చే వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ మరియు పార్కింగ్ ప్రాంతాల్లో విధుల్లో ఉన్న సిబ్బంది ట్రాఫిక్ జామ్ కాకుండా నియంత్రణ చేపట్టాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు జరగకుండా స్టాపర్లు, కోన్స్, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలినడకన వచ్చే భక్తులు, హనుమాన్ దీక్ష తీసుకున్న భక్తులు కొండగట్టుకు వచ్చే సమయంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రేడియం స్టిక్కర్లను వారి బ్యాగులు, జెండాలకు అంటించడం జరిగిందన్నారు. రోడ్డు ఇరువైపులా నడిచేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వాహనాలను గమనిస్తూ తమ గమ్యస్థానానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు వెంకటరమణ, పురుషోత్తం రెడ్డి, ఎస్బీ ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి, సురేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు కిరణ్ కుమార్, వేణు, వివిధ జిల్లాలకు చెందిన సీఐలు, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ప్రతి ఆదివారం అంబేద్కర్ స్మరణ

**జగిత్యాల జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు**
**ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపు**
**రాజ్యాంగం ద్వారా సమానత్వానికి మార్గదర్శి**
**అంబేద్కర్ భావజాలాన్ని విస్తరించాలి**
**డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్**



జగిత్యాల మే 10(మనం న్యూస్): జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యుడు, డిక్కీ జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అంబేద్కర్ స్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి శేకల్ల గ్రామ సర్పంచ్ పరిష రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆలోచనలు, ఆశయాలను సమాజంలో విస్తృతంగా వ్యాప్తి చేయాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా శేకల్ల గ్రామ సర్పంచ్ పరిష రమేష్ మాట్లాడుతూడా. బాబాసాహెబ్ అంబేద్కర్ భారతదేశానికి అందించిన సేవలు అపారమైనవని అన్నారు. దేశంలోని బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు కల్పించేందుకు ఆయన జీవితాంతం పోరాటం చేశారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అందేలా మార్గం చూపిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అదేవిధంగా అంబేద్కర్ ఒక దళితులకే కాదు భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి పనిగంటలను కుదిస్తూ నిర్ణీత సమయాన్ని రాజ్యాంగంలో పొందుపరచడం వల్లనే నేడు ఉద్యోగస్తులు మరియు ప్రైవేట్ సంస్థలు వారందరూ కార్యాలయాల సమయాన్ని పాటిస్తున్నారని అన్నారు. అదేవిధంగా మహిళలకు ప్రసూతి సెలవులు మరియు అనేక వెసులుబాటులో కనిపిస్తూ అనేక హక్కులను రాజ్యాంగంలో పొందుపరిచారు. రాచరికం మరియు బ్రిటిష్ పాలనలో అణగారిన వర్గాలు ఎదుర్కొన్న అన్యాయాలను తొలగించేందుకు అంబేద్కర్ రాజ్యాంగంలో గొప్ప విలువలను పొందుపరిచారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సమాజంలో ఐక్యత ఎంతో అవసరమని, బహుజనులు పరస్పర విభేదాలకు లోనవకుండా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమస్యలు తలెత్తినప్పుడు పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. యువత అంబేద్కర్ ఆలోచనలను అధ్యయనం చేసి వాటిని సమాజ అభివృద్ధికి ఉపయోగించాలని సూచించారు. అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రతి ఆదివారం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం పెరుగుతుందని తెలిపారు. 'డిక్కీ' జిల్లా కో-ఆర్డినేటర్ నల్ల శ్యామ్ మాట్లాడుతూ డా. బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం అనే మహోన్నత విలువలను దేశ ప్రజలకు అందించిన మహనీయుడు అంబేద్కర్ గారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించి ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిన గొప్ప దూరదృష్టి నాయకుడు ఆయన అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ గారు జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు విద్య ద్వారా ముందుకు రావాలని ఆయన ఎప్పటికప్పుడు ప్రోత్సహించారని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు మరియు ఆలోచనలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని చెప్పారు. అంబేద్కర్ భావజాలాన్ని ప్రజల్లో విస్తృతంగా చాటేందుకు ప్రతి ఆదివారం ఈ స్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ గురించి మరింతగా తెలుసుకోవడానికి ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడంలో ఆయన పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. సమాజంలో సమానత్వం, సోదరభావం నెలకొల్పడం ద్వారా అంబేద్కర్ ఆశయాలను సాకారం చేయాలని కోరారు. యువత అంబేద్కర్ గారి బాటలో నడిచి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షులు చిత్తారి ప్రభాకర్ మాల క్రిస్టియన్ సంఘం జిల్లా అధ్యక్షులు ముద్దమల్ల ప్రవీణ్ ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు పులి నరసయ్య తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గజ్జల రాజు, సుంకరపల్లి అశోక్, నంది వెంకట రాములు, కడపండ వెంకటి, బొల్లం ప్రభాకర్ ,రాగం రమేష్ ,రుద్ర మనోహర్ , నంది తిరుపతి,పర్స శ్రావణ్ ,నంది శ్రీకాంత్ , సంకె మహేష్ ,ఎగుర్తి రాజు దుర్గమ్మ పులి గోవర్ధన్, దోమల రాజయ్య ఎనగందుల బాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం.. ఆధునిక వ్యవసాయం పై అవగాహన

- వ్యవసాయ వారోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు
- 4391 మంది వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న రైతులు
- సాగు పై శాస్త్రీయ అవగాహన, ఆధునిక సాంకేతికత వినియోగం పై దృష్టి





సిద్దిపేట మే 10; మనం ప్రతినిధి: వ్యవసాయంపై రైతులకు శాస్త్రీయ అవగాహన, ఆధునిక సాంకేతికత వినియోగం, ఆర్థిక భరోసా తదితర అంశాలపై అవగాహన కల్పించగా రైతు వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. రైతు సంక్షేమం, ప్రభుత్వం సహకార సద్వినియోగంపై రైతులకు మరింత సమాచారం అందించడం జరిగింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 4 నుండి 9వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రైతు వారం కార్యక్రమాలు జిల్లా వ్యవసాయ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయం తో ఆధునిక సాగు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై అవగాహన కల్పించారు. మే 4న రైతు వారం మొదటి రోజు మే 4న నేల ఆరోగ్యం, శాస్త్రీయ సాగుకు సంబంధించిన సమాచారాన్ని రైతుల్లో అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా 252 మట్టి నమూనాలు సేకరించి 330 మట్టి నమూనాలను విశ్లేషించి రైతులకు ఫలితాల సర్టిఫికెట్లను అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న రకం వరి సాగు అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించడం జరిగింది. తెలంగాణ రైతులు పండించిన సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం టీజీ ఆర్గానిక్ మొబైల్ యాప్ ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వికారాబాద్ లో ప్రారంభించారు. మే 5న530 మంది రైతులు పాల్గొన్న కార్యక్రమంలో ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆయిల్ ఫామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై శిక్షణ, బిందు సేద్యం, నీటి పొదుపు, సాంకేతికతల వినియోగంపై అవగాహన కల్పించారు. మే 6న పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డ్, సహకార సంఘాల సేవలు, తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గోదాముల్లో నిల్వ సదుపాయం, కనీస మద్దతు ధర పొందడం, మార్కెటింగ్ అంశాలపై రైతులకు అవగాహన కల్పించగా 1064 మంది రైతులు పాల్గొన్నారు. మే 7న ఆధునిక వ్యవసాయ యంత్రాలు, డ్రోన్ సాంకేతికత ప్రదర్శనలు నిర్వహించారు. 1276 మంది రైతులు పాల్గొనగా 36 వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించగా 30 మంది రైతుల నుండి యంత్రాల కోసం దరఖాస్తుల స్వీకరణ, పీఎం కుసుమ్ పథకం కింద సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు సబ్సిడీపై అవగాహన కల్పించారు. మే 8న కృత్రిమ గర్భధారణ క్యాంపులు, పశువైద్య పరీక్షలు నిర్వహించారు. పచ్చి గడ్డి విత్తనాల పంపిణీ, చేపల ఉత్పత్తి పెంపు, చెరువుల నిర్వహణ పై రైతులకు అవగాహన కల్పించారు. పశు సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, సమగ్రనీటి వినియోగం, నీటి లభ్యత ఆధారంగా పంటల ప్రణాళిక పై పలు సూచనలు చేశారు. కాలువల మరమ్మతులు, చెరువుల పూడిక తీత తదితర అంశాల తోపాటు చెరువు మట్టి వల్ల నేల సారవంతం పెరుగుదలపై రైతులకు అవగాహన కల్పించారు. మే 9న సమతుల్య నీటి వినియోగం, చెరువుల శుభ్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రైతు వారం సందర్భంగా రైతులకు ఆధునిక వ్యవసాయ సాగు విధానాలు, యంత్రాల వాడకం, ప్రభుత్వ సబ్సిడీ లను సద్వినియోగం చేసుకోవడం తో పాటు సాగు ఖర్చులు తగ్గించి దిగుబడులు పెంచే విధంగా వ్యవసాయం పై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ కె హైమావతి, జిల్లా వ్యవసాయ అధికారి స్వరూప రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# యువతకు స్ఫూర్తిగా నిలిచిన దాసరి ఉష కృషి



- ఎస్.ఎస్.బి కమాండర్ ఆశీష్ పటేల్

పెద్దపల్లి,మే10 (మనం ప్రతినిధి) యువతలో క్రీడా స్ఫూర్తిని రగిలిస్తూ,గత 25 రోజులుగా పెద్దపల్లి నియోజకవర్గవ్యాప్తంగా సాగుతున్న జ్యోతిబా ఫూలే-అంబేద్కర్ జై యుగం కప్' క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో విజయవంతంగా ముగిసింది.బీసీ జేఏసీ చైర్పర్సన్ శ్రీమతి దాసరి ఉష ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ మెగా టోర్నీ ఫైనల్ మ్యాచ్,పెద్దపల్లి మండలంలోని మదర్ థెరిస్సా కాలేజ్ గ్రౌండ్లో అత్యంత ఉత్సాహంగా జరిగింది.మండల స్థాయి ఫైనల్ మ్యాచ్లో పెద్దకాల్వల మరియు కొత్తపల్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మైదానమంతా క్రీడాకారుల కేరింతలు, అభిమానుల కోలాహలంతో సందడిగా మారింది.ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో పెద్దకాల్వల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి, విన్నర్స్ షీల్డ్తో పాటు రూ.10వేల నగదు బహుమతిని సొంతం చేసుకుంది. రన్నరప్గా నిలిచిన కొత్తపల్లి జట్టు షీల్ మరియు రూ.5వేల నగదును గెలుచుకుంది.ఈ ముగింపు వేడుకకు దాసరి ఉష భర్త ఎస్.ఎస్.బి కమాండర్ జుట్టు ఆశీష్ కుమార్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని,అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలాన్ని కలుపుతూ గత 25 రోజులుగా ఇంతటి భారీ టోర్నమెంట్ను విజయవంతంగా నిర్వహించిన దాసరి ఉష కృషిని ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ మహిళా కన్వీనర్ సిరవేణ స్వప్న,నర్ల సాయి,సంతోష్,20వ వార్డు కౌన్సిలర్ రాజేష్,ఎస్.సి.సి.ఎల్ కాంట్రాక్టర్ శ్రీనివాస్,అసెంబ్లీ కోఆర్డినేటర్లు భూమేష్,అబ్దుల్ మాలిక్,ఆర్గనైజర్ శ్రావణ్,రాజేందర్,సాగర్,క్రీడా కారులు,తదితరులు పాల్గొన్నారు.

# మోది బహిరంగ సభకు భారీగా తరలి వెళ్లిన బీజేపీ నేతలు



గజ్వేల్ మే 10 మనం న్యూస్: భారత ప్రధాని నరేంద్ర మోది బహిరంగ సభకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి భారీ సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు తరలి వెళ్లడం జరిగింది. ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ లోని పేరేడ్ గ్రౌండ్లో బిజెపి భారీ ఎత్తున నిర్వహించే ఈ భారీ బహిరంగ సభకు ప్రధానమంత్రి మోది రావడంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ బస్ డిపో నుండి 45 బస్సుల తో పాటు ప్రైవేటు విద్యా సంస్థలకు చెందిన బస్సులను, ప్రవేట్ వాహనాలు సైతం భారీ సంఖ్యలో గ్రామ గ్రామానికి బిజెపి నాయకులు తీసుకురావడం జరిగింది. మండలాల అధ్యక్షులతోపాటు వివిధ గ్రామల అధ్యక్షులు బహిరంగ సభకు తరలి వెళ్లడానికి పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు కూడా స్వచ్ఛందంగా మోదీ బహిరంగ సభకు తరలి వెళ్లేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం అందుతుంది. ప్రజలందరూ వివిధ పార్టీల పనితనాన్ని ప్రజలకు ఎలా చేశారో చూశారని ఒక్కసారి బిజెపికి కూడా అవకాశం ఇస్తే వారి పనితనాన్ని కూడా చూడాలని ఆశతో ప్రజలందరూ ఉన్నట్లు బిజెపి నాయకులు తెలుపుతున్నారు. ఒక్క మార్పుతో తెలంగాణ మరి ఎంతో అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు

**కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిని మిల్లులకు తరలించాలి..**
**ధాన్యాన్ని విల్లులకు తలించేందకు ప్రత్యేక చర్యలు**
**ఇప్పటివరకు 17254 మంది రైతుల నుండి**
**80,411 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 86 కోట్లు చెల్లింపులు**
**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



హైదరాబాద్, మే 10(మనంన్యూస్): కొనుగోలు అయిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులను ఆదివారం ఒక ప్రకటన ద్వారా ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈఇప్పటివరకు 17254 మంది రైతుల నుండి 80,411 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 86 కోట్లు చెల్లింపులు చేస్తున్నట్లు వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కలెక్టర్ తెలుసుకొని... నిల్వలు లేకుండా వెను వెంటనే విల్లులకు తలించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వేగవంతంగా రవాణా చేయుటకు దిశనిర్దేశం చేశారు. కొనుగోలు అయిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించుటకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లారీ ల పైనే ఆధార పడకుండా అవసరమైతే ఇతరాత్ర వాహనాలను ద్వారా మిల్లులకు చేరవేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే రోజువారిగా కేంద్రాలో గల నిల్వలు, మిల్లులకు తరలించిన వివరాల నివేదికలను సమర్పించాలని కలెక్టర్ కొనుగోలు కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు.ధాన్యాన్ని మిల్లులకు తరలించుటలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని నిర్వహకులకు కలెక్టర్ స్పష్టం చేశారు. గన్ని సంచులు, టార్పాలిన్లు సరిపడా అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, కేంద్రాలలో ఉండే ప్రతి దాన్యం గింజను మిల్లులకు తరలించే వరకు శ్రమించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తెవాలన్నారు. అలాగే ధాన్యాన్ని కొనుగోలు చేసిన వివరాలు, మిల్లులకు రవాణా చేస్తున్న ధాన్యం వివరాలను సంబంధిత రిజిష్టర్లలో పకడ్బందీగా నమోదు చేయాలని ఆదేశించారు.

# సైబర్ నేరాలు, మహిళల రక్షణపై సూచనలు

- అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానం, టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన



తిరుపతి మే10 మనం న్యూస్ః తిరుపతి జిల్లా సుబ్బారాయుడు ఆదేశాల మేరకు తిరుమలలోని సేవాసదన్లో మహిళల భద్రతపై తిరుమల సబ్ డివిజన్ పోలీసులు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శ్రీవారి సేవకులు హాజరై మహిళల భద్రతకు సంబంధించిన పలు ముఖ్య అంశాలపై అవగాహన పొందారు.ఈ సమావేశంలో ముఖ్యంగా రహదారి భద్రత, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, మహిళల భద్రతకు సంబంధించిన జాగ్రత్తలపై పోలీసు అధికారులు సమగ్రంగా వివరించారు.సామాజిక మాధ్యమాలు, ఫోన్ కాల్స్, ఆన్లైన్ లావాదేవీల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని హాజరైన వారికి తెలియజేశారు. అదేవిధంగా, మహిళలుఎలాంటి ఆపదపరిస్థితులు ఎదురైనప్పటికీ భయపడకుండా వెంటనే స్పందించి సంబంధిత పోలీసు అధికారులనుసంప్రదించాల్సిన విధానం గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన టోల్ఫ్రీ నంబర్లు, పోలీసు సహాయ సేవల వివరాలను కూడా సమావేశంలో తెలియజేశారు.మహిళల భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, అప్రమత్తతతో వ్యవహరించడం ద్వారా అనేక నేరాలను ముందుగానే నివారించవచ్చని అధికారులు సూచించారు. శ్రీవారి సేవకులు కూడా యాత్రికుల భద్రతలో భాగస్వాములుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తిరుమల ట్రాఫిక్ సీఐ, టూ టౌన్ సీఐ, టూ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్లు సేవాసదన్ సిబ్బంది పాల్గొన్నారు.

# 14న మంత్రి నారా లోకేష్ బత్తలపల్లికి రాక



బత్తలపల్లి, మే 10 మనం న్యూస్ః రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఈనెల 14న బత్తలపల్లికి వస్తున్నట్లు తెదేపా వర్గాలు పేర్కొన్నాయి. ఆర్డీటి సంస్థకు ఎఫ్సీఆర్ఏ రెన్యువల్ కాకపోతే నారా లోకేష్ సంస్థ సేవలను గుర్తించి నేనున్నానంటూ భరోసా ఇచ్చి కేంద్రంతో పలుసార్లు చర్చలు జరిపి ఒప్పించి రెన్యువల్ అయ్యే విధంగా చేశారు. ఈనెల 15న పుట్టపర్తిలో జరిగే ప్రధాన కార్యక్రమానికి హాజరవుతుండగా ముందు రోజే బత్తలపల్లికి వచ్చి సంస్థ ఆసుపత్రి సేవలను పరిశీలించడానికి వస్తున్నారు. 14వ తేదీన విజయవాడ నుంచి నేరుగా పుట్టపర్తి విమానాశ్రయంలో దిగి అక్కడి నుంచి రోడ్డు మార్గాన బత్తలపల్లికి వస్తున్నట్లు వివరించారు.

# తిరుపతి లో భూకబ్జా మాఫియా ను అరికట్టాలి

- తిరుపతి లో ప్రజాస్వామ్యమా లేక గుండాల రాజ్యమా
- సిపిఐ నేతల తీవ్ర విమర్శ



తిరుపతి మే10 మనం న్యూస్: తిరుపతిలో భూ కబ్జా మాఫియాను అరికట్ట లేక పోవడంతో తిరుపతి నగరంలో ప్రజాస్వామ్యం ఉందా లేక గూండాల రాజ్యం కొనసాగుతుందా అనే అనుమానం కలుగుతుందని తక్షణమే భూకబ్జా దారులను నియంత్రించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు.ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం సర్కిల్ వద్ద సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో భూ కబ్జాదారుల ఆగడాలను అరికట్టాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాకు ముఖ్య అతిథులు గా విచ్చేసిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు,జిల్లా కార్యదర్శి పి మురళి మాట్లాడుతూ తిరుపతి నగరం రోజురోజుకు విస్తరిస్తున్నది ఈతరణంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు వారి అనుంగులుగా ఉంటున్న చోటా మోటా నాయకులు తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న జాగాలను దౌర్జన్యంగా కబ్జా చేస్తూ అడ్డొచ్చిన వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. అందులో భాగంగానే ఆదివారం తిరుపతి నగరం నడిబొడ్డున శివ జ్యోతి నగర్ లో జర్నలిస్టులకు ఇచ్చిన కాలనీలో ఖాళీగా ఉన్న జాగాలపైన కన్నేసిన కొంతమంది రౌడీ మూకలో దౌర్జన్యంగా కబ్జా చేయాలని చూడడం అత్యంత బాధాకరమన్నారు . తిరుపతి నగరం లో గుంపులు గుంపులు గా జనాన్ని పోగేసి స్థలం యజమానులను తీవ్రంగా ఇబ్బందులు కు గురిచేయడాన్ని సిపిఐ తీవ్రంగా తప్పుపడుతుందన్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించి ఇలాంటి భూ కబ్జాదారుల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తిరుపతి రూరల్ మండలం చెంచులక్ష్మి కాలనీలో 2023లో దళిత ఉద్యోగి గుర్రప్ప అనే వ్యక్తి డబ్బులతో ఓ ఇంటి స్థలం కొనుక్కుంటే ఆ ఇంటి స్థలంలో ఇల్లు కట్టుకోనీ కుండా నాగ మోహన్ రెడ్డి అనే భూకబ్జా దారుడు విచ్చలవిడిగా దళిత గిరిజన యువకులకు మందు తాగిపిచ్చి గంజాయి మత్తుకు అలవాటు చేయించి అనేకమంది ఇళ్లను కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు కానీ పోలీసులు గాని పట్టించుకోకుండా కబ్జాదారులకు అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. తక్షణమే తిరుపతిలో ప్రశాంతత నెలకొల్పాలని ఈ రౌడీయిజాన్ని అంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీగా కోరుతున్నారు. తిరుపతిలో రౌడీలు గుండాలకు చోటు లేకుండా ప్రజలంతా చైతన్యవంతమై తిరుగుబాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే రాధాకృష్ణ, నగర కార్యదర్శి జె విశ్వనాథ్,నగర కార్యవర్గ సభ్యులు ఉదయ్ కుమార్,ఎన్ శివ ప్రవీణ్ కుమార్, మహేంద్ర, ఆర్ వి రమేష్,రామకృష్ణ డాక్టర్ ఆర్ బలరాం చిన్నం కాళయ్య వినయ్ జె నాగరాజు మహిళా సమైక్య నాయకులు రత్నమ్మ విజయ ప్రమీల శ్రీనివాసులు అల్లాబక్షూ రాము, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయండి

- వైసీపీ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి



హిందూపురం, మే 10(మనం న్యూస్)ః వైయ్యస్సార్ సీపీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలని హిందూపురం ఇన్చార్జ్ దీపికమ్మ భర్త గుడ్డంపల్లి వేణురెడ్డి కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. చిలమత్తూరు మండల కేంద్రంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో బూత్ లెవెల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి వేణురెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

పార్టీని బూత్ స్థాయిలో మరింత బలోపేతం చేయడం ప్రతి కార్యకర్త బాధ్యతని గుర్తుచేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, కే. సురేష్ కుమార్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రోత్సాహంతో పోలీసులకు 7 నూతన రక్షక్ వాహనాలు






- జెండాఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్
- ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖకు సహకారం అందజేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

హిందూపురం (మనం న్యూస్) మే 10. హిందూపురం నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యవసర పరిస్థితులలో రక్షక వాహనాలు ఎంతో దోహదపడతాయని జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ అన్నారు. పోలీసులకు సహాయం అందించేలా పోలీసు స్టేషన్లలో సిబ్బంది మొబిలిటీ పెంచేలా కొత్త రక్షక్ వాహనాలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ చొరవ చూపి అందజేయడంపై జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలియజేశారు. హిందూపురం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సి ఎస్ ఆర్ ఫండింగ్ కింద రూ.15 లక్షల విలువైన 7 రక్షక్ వాహనాలకు సంబంధించి జిల్లా ఎస్పీ సమక్షంలో పోలీసు శాఖకు తాళాలను ఎమ్మెల్యే బాలకృష్ణ సహాయ కార్యదర్శులు వీరయ్య, సురేంద్ర ఆదివారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వాహనాలకు పూజ చేసి ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీసుల తక్షణమే స్పందించేందుకు,రాత్రి పహారా బలోపేతానికి రక్షక్ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. అత్యవసర కాల్స్ వచ్చినప్పుడు పోలీసులు వీలైనంత త్వరగా స్పందించి ఘటనా స్థలాలకు చేరుకునేందుకు శాంతి భద్రతలను కాపాడేందుకు ఈ రక్షక్ వాహనాల రాకతో సులభతరం అయిందన్నారు. ఇప్పటికే మూడు బొలెరో వాహనాలు పోలీసు శాఖకు అందాయని, ప్రస్తుతం ఈ వాహనాల రాకతో మొత్తం 10 వాహనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు డీఎస్పీ కేవీ మహేష్, సి ఐ లు ఆంజనేయులు,కరీం, ఎమ్మెల్యే సహాయ కార్యదర్శులు వీరయ్య, సురేంద్ర, బాలాజీ,ఎస్సైలు రాజేష్, లింగన్న, శ్రీధర్ ,నాగ ప్రసన్న ,పోలీస్ సిబ్బంది టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# కర్ణాటక మంత్రి సుధాకర్ అకస్మిక మృతి ఎంతో బాధాకరం

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి



మడకశిర,మే 10,మనంన్యూస్ః కర్నాటక చిత్రదుర్గ జిల్లా హిరియురు ఎమ్మెల్యే,కర్నాటక రాష్ట్రం ప్రణాళిక గణాంక శాఖల మంత్రివర్యులు డి.సుధాకర్ అకస్మిక మరణం ఎంతో బాధాకరమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి,కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు డాక్టర్ రఘువీరారెడ్డి తెలిపారు.మంత్రి మరణ సమాచారం తెలుసుకున్న రఘువీరారెడ్డి షాక్ కు గురయ్యారు.అయన పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని అయన దేవుడిని ప్రార్థించి కోరుకున్నారు.కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు డి. సుధాకర్ వారి మరణ వార్త నన్ను తీవ్రంగా కలచివేసిందన్నారు. చిత్రదుర్గ, కర్ణాటకకు సుధాకర్ స్వరంగా నిలిచిన ఆయన, ప్రజా జీవితంలో చేసిన సేవలు, ప్రజల కోసం చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు.ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు రఘువీరారెడ్డి హృదయపూర్వక సానుభూతిని తెలియజేసారు.

# శశి విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలి

- విద్యార్థి,యువజన, ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్




తిరుపతి, మే10 మనం న్యూస్: తిరుపతిలోని బాలాజీ కాలనీ నందు అంబేద్కర్ భవన్లో భాదిత దళిత మహిళా ప్రిన్సిపాల్ మంగ రాణి తో కలిసి అఖిలపక్ష విద్యార్థి,యువజన, ప్రజాసంఘాల జేఏసీ నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల శశి విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ జే. మంగ రాణి కి ముందస్తూ నోటీసులు ఇవ్వకూొడ అర్ధాంతరంగా తొలగించిన తీరు కుల వివక్షతో ఉన్నదని తక్షణమే ఆ విద్యాసంస్థల డైరెక్టర్ కిరణ్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రాకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసారు.ఇప్పటి వరకు ప్రిన్సిపాల్ జే. మంగ రాణి యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ విద్యాసంస్థల యాజమాన్యం వద్దే ఉంచుకుని వేధింపులకు పాల్పడుతున్నారు అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం తీసేసినందున లేబర్ యాక్ట్ ప్రకారం ఇప్పటివరకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శశి విద్యా సంస్థల యాజమాన్యం వేధింపులు తట్టుకోలేక తీవ్ర మనోవేదనతో ఆత్మహత్య ప్రయత్నం కూడా జరిగిందని ఈ ఘటన చాలా బాధాకరమని వాపోయారు. ఈ ఘటనను సంబంధిత పోలీస్ మరియు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శశి విద్యా సంస్థలకు గుర్తింపును రద్దుచేసి డైరెక్టర్ కిరణ్ పై కేసు నమోదు చేయని పక్షంలో విద్యా సంస్థల ఎదుట నిరసన దీక్ష చేపడతామని తెలియజేశారు. అలాగే శశి విద్యా సంస్థల్లో విద్యాహక్కు చట్ట ప్రకారం చదువుతున్న విద్యార్థుల నుండి ఫీజుల దోపిడీ జరుగుతున్నదని వీటన్నిటిపై సమగ్ర దర్యాప్తు చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థి యువజన ప్రజాసంఘాల రాజకీయ పార్టీ ల రాజకీయ నాయకులు ఆమ్ ఆద్మీ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, జాతీయ ఓబీసీ విద్యార్థి సంఘా నాయకులు విజయ్ ఉత్తరాది, వై. యస్. ఆర్. సి. పి. విద్యార్థి విభాగం నాయకులు ప్రేమ్ కుమార్, యన్. యస్. యూ. ఐ. జిల్లా అధ్యక్షులు శివ భాలాజీ, నేసినల్ యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రేమ్ సాగర్,సమతా సైనిక్ దళ్ జిల్లా కార్యదర్శి గండి కోట సుబ్రహ్మణ్యం, ఈతోడు నాగార్జున, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి హెచ్.లోకేష్,ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సోము శేఖర్ ఆచారి, భారతీయ నిరుద్యోగుల పార్టీ అధ్యక్షులు పోతులూరి మాసుమ్ ఇండియా, అంబేద్కర్ భవన్ కన్స్ట్రక్షన్ కమిటీ సభ్యులు రమేష్ బాబు, గిరిజన విద్యార్థి సంఘాల నాయకులు బి వినోద్ రాథోడ్, వెంకటేష్ నాయక్, నవ సమాజ ఫెడరేషన్ నాయకులు బి. తేజ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ పై జనసైనికులు గుర్రు

- 15 ఏళ్ల పాటు సీఎంగా చంద్రబాబు ఉండాలనే ప్రకటన పట్ల మళ్ల గుళ్ళాలు



భీమవరం , మే 10,మనం బ్యూరో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై ఒకవైపు కాపు సంఘాల నేతలు, మరోవైపు జనసేన నాయకులు, కార్యకర్తలు గుర్రుగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దాదాపు 20% ఏపీలో కాపు ఓటర్లు ఉండగా కేవలం ఐదు,ఆరు శాతం ఉన్న సామాజిక వర్గాలకే కొమ్ముకాస్తూ వారినే సీఎం చేయడానికి పవన్ కళ్యాణ్ సంఘీభావం తెలపడం పట్ల కూడా ఒకవైపు కాపు సామాజిక వర్గానికి, మరోవైపు జనసేన నాయకులు కార్యకర్తలకు మింగుడు పడని పరిస్థితి నెలకొంది. అసలు పవన్ కళ్యాణ్ అంతర్యం ఏమిటో అంతు పట్టని పరిస్థితి నెలకొంది అంటున్నారు . సీఎం అవుదామని ఉందా లేదా.. లేక ప్రజలు కోసం మరో పార్టీ వల్ల ఇబ్బంది పడుతున్నారని చెప్పి టిడిపి కి కొమ్ము కాసి ఆ పార్టీ కే మద్దతు ఇవ్వాలని అనుకుంటున్నారా అనేది అంతర్యం తెలియడం లేదని కాపు నాయకులు, జన సైనికులు అంటున్నారు. 15 సంవత్సరాల వరకు చంద్రబాబుకే సీఎం అవకాశం ఇద్దామని పవన్ కళ్యాణ్ చెప్పడం పట్ల కూడా కాపు సంఘ నాయకులు, జన సైనికులు మల్లగుల్లాలు పడుతున్నారు. 15 సంవత్సరాల తర్వాత అయినా అవకాశం ఇస్తారా అనుకుంటే ఆ అవకాశం కూడా కనిపించడం లేదని, ఈలోగా చంద్రబాబు తనయుడు లోకేష్ ని సీఎం కుర్చి ఎక్కించడానికి టిడిపి నాయకులు ఇప్పటినుంచే పావులు కదిపేయడం కూడా ఒక పక్క నుంచి చక చక జరిగిపోతుందని కాపు సంఘం నాయకులు జనసైనికులు అంటున్నారు.దీనికి నిదర్శనం లోకేష్ ని పార్టీ కార్య నిర్వాహాక అధ్యక్షుడిని చేయడామే నని అంటున్నారు. జైలు నుంచి చంద్రబాబు ను విడిపించిన నేపథ్యంలో మొదటి రెండున్నర ఏళ్ళు సీఎంగా చంద్రబాబు,తరువాత రెండున్నర ఏళ్ళు పవన్ కళ్యాణ్ కు సీఎంగా అవకాశం వస్తుందని ఆశించామని అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తే చంద్రబాబు తర్వాత మళ్లీ అవకాశం అయన తనయుడు లోకేష్ కే ఇచ్చేలా కనిపిస్తోందని పవన్ కళ్యాణ్ కి అవకాశం కల్పించేలా కనుచూపు మేర కనిపించడం లేదని జన సైనికులు, కాపు సంఘం నేతలు పెదవి విరుస్తున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులో టీవీ కె పార్టీ అధినేత విజయ్ ఒంటరిగా పోటీ చేసి సీఎం పీఠం దక్కించు కు న్న విషయం కూడా కాపు సంఘం, జనసైనికులలో తీవ్ర చర్చనీయాంశంగా మారిందని పలువురు అంటున్నారు. ఏదో ఒక పార్టీ వల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతోందని చెప్పి మరొక పార్టీకి మద్దతు ఇచ్చి ఆ పార్టీకే సీఎం కుర్చి అప్పజెప్పడం కంటే ప్రజలు నష్టాలను భరించి తమిళనాడు విజయ్ మాదిరి గా వేచి చూస్తే సీఎం అవకాశం వచ్చేడంటున్నారు. ఈసారి పవన్ కళ్యాణ్ కు అవకాశం ఇద్దంలే అనే పరిస్థితి వచ్చేవరకు వేచి చూస్తే బాగుండేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2019లో అవకాశం ఇవ్వనప్పుడు 2024లో అవకాశం వచ్చేదని వేచి చూడకపోవడం దురదృష్టకరమని అంటున్నారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి కూడా అదే తప్పు చేశారని అంటున్నారు. 2009లో ఓటమిపాలైన ప్రజారాజ్యం అధినేత చిరంజీవి 2014 ఎన్నికల వరకు వేచి చూడలేదని, వేచి ఉంటే అప్పటి రాజకీయ సూన్యతను బట్టి ఇతనికి ఏపీలో అవకాశం వచ్చి ఉండేదని మరికొందరు కాపు సంఘ నేతలు అంటున్నారు. వేచి చూడకపోవడం వల్లే చిరంజీవి సీఎం అవ్వలేకపోయారని, పవన్ కళ్యాణ్ కూడా అదే బాటలో పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 70 అసెంబ్లీ స్థానాలు లేకపోతే ఒంటరిగానే పోటీ చేయాలి: రాబోయే అసెంబ్లీ ఎన్నికలలోఅయినా కనీసం 70 అసెంబ్లీ స్థానాలు కూటమి పార్టీలో జనసేన కు కేటాయించకపోతే ఒంటరిగానే పోటీ చేయడం మంచిదని పలువురు కాపు సంఘం నేతలు, జన సైనికులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. లేదంటే సీఎం హామీ అయినా ఒప్పందం కుదుర్చుకోవాలని అంటున్నారు.

మొత్తం మీద ఒంటరిగా పోటీ చేసి తమిళనాడు సీఎంగా విజయం సాధించిన విజయ్ వ్యవహారం ఏపీలోని కాపు సంఘాలు, జనసైనికులు లో హాట్ టాపిక్ గా మారింది.ఈ ప్రస్తుత రాజకీయ పరిణామాలు కాబోయే కాలంలో రాజకీయ సమీకరణలు మార్పులు ఎలా ఉంటాయనేది వేచి చూడాల్సిందే మరి.

# అభివృద్ధికి విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నా మంత్రి నిమ్మల




- రూ. 5.62 కోట్ల పనులకు శంకుస్థాపనలు

పాలకొల్లు, మే 10,మనం ప్రతి నిధిః రాష్ట్రంలోనే పాలకొల్లు నియోజకవర్గం ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేలా కోట్లాది రూపాయలు నిధులు తీసుకువస్తున్నానని,నిమిషం విశ్రాంతి తీసుకోకుండా కష్టపడి పని చేస్తున్నాను. ప్రజల కోసం పనిచేసే మంచి కూటమి ప్రభుత్వాన్ని, నాయకుడిని ఆశీర్వదించాలని రాష్ట్ర జలవనూర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కోరారు. యలమంచిలి మండలంలో ఆదివారం రూ. 5.62 కోట్లతో అభివృద్ధి పనులకు ఆయన కూటమి నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అడవి పాలెం, కాజ వెస్ట్ , కొంతేరు, చించినాడ, కలగంపూడి, నవరసపురం, ఏనుగు వానిలంక, బాడవ గ్రామాల్లో మంత్రి నిమ్మలకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా బాడవ గ్రామంలో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రిగా రాష్ట్రమంతటా పర్యటిస్తూనే మరోపక్క నియోజకవర్గ అభివృద్ధికి ఎటువంటి లోటు కనిపించకుండా శని ఆదివారాలు సెలవు రోజుల్లో సైతం అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటున్నాను అన్నారు. తనకన్నా ఎక్కువగా నియోజకవర్గ అభివృద్ధి కోసం కష్టపడేవారు ఉన్నారా అంటూ ప్రజలే వాస్తవాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమం లో బొప్పన హరి కిషోర్, రుద్రరాజు సత్యనారాయణ రాజు, బత్తుల రాజు,ఉన్న మట్ల కబర్థి, బోనం నాని,మామిడి శెట్టి పెద్దిరాజు,కడలి గోపి,కాపీశెట్టి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్విమ్స్ కార్మికుడు రూకేష్ ఆరోగ్యం విషమం

- వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె. వేణుగోపాల్



తిరుపతి మే 10 మనం న్యూస్ః ఆసుపత్రిలో వెంటిలేట్ప చికిత్స పొందుతున్న స్విమ్స్ కార్మికుడు రూకేష్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సిఐటియు నగర ఉపాధ్యక్షులు కె. వేణుగోపాల్, 73 రోజులుగా కార్మికుల సమస్యలు పరిష్కారం కాక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవడం వల్లే ఆయన ఆరోగ్యం విషమించిందని పేర్కొన్నారు. పోరాటం ప్రారంభమైన నాటి నుంచి కార్మికుల కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ అన్ని కార్యక్రమాల్లో యాక్టివ్గా పాల్గొంటున్న రూకేష్ ప్రస్తుతం విషమ స్థితిలో వెంటిలేట్ప చికిత్స పొందుతున్నారని తెలిపారు. గతంలో ఒకసారి బ్రెయిన్ స్ట్రోక్కు గురైన రూకేష్, కోలుకున్న అనంతరం తన కుటుంబ పోషణ కోసం తిరిగి విధుల్లో చేరి పనిచేస్తున్నాడన్నారు. శానిటేషన్ పేరును తొలగించి వార్డ్ బాయ్గా కొనసాగించాలి, వేతనాలు పెంచాలి అనే కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరితే తన కుటుంబ జీవన పరిస్థితులు మెరుగుపడతాయనే ఆశతో ఉద్యమంలో అత్యంత చురుకుగా పాల్గొంటూ వచ్చాడన్నారు. అయితే, కార్మికుల సమస్యల పరిష్కారంపై యాజమాన్యం, టీటీడీ అధికారులు పదేపదే హామీలు ఇస్తూ కాలయాపన చేయడం వల్ల కార్మికుల్లో తీవ్ర ఆందోళన, మానసిక ఒత్తిడి పెరిగిందన్నారు. ఈ క్రమంలో నిన్న రాత్రి విధుల్లో ఉండగానే రూకేష్ తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోవడంతో, తోటి కార్మికులు వెంటనే అప్రమత్తమై హుటాహుటిన స్విమ్స్ అత్యవసర విభాగానికి తరలించి వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం సిఐటియు నాయకులు, కార్మికులు ఆసుపత్రికి చేరుకుని వైద్యులను సంప్రదించి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారని చెప్పారు. అలాగే రూకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించినట్లు తెలిపారు. ఇదే విధంగా ఇటీవల కుమారి అనే మహిళా కార్మికురాలు కూడా సమస్య పరిష్కారంపై తీవ్ర ఆందోళనకు గురై గుండె సంబంధిత సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే అన్నారు.₹73 రోజులుగా ఎండనకా, వాననకా కార్మికులు తమ న్యాయమైన హక్కుల కోసం పోరాడుతుంటే యాజమాన్యం, టీటీడీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారం చేయాలని, మరింత ఆలస్యం చేయకుండా కార్మికుల్లో నెలకొన్న ఆందోళనకు ముగింపు పలకాలనీ కె. వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి. రవి, నాయకులు గోపి, వెంకటేష్, మారిముత్తు, బృందా తదితర కార్మికులు పాల్గొన్నారు.

# ఘనంగా తుమ్మల 40 వసంతాల వేడుకలు

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ





ఖమ్మం, మే 10(మనం న్యూస్): ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రధాత గౌరవ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మే 14వ తేదీ నాటికి 40 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా త్రీటౌన్ ప్రాంతంలో డిసిసి ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో వర్తక సంఘ భవనం వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. 2009లో ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ప్రకాష్ నగర్ వద్ద మున్నేరు నదిపై బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రజల చిరకాల వాంఛను అవసరాలను తీర్చిన శంకుస్థాపన శిలాఫలకం వద్ద తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పోలీస్ కమిషనరేట్ భవనాలను నిర్మించిన మహనీయుడు తుమ్మల శంకుస్థాపన చేసిన శిలాఫలకం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు వక్తలు ఆనాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. త్రీ టౌన్ ప్రాంతంలో ప్రధాన ఆదాయ వనరు అయినా వ్యవసాయ మార్కెట్ పై ఆ ప్రాంత వాసులు అందరూ ఆధారపడి బ్రతుకుతున్న సంగతి అందరికీ తెలిసిందే. వేగంగా పెరిగిన ఖమ్మం నగర జనాభా అదేవిధంగా పెరిగిన వ్యవసాయ ఉత్పత్తుల కారణంగా మార్కెట్ సరిపోక రోడ్లపైనే నిల్వ ఉంచుకున్న పరిస్థితుల్లో మార్కెట్ పైన ఆధారపడిన త్రీ టౌన్ ప్రాంత వ్యాపారులు ఒకవైపు మార్కెట్ సరిపోక అవస్థలు పడుతున్న జనం ఒకవైపు ఈ రెండింటికి ఒకటే మార్గంగా 150 కోట్ల రూపాయల వ్యయంతో ఆసియా లోనే రెండో అతిపెద్ద మార్కెట్ గా తీర్చిదిద్దుతున్న మహానుభావుడు తుమ్మల కలల ప్రాజెక్టు వ్యవసాయ మార్కెట్ వద్ద వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఖమ్మం 3 టౌన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన మూడు బొమ్మల ప్రాంతంలో తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు లక్కీ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. త్రీ టౌన్ ప్రాంతం లో పెరిగిన జనాభాకు వ్యాపారాలకు తరచూ విద్యుత్ అంతరాయాలు కలుగుతున్న విషయాన్ని గమనించి 2015 లో కొత్తగా ఆనాటి మంత్రిగా ఉన్న తుమ్మల విద్యుత్ సబ్ స్టేషన్ ను ఏర్పాటు చేశారు. దానివల్ల 3 టౌన్ ప్రాంతం కరెంటు కష్టాల నుంచి బయటపడింది. అక్కడ సంబరాలు నిర్వహించారు.

కొన్ని వందల సంవత్సరాల క్రితం కాలవడ్డు ప్రాంతంలో మున్నేరు నదిపై నిర్మించిన వంతెన శిలావస్థకు చేరుకున్నదని అది ప్రమాదకరంగా మారింది అన్న విషయాన్ని గమనించి అక్కడ రెండు వందల కోట్ల రూపాయలతో అధునాతన సౌకర్యాలతో కూడిన మెట్రో నగరాల్లో ఉండేటటువంటి తీగల వంతెన పనులు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వర్షాకాలం వస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బ్రతుకుతున్న మున్నేరు పరివాహక ప్రాంత ప్రజల కష్టాలను పూర్తిగా తొలగించడానికి 8 కిలోమీటర్ల పాటు మున్నేరు నదీ పరివాహ ప్రాంతంలో కరకట్ట నిర్మాణాన్ని చేపట్టడానికి శంకుస్థాపన చేశారు. కరకట్ట నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి అక్కడి ప్రజలతో ఈ కరకట్ట నిర్మాణం వల్ల వారు పొందుతున్న ఆనందాన్ని వారి మాటల్లోనే వ్యక్తపరిచారు. పెరిగిన త్రీ టౌన్ ప్రాంత జనాభా ఆరోగ్య వ్యవస్థల దృష్టిలో ఉంచుకొని పబ్లిక్ హెల్త్ సెంటర్‌ని ఈ మధ్యనే 3 కోట్ల 50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సందర్భంగా ఆ ప్రాంతంలో తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ప్రజల ఆరోగ్యం పట్ల కూడా తుమ్మల చూపిస్తున్న శ్రద్ధను వివరించారు. సారథి నగర్ మామిళ్లగూడెం ప్రజల చిరకాల కోరిక దశాబ్దాల కోరిక అయినటువంటి అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ఇటు 3 టౌన్ ఇటు 2 టౌన్ ప్రాంత ప్రజల కష్టాలు నెరవేర్చిన గొప్ప దార్శనికుడు తుమ్మల చిత్రపటం వద్ద పాలాభిషేకం చేశారు. త్రీ టౌన్ ప్రజలకు నాణ్యతతో కూడిన మంచినీటి నీ సరఫరా చేయాలనే సదుద్దేశంతో పంపింగ్ వెల్ రోడ్ లో ఫిల్టర్ బెడ్ ఏర్పాటు చేశారు. దాన్ని సందర్శించి దానివల్ల త్రీ టౌన్ ప్రాంతంలో ప్రజల మంచినీటి కష్టాలు తొలగిన ఆనందాన్ని పంచుకున్నారు. 1994 లో త్రీ టౌన్ ప్రాంత వాసులకు ఒక మంచి పార్క్ ఏర్పాటు చేయాలని వారు ఏదైనా కార్యక్రమాలు చేసుకోవాలంటే వసూలు సౌకర్యంతో కూడిన మంచి గార్డెన్ అవసరమని గుర్తించి దానవాయిగూడెం వద్ద పార్కును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పార్కు వల్ల త్రీ టౌన్ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి జరిగింది. ఈ విధంగా 3 టౌన్ ప్రాంతంలో తుమ్మల 40 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో నిలిచిపోయే శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలను సందర్శించి వారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ పునుకొల్లు నీరజ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా మాజీ కార్పొరేటర్లు వివిధ అనుబంధ సంఘాల అధ్యక్ష కార్యదర్శులు జిల్లా నగర పార్టీ బాధ్యులు డివిజన్ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# మాలల న్యాయ పోరాట సభ



చుంచుపల్లి, మే 10 (మనం న్యూస్): తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ ఫర్ మాల ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం వలన జరిగిన నష్టాలను ప్రశ్నిస్తూ కొత్తగూడెంలోని జి.ఎస్. మినీ ఫంక్షన్ హాల్లో మాలల న్యాయ పోరాట సభ ఆదివారం జరిగింది. శనగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన సభలో మాలల రాజ్యాధికార సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డా.దాసరి చెన్నకేశవులు, జేఎన్టీయూహెచ్ జేఏసీ చైర్మన్ డా.రంజిత్ కుమార్ మందా, భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య డా. మద్దెల శివకుమార్, మాలమహానాడు సెక్రటరీ జనరల్ మధుసూదన్ (చిన్ని), మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్, నవతన్, కొత్తగూడెం కార్పొరేషన్ కార్పొరేటర్లు పోలుమూరి ధనలక్ష్మి, నామా కీర్తి, గుర్రం వెంకటేశ్వర్లు, ఆకునూరి సుప్రియ, మద్దాల హరిత, కాల్వ భాస్కర్, కాంగ్రెస్ నాయకులు తంబళ్ల సామెల్, బాలశౌరి, తెలంగాణ ఎడ్యుకేట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు దాసరి రమేష్, కాకెళ్లి సైమన్, ధామళ్ళ శోభారాణి, శనగ రాంచందర్, మెంటం బలరాం, శెట్టి కమలాకర్, పంతగాని రాజశేఖర్, యర్రముచ్చు కళ్యాణ్, నామా వినోద్, వాడపల్లి రమేష్ బాబు, గడ్డం రాఘన బాబు, శనగ స్వామి, బరగాడి దేవదానం, గుర్రం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. ఆసభలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ వలన మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, ఎస్సీ గ్రూప్-3లో ఉన్న మాల, మాల ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాల సంఘాల ప్రతినిధులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఎంపిరికల్ డేటా (వాస్తవ లబ్ధిదారుల వివరాలు) ఆధారంగా ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారిని ఒక గ్రూప్గా, ఆర్థికంగా వెనుకబడిన వారిని మరో గ్రూప్గా వర్గీకరించి ఎస్సీలలోని 59 కులాలకు సమన్యాయం చేయాలని కోరారు.

# తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దు

## అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

రైస్ మిల్లర్లు ధాన్యం స్వీకరణలో సహకరించాలి

కొనుగోళ్ల వేగం పెంచేందుకు హమాలీల సంఖ్యను పెంచాలి

నాణ్యతపై సందేహాలుంటే ముందుగా డీఎస్వోకు సమాచారం ఇవ్వాలి

ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్



ఖమ్మం, మే 10(మనం బ్యూరో): రైస్ మిల్లుల వద్ద ధాన్యం దిగుబడి చేసుకునే సమయంలో తాలు పేరుతో ఎలాంటి కోతలు విధించొద్దని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి సమీక్షించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తాలు పేరుతో రైస్ మిల్లర్లు ఎలాంటి కోతలు విధించరాదని స్పష్టం చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిర్దిష్ట కారణాలు లేకుండా తిరస్కరించ వద్దని సూచించారు.ఏదైనా ధాన్యం ఎఫ్.ఏ.క్యూ. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించిన పక్షంలో, వెంటనే జిల్లా పౌర సరఫరాల అధికారికి (డీఎస్వో) సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సమాచారం అందిన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన సాంకేతిక సహాయ కమిటీని రైస్ మిల్లులకు పంపించి ధాన్యం నాణ్యతను పరిశీలిస్తామని తెలిపారు.సాంకేతిక కమిటీ నివేదికలో నాణ్యత ప్రమాణాలు లేవని నిర్ధారణ అయిన పక్షంలో మాత్రమే ధాన్యాన్ని తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. రైస్ మిల్లర్లు అందరూ ధాన్యం స్వీకరణలో సహకరించాలని సూచించారు.ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కావాలంటే హమాలీల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. రైతులు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు పడకుండా ప్రతి రైస్ మిల్లర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్ రావు, మిల్లర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మండల హస్తంలో నైరాశ్యం

- పదవి కోసం పాత-కొత్త కాంగ్రెస్ వర్గాల పోరు
- పార్టీ కంటే వర్గాలకే ప్రాధాన్యమా?



కొణిజర్ల, మే 10(మనం న్యూస్) : జిల్లా కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో పీసీసీ అధ్యక్షుడు ఇటీవల మండల పార్టీ అధ్యక్షుల నియామక ప్రక్రియను ప్రారంభించినప్పటికీ, వైరా నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు ఒక్క మండలంలో కూడా నియామకాలు పూర్తి కాలేదు. అయితే రేపో మాపో నియామకాలు జరిగే అవకాశాలు కనిపిస్తున్న వేళ కొణిజర్ల మండల కాంగ్రెస్లో మాత్రం అంతర్గత అసంతృప్తి చర్చనీయాంశంగా మారుతోంది. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా పేరొందిన కొణిజర్ల మండలంలో ప్రస్తుతం నాయకులు, కార్యకర్తల్లో నైరాశ్య వాతావరణం నెలకొన్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లకు పైగా గడుస్తున్నా, దశాబ్దకాలంగా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పార్టీని గ్రామస్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడ్డ కార్యకర్తలకు ఇప్పటికీ సరైన గుర్తింపు దక్కలేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎవరికి దక్కనుందన్న అంశం స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. గత పంచాయతీ ఎన్నికల సమయంలోనే మండలంలో కాంగ్రెస్ వర్గపోరు బహిర్గతమైంది. పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ అంటూ నాయకులు వర్గాలుగా విడిపోయి గ్రామాల్లో పరస్పరం పోటీ పడిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో ఎమ్మెల్యే గానీ, జిల్లా పార్టీ నాయకత్వం గానీ సమన్వయం చేయడంలో విఫలమైందన్న విమర్శలు వినిపించాయి. ఫలితంగా రెండు వర్గాలు తమ తమ అభ్యర్థులను బరిలోకి దింపిన పరిస్థితులు కనిపించాయి. ఇప్పుడూ మండల అధ్యక్ష నియామకంలో అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనన్న అనుమానాలు పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు తమను పక్కనబెట్టి, రాష్ట్ర లేదా జిల్లా స్థాయి నాయకుల అండదండలు ఉన్నవారికే నామినేటెడ్ పదవులు కట్టబెడుతున్నారనే ఆరోపణలు చేస్తున్నారు. మండలంలో జిల్లా స్థాయి నాయకులు పలువురు ఉన్నప్పటికీ, ఇప్పటివరకు చెప్పుకోదగ్గ నామినేటెడ్ పదవుల్లో మాత్రం స్థానిక నాయకత్వానికి మొండిచేయి చూపించారనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచిపోయినా, పార్టీ కోసం శ్రమించిన వారికి సరైన గుర్తింపు రాలేదని కొంతమంది కాంగ్రెస్ నాయకులే బహిరంగంగా మాట్లాడుకోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ఓ ఎంపీ అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం కూడా కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా తన మాటకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆగ్రహంగా ఉన్నట్లు సమాచారం. నామినేటెడ్ పోస్టుల కోసం తాను సూచించిన పేర్లను కూడా పట్టించుకోలేదని, తన వర్గానికి చెందిన నాయకులకు అవకాశం దక్కలేదన్న భావన ఆయా వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటి వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న ఈ అంతర్గత అసంతృప్తి, మండల అధ్యక్ష పదవి నియామకాల నేపథ్యంలో ఒక్కసారిగా భగ్గుమనే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఒకవేళ మండల అధ్యక్ష పదవి విషయంలో పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ మధ్య పోటీ తలెత్తి, మొదటి నుంచీ పార్టీ కోసం పనిచేసిన నాయకులను పక్కనపెట్టి నిర్ణయం తీసుకుంటే మరింత వర్గ విభేదాలు ముదిరే ప్రమాదం ఉందని కాంగ్రెస్ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సొంత నాయకుల నుంచే తలనొప్పులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇప్పటికైనా మండల అధ్యక్ష నియామక ప్రక్రియలో పార్టీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడిని ఎంపిక చేయాలని కాంగ్రెస్ శ్రేణులు కోరుతున్నాయి. పార్టీ బలోపేతానికి వ్యక్తిగత వర్గాలు కాదు, సమిష్టి నాయకత్వమే అవసరమని వారు సూచిస్తున్నారు.

# నేటి నుంచి విద్యా వారోత్సవాలు: ఎంఈఓ అబ్రహాం

- ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కార్యక్రమాలు

కొణిజర్ల, మే 11 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు మండలంలోని అన్ని పాఠశాలల్లో నేటి నుంచి ప్రారంభమవుతున్నాయని మండల విద్యాశాఖ అధికారి డి. అబ్రహాం తెలిపారు. మే 11 నుంచి 17 వరకు నిర్వహించే కార్యక్రమాల వివరాలను ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు.మే 11న జెడ్పీహెచ్ఎస్ సింగరాయపాలెం పీఎంఎస్హెచ్ఆర్ఐ పాఠశాలలో సమ్మర్ క్యాంపు ప్రారంభమవుతుందని తెలిపారు. 12వ తేదీన మండలంలోని పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు ఖమ్మంలోని జీహెచ్ఎస్



ఎన్ఎస్పీ క్యాంపు స్కూలులో నిర్వహించే రెమిడియల్ తరగతులకు హాజరవుతారని పేర్కొన్నారు. 13వ తేదీన సర్పంచ్లు ప్రజా ప్రతినిధులతో విద్యాభివృద్ధి పై వర్క్ షాప్ లు నిర్వహించనున్నట్లు తెలిపారు. 14వ తేదీన మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం పేరెంట్-టీచర్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 15వ తేదీన పాఠశాలల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలతో విద్యార్థులకు లైబ్రరీ డే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీన విద్యార్థులతో బొమ్మల తయారీ, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 17వ తేదీన పదో తరగతి టాపర్లకు పాఠశాల స్థాయిలో బహుమతులు అందజేసి విద్యా వారోత్సవాలను ముగించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి అబ్రహాం తెలిపారు.

# సమ్మర్ క్యాంప్‌లను సమర్థవంతంగా వినియోగించుకోండి

- జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ



ఖమ్మం, మే 10(మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా 15 రోజుల పాటు సమ్మర్ క్యాంప్‌లని నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని తెలిపారు. దీనిలో భాగంగా 11న సమ్మర్ క్యాంప్‌లను 18 పీఎం శ్రీ పాఠశాలలో, ఒక కేజీబీవీలో రెసిడెన్షియల్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. ఈ క్యాంపులలో వంద మందివరకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. దీనిలో భాగంగా ఆహ్లాదకర అభ్యసనం కోసం ఏవేని నాలుగు కోర్సులకు సంబంధించి, మ్యూజిక్, డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్, కుట్టు పనులు లేదా ఇతర ఒకేషనల్ శిక్షణ అందించే రిసోర్స్ పర్సన్‌లు లేదా మాస్టర్ ట్రైనర్లు లేదా వృత్తి నిపుణులను నియమించుకునే అవకాశం ఉందన్నారు. ఈ 15 రోజులకు గాను వారికి ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల గౌరవ వేతనం చెల్లిస్తారని తెలిపారు. సమ్మర్ క్యాంపులో పాల్గొనే బాల బాలికలు ఉపయోగించే చార్టులు, స్కెచ్‌లు, పేపర్స్, ఇతర మెటీరియల్, ఇతర అవసరాల కోసం పదివేల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేస్తోందన్నారు. సమ్మర్ క్యాంపులకు హాజరయ్యే విద్యార్థులకు ఆహ్లాదకర అభ్యసనంతో పాటు ఆరోగ్యకరమైన స్నాక్స్‌ను అందించడానికి వంట పనులలో సహాయపడే ఇద్దరు వర్కర్స్‌కి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల చొప్పున గౌరవ వేతనం అందించన్నట్లు తెలిపారు. ఈ ఆరోగ్యకరమైన స్నాక్స్ ను కు కావలసిన మెటీరియల్‌ను కొనుగోలు చేసే బాధ్యతను ఆయా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించినట్లు తెలిపారు. సమ్మర్ క్యాంప్ లను వినియోగించుకోండి : జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి ఖమ్మం జిల్లాలోని 18 పిఎంశ్రీ పాఠశాలలలో నిర్వహించే సమ్మర్ క్యాంపులలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ అనగా అభ్యసన అభివృద్ధికి సంబంధించినటువంటి అంశాలను విద్యార్థులకు నేర్పడం జరుగుతుందని, వీటిలో మ్యూజిక్, డ్రాయింగ్, డాన్స్, స్టోరీ టెల్లింగ్, చెస్, క్యారమ్స్ లాంటి ఇండోర్ గేమ్స్, రీడింగ్ హ్యాబిట్స్ ని పెంచడం, ఆటపాటల ద్వారా అభ్యసనం, భద్రత తో కూడినటువంటి ఫ్రెండ్లీ వాతావరణం ఉంటుందని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రతి సమ్మర్ క్యాంపులో నిష్ణాతులైన, నిపుణులైన నలుగురు ఇన్స్ట్రక్టర్లు ఉండి విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించడమే కాకుండా విద్యార్థులలో వినోదాత్మక అభ్యసనాన్ని ప్రోత్సహిస్తారని తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపులు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు జరుగుతాయని, వేసవి కాలంలో రీడింగ్ హ్యాబిట్ పెంచుకోవాలని భావించే ప్రతీ విద్యార్థికి ఇవి ఒక వరమన్నారు. బాల బాలికలందరు, తాము చదివే పాఠశాలలతో నిమిత్తం లేకుండా తమ సమీపంలో ఉన్నటువంటి ఈ సమ్మర్ క్యాంపులను వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# సామాజిక సంఘటనల సమాహారమే కవిత్వం




ఖమ్మం మే 10(మనం న్యూస్): వర్తమాన ఆధునిక కవిత్వం సామాజిక సంఘటనల సమాహారమే తన కవిత్వ సారమని ప్రముఖ కవి తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాహిత్యంతో సాయంకాలం అనే కార్యక్రమాన్ని ఖమ్మం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన కవిత్వ ప్రయాణాన్ని ఆవిష్కరించారు. మానవీయ సంబంధాలు సంక్లిష్టమై పోతున్న సందర్భంలో మానవ సమాజం, ఎదుర్కొంటున్న సంక్షోభాలు,కుల మతతత్వం తో అమానవీయ పరిణామాలు తనను కదిలించాయని తెలిపారు. కవిగా భావావరణలో అంతః సంఘర్షణ కు గురైన సందర్భాల్లో కవిత్వం రాసినట్లు అంతరంగ అనుభవాన్ని వెల్లడించారు. సమన్వయకర్త మారాబత్తుల పెద్దన్న తుల శ్రీనివాస్ కవితా తత్వాన్ని వస్తు,రూప ప్రత్యేకతల్ని వివరించారు.తొలుత జాషువా సాహిత్య వేదిక కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. ఎంపిక చేసిన కవితల్ని ప్రముఖ కవి గాయకులు కన్నెగంటి వెంకటయ్య,కటుకోజ్వల రమేష్ దేవయ్య తదితరులు విశ్లేషించారు. సభలో కవులు ఆనందాచారి,గద్దపాటి శ్రీనివాస్, సూఫీ శ్రీనివాస్, తోట సుభాషిణి, తాళ్లూరి రాధ, ఆంజనేయులు,పాగి వెంకన్న, కిన్నెర వెంకటేశ్వర్లు, ఊటుకూరి దామోదర్, మేళ్లచెర్వు బాబు, సాహిత్య అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అడవులను తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్



- స్మగ్లింగ్ పాయింట్లు పరిశీలన
- సిసి కెమేరాల ఏర్పాటుకు సూచనలు
- 'సార్' అక్రమాలపై ఆరా
- అడవిబాట పట్టిన అటవీశాఖ జిల్లా యంత్రాంగం
- 'మనం' వార్తా కధనాలకు స్పందన

మనం ఎఫెక్ట్




చర్ల, మే 10 (మనం న్యూస్) : లంచం తీసుకుంటూ ఏసిబికి చిక్కిన భద్రాచలం ఎఫ్ డి వో సుజాత, ఆమెకు వత్తాసు పలికిన చర్ల అటవీశాఖ ఇన్ చార్జ్ రేంజ్ అధికారి కృష్ణ అవినీతి, ఆగడాలపై 'మనం' దినపత్రికలో ప్రచురితమైన 'పాపం పండింది', 'సార్ మామూలోడు కాదు' శీర్షికన ప్రచురితమైన వరుస కధనాలకు అటవీశాఖ జిల్లా యంత్రాంగం కదిలింది. భద్రాద్రి జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్ ఫోర్స్ రేంజ్ అధికారి శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం రెండు రోజుల పాటు చర్లలో మకాం వేసి 'సార్' అక్రమాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. సుబ్బంపేట, గీసరెల్లి బీట్లలోని టేకు ప్లాంటేషన్ ను పరిశీలించారు. నరికివేతకు గురయిన టేకు మోడులపై నెంబర్లు, అవి రికార్డయ్యాయా అనే విషయం పరిశీలించారు. అధికారులు ఏసిబికి పట్టు బడటానికి కారణమైన పూసుగుప్ప రహదారిని పరిశీలించారు. ఛత్తీస్ఘడ్ బోర్డర్ వద్ద, గీసరెల్లి, సుబ్బంపేట గ్రామ స్మగ్లింగ్ పాయింట్లను సందర్శించారు. జిపిఎస్ ఆదారంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ పెంచి స్మగ్లర్ల కధలికలను పరిశీలించేందుకు స్మగ్లింగ్ పాయింట్ల వద్ద సిసి కెమెరా లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సుబ్బంపేట వద్ద గల గోదావరి ఫెర్రీ పాయింట్ ను సందర్శించి సిబ్బందికి తగుసూచనలు చేసారు. ఇక్కడ పరిశీలించిన విషయాలను టాస్క్ ఫోర్స్ అధికారులు డి ఎఫ్ వో కు సమర్పించనున్నారు. కాగా నేడు డిఎఫ్ఏ కృష్ణగౌడ్ చర్ల మండలాన్ని సందర్శించి మరిన్ని వివరాలను తెలుసుకోనున్నట్లు తెలుస్తోంది. లంచం తీసుకుంటూ అధికారులు ఏసిబికి పట్టుబడటంతో రిపార్ట్ మెంట్ పరువు పోవడంతో దిద్దుబాటు చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. చర్ల ఇన్ చార్జ్ రేంజ్ అధికారిగా పనిచేసిన కృష్ణ అవినీతి అక్రమాలపై మరింత లోతయిన విచారణ చేస్తారని సంబంధిత వర్గాలు తెలియచేసాయి

## ఇన్ చార్జ్ రేంజ్ అధికారిగా రంజిత

చర్ల ఇన్ చార్జ్ రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కృష్ణ ఏసిబికి పట్టుబడిన నేపథ్యంలో నూతన ఇన్ చార్జ్ రేంజ్ అధికారిగా రంజిత నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం భద్రాచలం రేంజ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఎఫ్‌డివో కోటేశ్వరరావు కు ఆమె రిపోర్ట్ చేసారు.

# బీటీపీ ఆయకట్టుదారులను అభినందించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు



**రాయదుర్గం మే 10 మనం న్యూస్:** వరి సాగులో రికార్డు స్థాయి దిగుబడులు సాధించి ఆదర్శంగా నిలిచిన రైతులను రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అభినందించారు. ఆదివారం ఆయన గుమ్మగట్ట మండలం, కలుగోడు గ్రామంలో భైరవాణి తిప్ప ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో సాగైన వరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి పంట పొలాల్లో కలియతిరిగిన ఆయన, వరి సాగు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతులు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, కేవలం ఎరువులతో శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం వల్లే నాణ్యమైన అధిక దిగుబడులు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, కష్టపడి వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ ఏడాది ఆయకట్టుకు సకాలంలో సాగునీరు అందడం వల్ల రైతులు మెరుగైన ఫలితాలు సాధించగలిగారని, సాగునీటి నిర్వహణలో అధికారులు, ఆయకట్టుదారులు సమన్వయంతో పనిచేశారని తెలిపారు. తుంగభద్ర ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల కారణంగా ఈసారి రబీ సీజన్లో ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేయలేదని, దీనివల్ల కనేకల్లు, బీటీపీ పరిధిలో పండిన పంటకు మార్కెట్లో విపరీతమైన డిమాండ్ పెరిగిందని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక వ్యాపారులతో పాటు కర్ణాటక నుంచి కూడా వ్యాపారులు వస్తుండటంతో, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లోనే అధిక ధర లభిస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎకరాకు సగటున 45 నుండి 50 బస్తాల దిగుబడి రాగా, కొందరు రైతులు ఏకంగా 63 బస్తాల వరకు దిగుబడి సాధించడం విశేషమన్నారు. పంట నాణ్యత మెరుగ్గా ఉండటంతో వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభించి లాభదాయక పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. సక్రమంగా నీటి సరఫరా అందించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాలువ సన్నన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి, వైస్ చైర్మన్ దానవేంద్ర, కెపి దొడ్డి నాగరాజు మాజీ కన్వీనర్ గిరిమల్లప్ప,బెలోడు సంజీవ మాజీ సర్పంచ్ నాగరాజు, యన్ తిమ్మప్ప కుమార్ రెడ్డి, శ్రీరాములు కాలువ చైర్మన్ కాలువ రాజు, పైదొడ్డి రాజు,మూర్తి అంజి శివరాజు, సదాశివ, మల్లారెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ధర్మవరం బాలిక ఎంపిక



**ధర్మవరం అర్బన్, ఏప్రిల్ 10 మనం న్యూస్:** ధర్మవరం పట్టణానికి చెందిన యువ క్రీడాకారిణి కిరణ్మయి జాతీయ స్థాయి బాస్కెట్బాల్ పోటీలకు ఎంపిక కావడం స్థానిక క్రీడా వర్గాల్లో ఆనందాన్ని నింపింది. మే 22 నుండి 28 వరకు పాండిచ్చేరి రాష్ట్రంలో నిర్వహించనున్న 76వ నేషనల్ జూనియర్ బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలికల జట్టు ఎంపిక కోసం చిత్తూరు నగరంలో ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపుకు ఆమె ఎంపికయ్యారు.ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా బాస్కెట్బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ, ధర్మవరం పట్టణానికి చెందిన క్రీడాకారిణి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇటీవల మే 1 నుండి 4 వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రపురంలో నిర్వహించిన అంతర్ జిల్లా బాస్కెట్బాల్ ఛాంపియన్షిప్ పోటీల్లో కిరణ్మయి ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం విశేషమని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాంబా బాస్కెట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామిరెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా హర్షం వ్యక్తం చేస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరచాలని కోరారు.

# రాగులకైనా మోక్షముందా

- వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు
- నిరుత్సాహంగా ధరలు
- ప్రభుత్వ సేకరణపైనే ఆశలు
- రైతుల ఎదురుచూపులు ఫలిస్తాయా
- లేదా.. మొక్కజొన్న మాదిరిగా అవుతుందా?



**చిలమత్తూరు, మే 10, మనం న్యూస్:** అష్టకష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న రైతన్నలకు రాగి పంట సాగు ఆశాజనకంగా కనబడింది. ప్రభుత్వమిచ్చిన ప్రోత్సాహకంతో మరింత ధైర్యంతో సాగుకు ముందుకుపోయారు. వాతావరణం అనుకూలించడంతో మంచి దిగుబడులు పొందారు. తీరా పంట చేతికి వచ్చాకా ధరలు పడిపోవడంతో బిక్కుబిక్కుమంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా మద్దతు ధరకు సేకరిస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. పంట పండినప్పుడు ధరలు పడిపోవడం.. ధర ఉన్నప్పుడు పంట పండకపోవడం.. రెండూ ఉన్నప్పుడు పంట పెట్టుబడి భారీగా పెరిగి గిట్టుబాటు కాకపోవడం.. ఇదీ రైతన్నలు అనునిత్యం ఎదుర్కొంటున్న పరిస్థితి. ఇలాంటి పరిస్థితే ఇప్పుడు రాగిపంట సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్నారు. తక్కువ పెట్టుబడి, తక్కువ రిస్క్, ధర గ్యారెంటీ అనే నమ్మకంతో సాగు చేసిన రైతులకు ధర పడిపోవడంతో ప్రభుత్వ హామీ వైపు ఎదురుచూస్తున్నారు. గడిచిన కొన్ని సంవత్సరాలుగా పడిపోయిన రాగి పంట సాగు విస్తీర్ణం, ఈ ఏడాది రాగి పంటే ఆశాజనకంగా కనిపించడంతో మండల పరిధిలో రబీ సాగు ద్వారా 585 ఎకరాల్లో పంట వేశారు. ప్రభుత్వం కూడా మద్దతు ధర 4880 రూపాయలు ప్రకటించడంతో ఉత్సాహంగా పంట వేయడానికి మొగ్గు చూపారు. వాతావరణం అనుకూలించడంతో ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్లు వరకు దిగుబడి వచ్చింది. అయితే రైతుకు పంట చేతికి వచ్చే సమయానికి బయట మార్కెట్ లో ధర 3000 నుంచి 3300కు పలుకుతోంది. అది కూడా పంట వడిపే సమయంలో వర్షం రాకపోవడంతో నాణ్యమైన, మంచి రంగు ఉన్న రాగులు పండాయి. అయితే పంట సాగు ఖర్చులు విపరీతంగా పెరగడంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం వెంటనే సేకరించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడుతాం

- వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం. మే 10 మనం న్యూస్ ప్రతినిధి:** ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, తాము వైఎస్సార్సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని జిల్లా వైసిపి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిలు అన్నారు.ఆదివారం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ కేంద్రంలో నూతన వైఎస్సార్సీపీ పార్టీ కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పోరాటాలకు పుట్టిన గడ్డ శింగనమలయని అన్నారు. ప్రజల హక్కులు, రైతు సమస్యల పరిష్కారం కోసం శింగనమల ప్రాంత ప్రజలు ఎప్పుడూ ముందుండి పోరాడిన చరిత్ర ఉందన్నారు. అన్యాయం జరిగిన ప్రతిసారి ప్రజల తరపున గళమెత్తిన నేల శింగనమలదని పేర్కొన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ప్రవేశపెట్టిన పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు జరిగిందన్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. రైతులకు అవసరమైన మద్దతు, పంట నష్టపరిహారం, సాగునీటి సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి స్వప్రయోజనాల కోసం పనిచేస్తూ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇసుక దోపిడీ, మట్టి దోపిడీ పెరిగిపోయిందని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీ నష్టం జరుగుతోందన్నారు. సామాన్య ప్రజలు ఇళ్ల నిర్మాణానికి కూడా ఇసుక అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు అప్పుల భారంతో ఆత్మవిశ్వాసం కోల్పోతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయడానికి ఈ కార్యాలయం ఒక వేదికగా నిలుస్తుందని ఆకాంక్షించారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకయని, వారి సమస్యల పరిష్కారానికి, ప్రజా పోరాటాలకు ఈ వేదిక అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, నియోజకవర్గంలోని ప్రతి గడపకూ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి రైతుల సమస్యలను గుర్తించి వెంటనే నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. సాగునీరు, ఎరువులు, పంటల కనీస మద్దతు ధర వంటి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్సీపీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఏ కష్టం వచ్చినా నేనున్నానని భరోసా ఇస్తున్నాను. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూనే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తాం అని స్పష్టం చేశారు.ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తామని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వైఎస్సార్సీపీ గళం వినిపిస్తుందని తెలిపారు.నష్టపోయిన రైతుల పక్షాన గళం వినిపించేందుకు ఈ నెల 11వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్కు వినతిపత్రం అందజేయనున్నామని, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులతో పాటు భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# తమిళనాడులో కొత్త రాజకీయ యుగానికి నాంది



- సెక్యులరిజానికి కాంగ్రెస్ మద్దతు చారిత్రాత్మకం
- ఏపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగేపల్లి గంగాధర

**సోమందేపల్లి టౌన్, మే 10 మనం న్యూస్:** తమిళనాడు రాజకీయాల్లో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రముఖ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం(టీవీకే అధినేత సి. జోసెఫ్ విజయ్ చెన్నైలోని జవహర్లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో తమిళనాడు ముఖ్యమంత్రిగా ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్ ఆర్.ఎన్. అర్లేకర్ విజయ్తో ప్రమాణం చేయించారు. భారీ భద్రత మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు, వేలాది మంది అభిమానులు హాజరయ్యారు. 2026 ఏప్రిల్ లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో 234 స్థానాలకు గాను 108 స్థానాలు గెలుచుకుని టీవీ కే పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించింది. మెజార్టీకి కొద్ది దూరంలో ఆగడంతో జాతీయ కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ నాయకత్వంలో తమకున్న ఐదు సీట్లను టీవీ కేకు మద్దతు ప్రకటించి సెక్యులర్ పార్టీల పట్ల తమకున్న ప్రత్యేకతను చాటుకున్నాయి. ఈ సందర్భంగా ఏపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రంగేపల్లి గంగాధర స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీకి, అదేవిధంగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన టి వి కే పార్టీ అధినేత విజయ్కు శుభాకాంక్షలు అందజేశారు.దశాబ్దాలుగా తమిళనాడు రాజకీయాలను ప్రభావితం చేసిన డీఎంకే - అన్న డీఎంకే పార్టీల ఆధిపత్యానికి చెక్ పెడుతూ టీవీ కే పార్టీ అధికారంలోకి రావడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త శకానికి ఇది నాంది పలికిందన్నారు.బాధ్యతలు చేపట్టిన వెంటనే సీఎం విజయ్ ప్రజా సంక్షేమానికి సంబంధించిన కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక డ్రగ్స్ నిరోధక బృందాన్ని ఏర్పాటు చేస్తూ తొలి నిర్ణయం తీసుకున్నారు. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు.మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయాలని మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం వల్ల లక్షలాది మహిళలకు ప్రయోజనం కలగనుంది. విజయ్తో పాటు మరో 9 మంది మంత్రులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరు కావడం విశేషం అన్నారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడిన సీఎం విజయ్ భావోద్వేగ వ్యాఖ్యలు చేస్తూ నేను మీ ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిని.
మీకు అన్నగా, తమ్ముడిగా ఉంటాను. నాకు ఆకలి తెలుసు. పేదరికం తెలుసుఅంటూ ప్రజలతో తన అనుబంధాన్ని వ్యక్తం చేయడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు.యువత, రైతులు, మహిళలు, పేదల అభివృద్ధే తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని విజయ్ స్పష్టం చేస్తూ అవినీతి రహిత పాలన, ఉపాధి అవకాశాల పెంపు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించడం గమనార్హం అన్నారు. తమిళనాడులో టీ వీ కే గెలుపుపై ఆంధ్ర తెలంగాణ కు చెందిన కాంగ్రెస్ వాదులు అభినందన వెల్లువ అందజేయడం జరిగిందన్నారు.

## హాఫ్ మూన్ మోడల్ బీడు పడిన భూములకు జీవం



**గుడిబండ మే 10 మనం న్యూస్:** గుడిబండ మండలం రాళ్ళపల్లి గ్రామంలో ఆదివారం రైతు నాగేంద్రప్ప గారి బీడుపడిన పొలంలో హాఫ్ మూన్ మోడల్ నిర్మాణం విజయవంతంగా నిర్వహించబడింది. డిపిఎం లక్ష్మీన్ నాయక్ డి టి రమేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో నిర్వహించారు.హాఫ్ మూన్ మోడల్ అనేది వర్షపు నీటిని నిల్వ చేసేందుకు ఎత్తు భూముల్లో అమలు చేయబడే అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. ఈ మోడల్ను అర్ధచంద్రాకారంలో రూపొందించి, సుమారు 5 అడుగుల ఎత్తు మరియు 2 అడుగుల వెడల్పుతో నిర్మించారు.ఈ విధానం వర్షపు నీటిని భూగర్భానికి చొచ్చుకుపోయేలా చేసి, భూమిలో తేమను నిలుపుతుంది. ఈ విధానంతో మొక్క జొన్న, అలసంద, పంటల అభివృద్ధికి తోడ్పాటు అందుతుందన్నారు. మరియు భూగర్భజల స్థాయి కూడా మెరుగుపడుతుందన్నారు.ఈ కార్యక్రమం ద్వారా రైతులకు నీటి పరిరక్షణ పద్ధతుల పట్ల అవగాహన పెరిగింది. ఈ విధానాన్ని చూసిన రైతులు తమ భూముల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని నిర్ణయించారు. ఈ ప్రయోగం శాస్త్రీయంగా విజయవంతమవుతుందని నిర్వాహకులు నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనికేషన్ థిమెటిక్ మల్లేశ్వరి మరియు రైతులు పాల్గొన్నారు.

# భూమి ఆరోగ్యం... రైతు భవిష్యత్తు

- రసాయనాలకు దూరం సహజ సాగుకు స్వాగతం
- మట్టి సారాన్ని కాపాడే మార్గం ప్రకృతి వ్యవసాయం
- రసాయనాలకు దూరం సహజ సాగుకు స్వాగతం



**ధర్మవరం అర్బన్ ఏప్రిల్ 10 మనం న్యూస్:** ధర్మవరం మండల పరిధిలోని మలకాపురం యూనిట్, రేగాటిపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఆ గ్రామానికి చెందిన రైతు పుల్లమ్మ 5 ఎకరాల పొలంలో పీ ఎం డి ఎస్ విధానంలో ప్రధాన పంటలుగా 5 రకాల పంటలతో పాటు 25 రకాల బయోడైవర్సిటీ విత్తనాలను వినియోగించి సాగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఘన జీవామృతం ఉపయోగించి, బీజామృతంతో విత్తన శుద్ధి చేసి అనంతరం విత్తనాలను వెదజల్లడం జరిగింది. ప్రకృతి సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమి సారాన్ని పెంపొందించడం, రైతులకు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే మార్గాలను పరిచయం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ , ఓబిలేసు, పక్కిరప్ప, నాగరత్నమ్మ తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వమే కుటుంబానికి రక్షణగా మారింది



- 5 లక్షల బీమా అందజేత

**అమడగూరు,మే,10: మనం న్యూస్:** మండల పరిధిలో గుండువారిపల్లి పంచాయతీ పరిధిలోని సోలుకుంట్ల గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల రమణమ్మ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ద్వారా లభించిన ప్రమాద బీమా ఆర్థిక భరోసాగా నిలిచింది.గతంలో నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రమణమ్మ కుటుంబ సభ్యులు పార్టీ సభ్యత్వాలు పొందారు.కొంతకాలం క్రితం రమణమ్మ తన తమ్ముడు నాగరాజుతో కలిసి ద్విచక్ర వాహనంపై కొలిమిరాలపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో జింక అడ్డంగా రావడంతో ప్రమాదం జరిగింది.ఈ ప్రమాదంలో రమణమ్మ తీవ్రంగా గాయపడగా వెంటనే ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.ఆమె తమ్ముడు నాగరాజు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.టీడీపీ సభ్యత్వంలో నామినీగా కుమార్తె ఉప్పుతోళ్ల రాజేశ్వరి పేరును నమోదు చేయడంతో ప్రమాద బీమా కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సహాయం తమ కుటుంబానికి ఎంతో అండగా నిలిచిందని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా బీమా మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్,పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తోపాటు అమడగూరు మండల టీడీపీ నాయకులకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాద బీమా చెల్లింపు పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పి.శ్రీనివాసులు, నియోజకవర్గ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ గుర్రంకొండ తిరుపాల్, లబ్ధిదారులు ఉప్పుతోళ్ల రాజేశ్వరి, నాగరాజు, పాల్గొన్నారు.

## నేడు డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పర్యటన

**అనంతపురం, కలెక్టరేట్ మే10: మనం న్యూస్ :** ఏపీ రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థలలో బి.సి.ల రిజర్వేషన్ల పై అధ్యయనం కొరకు ఏర్పాటు చేయబడిన డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా( ఐ.ఏ.ఎస్ రిటైర్డ్) జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మే11 సోమవారం రాత్రి అనంతపురము పట్టణం చేరుకుని రాత్రి బస చేస్తారు. మరుసటి దినం 12వ తేది మంగళవారం నాడు ఉదయం 10 గం.ల నుండి మధ్యాహ్నం 1గం.ల వరకు అనంతపురము జిల్లా కలెక్టరేట్ రెవెన్యూ భవనము నందు కుల సంఘాలు, పౌర సమాజ సంస్థలు, ప్రజా ప్రతినిధులు, సాధారణ ప్రజల నుండి వినతులు, విజ్ఞాపనలను స్వీకరిస్తారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అనంతపురము జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిణి కుష్బూ కొఠారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మీ కోసం కాల్ సెంటర్ సేవలను వినియోగించుకోండి

- జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం, కలెక్టరేట్ మే10 మనం న్యూస్:** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం .ఏపీ .గవర్నమెంట్ .ఇన్ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో 'మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100' అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలన్నారు. నేడు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ : నేడు అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. వడగాలుల అంచనా మరియు ప్రస్తుతం నెలకొన్న అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా, మరియు ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు మరియు మహిళలు సుదూర గ్రామాలు మరియు మండలాల నుండి వస్తున్నందున, ప్రజా భద్రత దృష్ట్యా మరియు వడదెబ్బను నివారించడానికి, సోమవారం ఉదయం 9:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ డేను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.





# చెన్నై ప్లే ఆఫ్ ఆశలు సజీవం

స్పోర్ట్స్, మనం డెస్క్: తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో చెన్నై గెలిచింది. 2026 మే 10వ తేదీన చెన్నై చిదంబరం స్టేడియంలో జరిగిన మ్యాచ్ లో లక్నోపై గెలిచి హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. లక్నో నిర్దేశించిన 204 టార్గెట్ ను 4 బంతులు మిగిలి ఉండగా ఛేజ్ చేసింది. ఈ గెలుపుతో ప్లే ఆఫ్ ఆశలు సజీవంగా నిలుపుకుంది.

భారీ రన్ రేట్ సాధించే అవకాశాన్ని కోల్పోయింది. ఉర్విల్ పటేల్ ఇచ్చిన ఊపును కంటిన్యూ చేయలేకపోయారు. 23 బంతులలో 65 రన్స్ చేసి.. భారీ తేడాతో గెలిచే ఛాన్స్ ఇచ్చాడు ఉర్విల్. కానీ అతడు ఔటయ్యాక బ్యాటర్లు మెల్లిగా ఆడటంతో మ్యాచ్ చివరి ఓవర్ వరకు వచ్చింది. దీంతో చెన్నై భారీ రన్ రేట్ మిస్సయ్యిందనే చెప్పాలి.

ఛేజింగ్ లో చెన్నై బ్యాటర్లు టీమ్ రన్ రేట్ సాధించాలనే లక్ష్యంతో ఆరంభంలో టాపార్డర్ బ్యాటర్లు రప్పా రప్పా ఉతికారేశారు. ముఖ్యంగా ఉర్విల్ పటేల్ చెలరేగిన తీరు చూస్తే పూనకాలు రావాల్సిందే. 13 బంతుల్లో ఉర్విల్ పటేల్ ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ చేసి.. ఐపీఎల్ హిస్టరీలో ఈ చెన్నై బ్యాటర్ సెన్సేషనల్ రికార్డ్ క్రియేట్ చేశాడు. 7 సిక్సులు, 2 ఫోర్లతో 50 పూర్తి చేసిన ఉర్విల్.. RR బ్యాటర్ జైస్వాల్ రికార్డ్ ను సమం చేశాడు. 23 బంతులలో మొత్తం 8 సిక్సులు, 2 ఫోర్లతో 65 రన్స్ చేసి శహబాజ్ అహ్మద్ బౌలింగ్ లో ఔటయ్యాడు. ఉర్విల్ ఆట చూస్తున్నంత సేపూ.. ఐపీఎల్ లో గేల్ రికార్డు బద్ధలవుతుందా అన్న అనుమానం కలిగింది. అంతకు ముందు ఓపెనర్లు సంజూ శాంసన్, రుతురాజ్ గైక్వాడ్ శుభారంభాన్నిచ్చారు. 14 బంతులలో 2 సిక్సులు, 3 ఫోర్లతో శాంసన్ 28 రన్స్ చేశాడు. దిగ్వేశ్ సింగ్ బౌలింగ్ లో బౌల్డయ్యాడు. రుతురాజ్ 28 బంతులు ఆడి 2 సిక్సులు, 3 ఫోర్లతో 42 రన్స్ చేసి శహబాజ్ అహ్మద్ బౌలింగ్ లో వెనుదిరిగాడు.

లక్నో బౌలర్లలో శహబాద్ అహ్మద్ 2 వికెట్లు, దిగ్వేశ్ సింగ్ ఒక వికెట్ తీసుకున్నారు. అంతకు టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన లక్నో.. నిర్ణీత 20 ఓవర్లలో 203 రన్స్ చేశారు. లక్నో ఓపెనర్లలో జోష్ ఇంగ్లిస్ జోష్ కు చెన్నై బౌలర్లు విలవిలలాడారు. ఒకానొక దశలో 30 బంతులలోపే సెంచరీ చేస్తాడేమో అన్నంతగా చెలరేగాడు. చివరికి 33 బంతులలో 85 రన్స్ కొట్టి ఓవర్టన్ బౌలింగ్ లో సంజూ శాంసన్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ కు చేరాడు. మొత్తం 33 బంతులలో 6 సిక్సులు, 10 ఫోర్లతో వీర విహారం చేశాడు ఇంగ్లిస్. ఇంగ్లిస్ ఇన్నింగ్స్ తో ఈ మాత్రం స్కోర్ వచ్చింది లేదంటే.. లక్నో అట్టర్ ఫ్లాప్ అయ్యేదేనా..? అనే డౌట్ రాకమానదు. ఆ తర్వాత బ్యాటర్లంతా చేతులెత్తేయటంతో నిర్ణీత 20 ఓవర్లలో కేవలం 203 రన్స్ మాత్రమే చేయగలిగారు. షాహబాజ్ అహ్మద్ ఒక్కడు చివరిలో ఫోర్లు, సిక్సులతో మెరుపులు మెరిపించాడు.

## తడబడిన ముంబై బ్యాట్స్మెన్లు..
# ఆర్సీబీ విజయ లక్ష్యం ఎంతంటే?



ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య రాయ్పూర్లో వేదికగా జరగుతున్న కీలక పోరులో టాస్ గెలిచిన ఆర్సీబీ కెప్టెన్ ముందుగా రజత్ పటిదార్ బౌలింగ్ ఎంచుకున్నారు. మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. ఆర్సీబీ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అద్భుతమైన స్పెల్తో ముంబై బ్యాటర్లను కట్టడి చేశారు. తన 4 ఓవర్లలో కేవలం 23 పరుగులే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టారు. రోహిత్ శర్మ (22), సూర్యకుమార్ యాదవ్ (0) వంటి స్టార్ ఆటగాళ్లు భువీ ధాటికి తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరారు.

**ముంబైని ఆదుకున్న తిలక్, నమన్..**

28 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో ఉన్న ముంబైని తిలక్ వర్మ (57), నమన్ ధీర్ (47) ఆదుకున్నారు. వీరిద్దరూ నాలుగో వికెట్కు 82 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి గౌరవప్రదమైన స్కోరు అందించారు. భువనేశ్వర్తో పాటు జోష్ హాజిల్వుడ్, రసిఖ్ సలాం చెరో వికెట్ తీశారు. ఈ మ్యాచ్తో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అత్యధిక ఐపీఎల్ మ్యాచ్లు (278) ఆడిన ఎంఎస్ ధోని రికార్డును సంయుక్తంగా సమం చేశారు.



# ఇక్కడ నేర్చుకున్నది అక్కడ ప్రదర్శించే అవకాశం

హిందీలో తన అందచందాలతో క్రేజీ కథానాయికగా అలరిస్తోంది దిశా పటానీ. ఆమె హాలీవుడ్లోకి కూడా అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. 'స్టాటిగార్డ్స్ వర్సెస్ హోలీగార్డ్స్ సాగా'లోని మొదటి చిత్రం 'ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్'లో దిశా నటిస్తుంది. ఇందులో ఆమె జెస్సికా పాత్రను పోషిస్తున్నట్లు శుక్రవారం విడుదలైన ట్రైలర్తో స్పష్టం చేసింది చిత్రబృందం. ఈ చిత్రం గురించి దిశ మాట్లాడుతూ... ''ఇది చాలా ప్రత్యేకమైన ప్రాజెక్టు. ట్రైలర్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూశాను. తొలి అంతర్జాతీయ చిత్రంలో నటించడం మొదట థ్రిల్లింగ్గా అనిపించినా తర్వాత కొంచెం భయం వేసింది. కానీ, దీని వల్ల నటిగా నా నైపుణ్యాన్ని అన్వేషించుకునే అవకాశం లభించింది.అనుభవజ్ఞులైన, విభిన్నమైన నటీనటులతో కలిసి పనిచేయడం ఒక గొప్ప పాఠం నేర్పింది. కథ చెప్పడం అనేది భాష, భౌగోళిక సరిహద్దులకు అతీతమైనది. నటనలోని నిజాయతీనే విశ్వవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు మరింత దగ్గర చేస్తుంది. స్వదేశంలో నేను నేర్చుకున్నదానిని ప్రపంచ వేదికపైకి తీసుకొచ్చే అవకాశం ఈ సినిమాకల్పించింద''ని చెప్పింది. స్పేసీ, టైరిస్ గిబ్సన్, డాల్ఫ్ లండ్గ్రెన్లతో దిశా ఇందులో నటిస్తోంది. సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్గా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కెవిన్ స్పేసీ దర్శకత్వం వహిస్తున్నార్రు. ఈ ఏడాది విడుదల కానుందీ సినిమా. దిశ త్వరలోనే నటుడు ఇమ్రాన్ హష్మీ సరసన 'ఆవరాపన్ 2' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించడానికి ముస్తాబవుతుంది. అగ్రహీరో అక్షయ్ కుమార్ 'వెలకమ్ టు ది జంగిల్'లోనూ నటిస్తోంది.



## ప్రొఫెసర్ ఈజ్ బ్యాక్.. 'మనీ హెయిస్ట్' పై
# బిగ్ అప్డేట్ ఇచ్చిన ఓటిటి సంస్థ!

వరల్ వైడ్ గా మంచి పాపులర్ అయ్యినటువంటి టాప్ మోస్ట్ ఓటీటిలలో నెట్ ఫ్లిక్స్ కోసం అందరికీ తెలిసిందే. అయితే నెట్ ఫ్లిక్స్ లో ప్రసారం అయ్యిన పలు గ్లోబల్ హిట్ సిరీస్ లలో స్పానిష్ వెబ్ సిరీస్ లకసా డీ పాపెల్ ఇంగ్లీష్ లో మనీ హెయిస్ట్ అంటే తెలియని వారు ఎవరూ ఉండరు. అయితే ఈ సెన్సేషనల్ హిట్ సిరీస్ ని నెట్ ఫ్లిక్స్ మొత్తం 5 సీజన్స్ గా తెరకెక్కించి ముగించేశారు.

కానీ ఈ సిరీస్ ఫ్యాన్స్ కి బిగ్ అప్డేట్ ని నెట్ ఫ్లిక్స్ రీసెంట్ గా అందించడం మళ్ళీ ఫ్యాన్స్ కి కొత్త ఊపుని తీసుకొచ్చింది. ఓ క్రేజీ ప్రోమో కట్ తో వరల్ ఆఫ్ మనీ హెయిస్ట్ అంటూ ఇంకా ముగిసిపోలేదు అని సాలిడ్ అప్డేట్ ఇచ్చి సర్ప్రైజ్ చేశారు. దీనితో సిరీస్ హీరో ప్రొఫెసర్ అభిమానులు కూడా ఓ రేంజ్ లో ఎగ్జైట్ అవుతున్నారు. ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్ ఈ అవైటెడ్ సిరీస్ ని మొదలు పెట్టగా కొన్నాళ్ల తర్వాత స్ట్రీమింగ్ కి రానుంది. ఇక ఇదిలా ఉండగా దీనికి లింక్ ఉన్న మరో సిరీస్ బెర్లిన్ సీజన్ 2 ఈ మే 15న స్ట్రీమింగ్ కి రానుంది.



# హాట్ 'బొమ్మ'

బుట్టబొమ్మగా ఫేమస్ అయిన పూజాహెగ్డే కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు వరుస విజయాలతో గోల్డెన్ లెగ్గా పేరు తెచ్చుకున్న ముద్దుగుమ్మకు కొంతకాలంగా అదృష్టం కలిసిరావడం లేదు.

తెలుగు,తమిళ్ లో కొన్ని సినిమాలు చేతిలో ఉన్నా? అవి రిలీజ్ అయి సక్సెస్ అయ్యే వరకూ గానీ అమ్మడి కెరీర్ ఎలా ఉంటుందన్నది క్లారిటీ రాదు. ప్రస్తుతం వరుణ్ ధావన్ సరసన బూహై జవానిబూ అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతోనైనా బాలీవుడ్ లో మళ్లీ సక్సెస్ అందుకోవాలని ఆశపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ముంబై వర్గాల్లో ఓ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.

పూజా హెగ్డే ఈ చిత్రం కోసం గ్లామర్ హద్దులను చెరిపేసి నటిపస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా తన సినిమాల్లో గ్లామర్కు ప్రాధాన్యత ఇచ్చే పూజా ఈ హిందీ ప్రాజెక్ట్ కోసం మరింత బోల్డ్గా కనిపించబోతోందని సమాచారం. బాలీవుడ్ నెటిజన్లను , యువతను ఆకట్టుకోవడానికి ఆమె ఈ విధమైన మేకోవర్ ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. బూహై జవానిబూ చిత్రం యూత్ ఫుల్ ఎంటర్టైనర్గా తెరకెక్కుతోంది. వరుణ్ ధావన్ వంటి ఎనర్జిటిక్ హీరో సరసన పూజా నటిస్తుండటంతో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందనే అంచనా లుంటాయి. వరుస పరాజయాలు ఎదురైనప్పుడు నటీనటులు ఇమేజ్ను మార్చుకోవడం సహజం. పూజా హెగ్డే కూడా అదే బాటలో పయనిస్తుంది. బూహై జవానిబూ సక్సెస్ ఆమె బాలీవుడ్ కెరీర్కు ఊపిరి పోయడమే కాదు. మళ్ళీ టాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించడానికి దోహదపడుతుందని అమ్మడు బలంగా నమ్ముతుంది. షూటింగ్ దశలోనే ఇంతటి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా విడుదల తర్వాత ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



మొత్తంగా పూజా హెగ్డే కెరీర్ గ్రాఫ్ను మళ్ళీ పైకి తీసుకెళ్లడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. హద్దులు చెరిపేయడం అనేది గ్లామర్ పరంగానే కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉందనే సంకేతంగా భావించొచ్చు.

ఇళయ దళపతి ఇప్పుడు తమిళనాడు రాష్ట్రానికి సీఎం అయినటువంటి విజయ్ హీరోగా నటించిన ఆఖరి చిత్రమే 'జన నాయగన్'. దర్శకుడు హెచ్ వినోద్ తెరకెక్కించిన ఈ సాలిడ్ మాస్ యాక్షన్ డ్రామా విజయ్ కెరీర్ లో ఆఖరి సినిమా కాగా విజయ్ ముందే ఈ సినిమాతో ఇక ఫుల్ స్టాప్ పెట్టి రాజకీయాల్లో శాశ్వతంగా ఉంటానని హామీ ఇచ్చి సీఎం అయ్యిపోయాడు. అయితే

# సీఎం విజయ్ ఆఖరి సినిమా రిలీజ్ పై తేల్చేసిన నిర్మాత..




ఇప్పుడు దళపతి విజయ్ నటించిన ఈ ఆఖరి సినిమా ఎన్నో అడ్డంకులు తర్వాత ఎట్టకేలకి రిలీజ్ కి సిద్ధం అయ్యింది. ఇన్ని రోజులు ఆ ఇబ్బంది ఈ ఇబ్బంది చూసిన ఈ సినిమా ఇక ఆగేది లేదని కే వి ఎన్ ప్రొడక్షన్స్ అధినేత క్లారిటీ ఇచ్చారు. నేడు సీఎం గా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ ఆఖరి సినిమా విడుదల మరో రెండే వారాల్లో అని కన్ఫర్మ్ చేశారు. అంటే ఈ సినిమా ఈ మే 28 రిలీజ్ కి లాక్ అయిపోయింది అనుకోవచ్చు. సో ఇది మాత్రం విజయ్ అభిమానులు బిగ్ పాజిటివ్ న్యూస్ అనే చెప్పాలి.

# 'పెద్ది' విషయంలో ఫ్యాన్స్ డిజప్పాయింట్మెంట్!



మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రమే పెద్ది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఈ సాలిడ్ మల్టీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే ఈ గ్యాప్ లో మేకర్స్ కూడా భారీ ప్లానింగ్ లు చేస్తున్నప్పటికీ అభిమానులు మాత్రం ఇంకా డిజప్పాయింట్ గానే ఉన్నారు. యూఎస్ మార్కెట్ లో భారీ ఓపెనింగ్స్ గ్యారెంటీ అనుకున్న సినిమా బుకింగ్స్ పరంగా ఇప్పుడు స్లో అయ్యింది. దీనితో సమయం దగ్గరకి వస్తున్నప్పటికీ మేకర్స్ ఇంకా ఎలాంటి కంటెంట్ ని వదలకుండా డిలే చేస్తున్నారనే అభిమానులు భావిస్తున్నారు. దీనితో ఏదొక కొత్త కంటెంట్ కనీసం కొత్త పోస్టర్ ని కూడా వదలకుండా కాలయాపన చేస్తుండడంతో అభిమానులు ఒకింత నిరాశ గానే ఉన్నారు.

సో పెద్ది నుంచి కొత్త కంటెంట్ రావడం ఎప్పటి నుంచి మొదలవుతుందో చూడాలి. ఇక ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్న ఈ సినిమా గ్రాండ్ గా జూన్ 4న విడుదల కాబోతుంది.



# 'కరుప్పు'...టైమ్ ఫిక్స్

సూర్య అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'కరుపు' సినిమా ప్రమోషన్స్ స్పీడ్ పెంచాయి. తాజా అప్డేట్ ప్రకారం, ఈ చిత్ర అధికారిక ట్రైలర్ను నేడు (మే 10) రాత్రి 7 గంటలకు విడుదల చేయబోతున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. అంతేకాకుండా, ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మే 14న గ్రాండ్గా విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సూర్య మార్క్ యాక్షన్, ఇంటెన్స్ ఎమోషన్స్తో కూడిన ఈ సినిమా సమ్మర్ బిగ్గెస్ట్ రిలీజ్లలో ఒకటిగా నిలవనుంది.

ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, చాలా కాలం తర్వాత సూర్య సరసన త్రిష నటిస్తుండటం విశేషం. ఆర్జే బాలాజీ, ఇంద్రన్స్, స్వాసిక వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచగా, నేడు రాబోయే ట్రైలర్ సినిమా కథాంశంపై మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యాన్ర్ ప్రభు ఎస్.ఆర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# యోగాతో మానసిక ప్రశాంతత అలవడుతుంది



సూర్యాపేట టౌన్, మే 10, మనం న్యూస్‌: యోగాతో మానసిక ప్రశాంతత, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని తెలంగాణ యోగ ప్రచార సమితి అధ్యక్షులు ప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బ్రాహ్మణ కళ్యాణ మండపం నందు విద్యార్థులకు ఉన్నత యోగా శిక్షణ కేంద్రం, శ్రీ వాసవి సేవా సమితి సహకారంతో ఉచిత యోగా శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు యోగ శిక్షణ కేంద్రం గురువు చాడపాపిరెడ్డి, శ్రీ వాసవి సేవాసమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం బ్రాహ్మణ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి కట్టెకోల పూర్ణ చందర్ రావులు శిక్షణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యోగ ప్రచార సమితి కార్యదర్శులు ఝాన్సీ లక్ష్మి, సుదర్శన్ రెడ్డి, శ్రీ వాసవి సేవాసమితి గౌరవ సలహాదారులు గోపారపు రాజు, కోశాధికారి సోమ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు కుంచపర్తి రాజశేఖర్ సభ్యులు పోలా లక్ష్మీనారాయణ, బెలిదే శ్రీనివాసు, వెంపటి శబరి నాథ్ యోగ సాధకులు వల్కి లింగయ్య, వేల్పుల సుధాకర్, గోరెంట్ల శ్రీనివాస్, మమత, శ్రీదేవి, జ్యోతి, జయలక్ష్మి, ఓ లింగయ్య, వెంకట్ రెడ్డి వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ నాగరాజు, బాలకృష్ణ, శ్రీనాథ్, లక్ష్మి, విజయలక్ష్మి, విజయ్ సంతోష్ పాల్గొన్నారు.

# మోడీ సభకు తరలిన బిజెపి శ్రేణులు

కోదాడ, మే 10(మనం న్యూస్): కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రదాని నరేందర్ మోడీ బహిరంగ సభకు కోదాడలో పార్టీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర నాయకులు మల్లెబోయిన అంజి యాదవ్. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా బిజెపి నాయకులు కార్యకర్తలు నరేంద్ర మోడీ అభిమానులు అధిక సంఖ్యలో హైదరాబాదుకు తరలి పేరడే గ్రౌండ్ లో జరుగు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోసూర్యాపేట జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వంగవీటి శ్రీనివాసరావు, బీజేపీ సీనియర్ నాయకులు బొలిశెట్టి క్రిష్ణయ్య, మునగాల మండలం బీజేపీ అధ్యక్షుడు మైలార్ శెట్టి నాగేశ్వరరావు, చిలుకూరు మండల బీజేపీ అధ్యక్షులు పారెల్లి మహేష్, అనంతగిరి మండల బీజేపీ అధ్యక్షులు చింతకుంట్ల సతీష్ మొదలగు వారు పాల్గొన్నారు.



# డీఎస్పీని సన్మానించిన తోటి మిత్రులు



- పలువురి అభినందనలు
- స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

పెన్ పహాడ్, మే 10 (మనం న్యూస్)ః మండలంలోని ధూపహాడ్ గ్రామానికి చెందిన పబ్బతి వెంకటేశ్వర్లు హైదరాబాదులోని సి ఐ డి విభాగంలో విధులు నిర్వహిస్తూన్న క్రమంలో ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పోలీస్ ఉన్నత అధికారుల పదోన్నతిలో భాగంగా డిఎస్పీగా ప్రమోషన్ పొందడంతో ఆయనతోపాటు 1988-89 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న చిరకాల తోటి మిత్రులు వెంకటేశ్వర్లును ఆదివారం స్వగ్రామంలోని ఇంటి వద్ద శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన స్నేహితుడైన డీఎస్పీ పబ్బతి వెంకటేశ్వర్లు ఇంకా ఉన్నత పదవులను పొందుకోవాలని ఆ భగవంతుడి ఆశీస్సులు ఆయనపై వారి కుటుంబం పై నిరంతరం ఉండాలని ఆశిస్తున్నట్లు తెలిపారు వారితోపాటు పలువురు ఆయనను డీఎస్పీగా పదోన్నతి పొందిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు తనపై అభిమానం చూపిన తన స్నేహితులకు, అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికి డిఎస్పి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తోటి స్నేహితులు గుండు మట్టయ్య, కర్ణం పాండయ్య, దొంగరి సైదులు, మామిడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

మేళ్లచెరువు, మే 10 మనం న్యూస్‌ః మేళ్లచెరువు లోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1995.. 96 సంవత్సరంలో చదివిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల గెట్ టుగెదర్ కార్యక్రమం ఆదివారం ఆత్మీయ వాతావరణం లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో పెద్ద సంఖ్యలో హాజరై తమ పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు వ్యాపారం, ఉద్యోగం, వ్యవసాయం, వివిధ రంగాల్లో ఉన్న తమ అనుభవాలను పంచుకున్నారు. స్నేహబంధం ఎప్పటికీ కొనసాగాలని, పాఠశాల రోజులు జీవితంలో మధుర జ్ఞాపకాలుగా నిలిచిపోతాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థుల కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ

- డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరి హాజరు కావాలి
- ప్రజల సమస్యలను ఆర్‌డిఓ కార్యాలయంలో సమర్పించవచ్చు

సూర్యాపేట, మే 10 (మనం ప్రతినిధి): ఇక పై ప్రతి సోమవారం ఆర్ డి ఓ కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయి ప్రజావానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్డిఓ లను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లా కేంద్రంలో మాత్రమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నదని, అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక పై ప్రతి సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని స్పష్టం చేశారు. డివిజన్ సాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ డివిజనల్ అధికారి వ్యవహరిస్తారని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని డివిజనల్ అధికారులు అందరూ డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించారు.

# 3,99593 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం



- వాటి విలువ 954.63 కోట్ల రూపాయలు
- కొనుగోళ్లపై ప్రతిరోజు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నాము
- జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్

నల్లగొండ,మే 10 (మనం ప్రతినిధి )ః రబీ ధాన్యం కొనుగోలులో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 954.63 కోట్ల రూపాయల విలువ చేసే 3 లక్షల 99,593 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు 6 లక్షల 59 వేల 596 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 3 లక్షల 97,616 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసినట్లు పేర్కొన్నారు. 644 కోట్ల రూపాయల విలువచేసే 2 లక్షల 69 వేల 730 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం అమ్మిన రైతులకు చెల్లింపులలో భాగంగా 30 వేల 167 మంది రైతులకు 558.94 కోట్ల రూపాయలను చెల్లించినట్లు కలెక్టర్ వివరించారు. రబీ ధాన్యం కొనుగోలు పై ప్రతిరోజు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షిస్తున్నామని, అంతేకాక సమీక్ష సమావేశాలు, టెలికాన్ఫరెన్స్, వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తున్నామని, ధాన్యం రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని, అలాగే కొనుగోలు కేంద్రాలలో జాప్యం జరగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు లారీలు, హమాలీ, ధాన్యాన్ని తరలించడం వంటి వాటిపై ప్రత్యేక దృష్టికి కేంద్రీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

# దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ములుగు, మే 10(మనంన్యూస్)ః చిన్న తిమ్మాపూర్ గ్రామంలో జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి ములుగు పోలీసులు నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 9న మధ్యాహ్న సమయంలో ములుగు ఎస్ఐ, పోలీసు సిబ్బంది కలిసి వంటిమామిడి చెక్పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న క్రమంలో ఒక వ్యక్తి చిన్న తిమ్మాపూర్ గ్రామ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకొని విచారించగా, అతను తన పేరు పుత్రకొండ బాలకృష్ణ, తండ్రి: ప్రకాష్, వయస్సు: 25 సంవత్సరాలు, కులం: కాపు, వృత్తి: కూలి, స్వగ్రామం: నులకజోడు గుర్రండి, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ప్రస్తుతం నివాసం: మజీద్పూర్, శామీర్పేట్, మేడ్చల్ జిల్లా అని తెలిపినాడు. ఇతనిపై గతంలో షామీర్పేట్ మరియు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్లలో రెండు కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించినాడు. 04-05-2026 నాడు మధ్యాహ్న సమయంలో తాను మడిగెల బాలచందర్ ,ఇప్పలపల్లి నరేష్ మోటార్ సైక్లి వంటిమామిడి (చిన్న తిమ్మాపూర్) గ్రామానికి వచ్చారని తెలిపారు. అక్కడ ఒక హార్డ్వేర్ షాప్లో ఇనుప రాడ్ తీసుకొని, చిన్న తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శాలివాహిని నర్సింలు ఖి/ా బాలయ్య, వయస్సు: 54 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం గారి ఇంటి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి, బీరువా తాళం పగులగొట్టి బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు మరియు నగదు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దొంగతనం అనంతరం ముగ్గురూ కలిసి మజీద్పూర్కు వెళ్లగా, బాలచందర్ దొంగిలించిన బంగారం, వెండి మరియు నగదును కొద్ది రోజుల పాటు ఎవరికి అనుమానం రాకుండా దాచిపెట్టి, తరువాత ముగ్గురం పంచుకుందామని చెప్పి, బాలకృష్ణను అక్కడ దించి, అతని బ్లై మిగతా ఇద్దరూ వెళ్లినట్లు తెలిపినాడు. అలాగే, వంటిమామిడి - చిన్న తిమ్మాపూర్ ప్రాంతంలో చేసిన దొంగతనం కేసులో పోలీసులు తమను గుర్తించలేదని భావించి, మళ్లీ దొంగతనం చేయాలనే ఉద్దేశంతో బాలకృష్ణ ఈరోజు గతంలో ఉపయోగించిన ఇనుప రాడ్ తీసుకొని తాళం వేసి ఉన్న ఇండ్లను గమనిస్తూ తిరుగుతుండగా చెక్పోస్ట్ సమీపంలో ములుగు పోలీసులు పట్టుకున్నట్లు వెల్లడించినాడు. నిందితుడు తన నేరాన్ని ఒప్పుకోవడంతో అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించినారు. కేసులో పాల్గొన్న మిగతా ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉండగా, వారిని త్వరలోనే అరెస్ట్ చేసి దొంగిలించిన సొత్తును రికవరీ చేయనున్నట్లు గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. రవిరాజు తెలిపారు.అలాగే, నిందితుడిని పట్టుకున్న ములుగు ఎస్సై గారిని మరియు పోలీసు సిబ్బందిని గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అభినందించారు.



# వేద ఘోషతో మార్మోగిన శ్వేతసౌధం



వాషింగ్టన్, మే 10: అమెరికాలో జాతీయ ప్రార్థనా దినోత్సవం సందర్భంగా శ్వేతసౌధం వేద ఘోషతో మార్మోగింది. న్యూజెర్సీలోని బోచాసన్వాసీ అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ఆలయానికి చెందిన ఓ పండితుడు.. గురువారం శ్వేతసౌధంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన యజుర్వేదంలోని శాంతి పాఠాన్ని వల్లె వేయగా కార్యక్రమానికి హాజరైన వారంతా కళ్లు మూసుకుని, ముకుళిత హస్తాలతో మంత్రాలను ఆలకించారు. భూమి, ఆకాశం, స్వర్గం, జలం, వృక్షాలు, మొక్కలు, ప్రతి వ్యక్తి అంతరంగంలో అంతా శాంతి వెల్లివిరియాలని ఆయన ప్రార్థించారు. అమెరికాలో 1952 నుంచి ఏటా మే తొలి గురువారం రోజున జాతీయ ప్రార్థనా దినోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది జరిగిన కార్యక్రమానికి 50 రాష్ట్రాల నుంచి విభిన్న వర్గాలకు చెందిన వేల మంది తరలివచ్చారు.

# అమెరికా ప్రతిపాదనకు స్పందించని ఇరాన్

- సమాధానం కోసం వేచిచూస్తున్నామన్న ట్రంప్



దుబాయ్, మే 10: యుద్ధాన్ని ముగించడానికి తాము ప్రతిపాదించిన 14 అంశాల ప్రతిపాదనపై ఇరాన్ స్పందన కోసం నిరీక్షిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హర్మూజ్ జల సంధి దగ్గర కాల్పులు జరుగుతున్నప్పటికీ తాత్కాలిక కాల్పుల విరమణ కొనసాగుతోందని వెల్లడించారు. అమెరికా ప్రతిపాదనపై సమాధానం ఇవ్వడానికి ఇరాన్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందా అన్న ప్రశ్నకు.. 'ఆ విషయం త్వరలోనే తెలుస్తుంది. ప్రస్తుతం వారి దగ్గర సైన్యం మిగలలేదు. ఏం జరుగుతుందో చూద్దాం. ఈ రాత్రికి లేఖ వస్తుందని ఆశిస్తున్నా' అని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ తామింకా అమెరికా ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని తెలిపింది. హర్మూజ్ జల సంధి దగ్గర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

అమెరికా సైన్యం శనివారం మరో రెండు ఇరాన్ చమురు ట్యాంకర్లపై దాడి చేసింది. నీ ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రిపబ్లిక్ గార్డ్ కోర్ (ఐఆర్జీసీ)కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలతో 41 మందిని బహ్రెయిన్ అరెస్టు చేసింది. నీ లెబనాన్‌పై శనివారం ఇజ్రాయెల్ నిర్వహించిన దాడుల్లో 19 మంది మరణించారు.

# పార్లమెంట్ ముందు హంగరీ నాయకుడి స్టెప్పులు



బుడాపెస్ట్, మే 10: హంగరీ పార్లమెంట్ ముందు ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. శనివారం ఆ దేశ నూతన ప్రధాని పీటర్ మగ్యార్ ప్రమాణస్వీకారం సమయంలో ఆ పార్టీ నేత జోల్ట్ హెగెడస్ అందరీ దృష్టినీ ఆకర్షించారు. పార్లమెంట్ మెట్లపై ఆయన వేసిన స్టెప్పులకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతుంది. హంగరీలో పీటర్ మగ్యార్ నేతృత్వంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పడింది. పార్లమెంట్ వెలుపల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది మద్దతు దారులు తరలివచ్చారు. ఆ సమయంలో తమ పార్టీ విజయోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన మ్యూజిక్కు హెగెడస్ తన స్టెప్పులను అందించారు. ఎంతో హుషారుగా డ్యాన్స్ చేశారు. గిటార్ స్టెప్పులతో అలరించారు. దీంతో అక్కడ ఉన్న మద్దతుదారుల దృష్టిని ఆకర్షించారు. ఆయన స్టెప్పులకు మగ్యార్ కూడా నవ్వుతూ చప్పట్లతో ప్రోత్సహించారు. ఎన్నికల ఫలితాల సమయంలోనూ హెగెడస్ డ్యాన్స్ చేశారు. ఇప్పుడు మరోసారి తన నృత్యంతో అలరించి 'డ్యాన్సింగ్ పొలిటీషియన్'గా ఫేమస్ అయ్యారు. కొత్త ప్రభుత్వంలో ఆరోగ్య శాఖ మంత్రిగా హెగెడస్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# ఖతార్‌లో బల్క్ క్యారియర్‌పై దాడి

దోహా, మే 10: పశ్చిమాసియాలో ఓ బల్క్ క్యారియర్ నౌకపై దాడి జరిగింది. ఖతార్ రాజధాని దోహాకు సమీపంలో పెద్ద మొత్తంలో కంటైనర్లను మోసుకొస్తున్న నౌకపై గుర్తుతెలియని డ్రోన్ లేదా క్షిపణితో దాడి చేసింది. ఈ క్రమంలోనే నౌకలో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని ఆదివారం బ్రిటిష్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది.యూకే మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ ప్రకారం.. ఖతార్ రాజధాని దోహాకు 23 నాటికల్ మైళ్ల దూరంలో ఓ నౌక సరకును తరలిస్తుండగా గుర్తుతెలియని ఆయుధం తాకడంతో నౌకలో మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పేశారు. దీంతో ప్రాణనష్టం తప్పిందని యూకేఎంటీఓ వెల్లడించింది. అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతం కాల్పుల విరమణ అమలవుతుండగా, పర్షియన్ గల్ఫ్‌లో ఈ దాడి చోటుచేసుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దాడికి గురైన నౌక ఏ దేశానికి చెందినది, అందులోని సరకు వివరాలు తెలియరాలేదు.



# హెచ్1బీ ఉద్యోగుల కనీస వేతనం పెంపు!

| హెచ్1బీ కేటగిరీ | ప్రస్తుత వేతనం | ప్రతిపాదిత వేతనం | పెంపు శాతం |
|---|---|---|---|
| లెవెల్ 1 | 73,279 | 97,746 | 33. 39 |
| లెవెల్ 2 | 98,987 | 1,23,212 | 24. 47 |
| లెవెల్ 3 | 1,21,979 | 1,47,333 | 20. 79 |
| లెవెల్ 4 | 1,44,202 | 1,75,464 | 21. 68 |

(వేతనాలు.. వార్షిక ప్రాతిపదికన డాలర్లలో..)

వాషింగ్టన్,మే 10: విదేశాల నుంచి హెచ్1బీ వీసా ప్రోగ్రామ్ కింద కంపెనీలు తక్కువ వేతనాలకే ఉద్యోగులను నియమించుకోవడాన్ని అడ్డుకునేందుకు అమెరికా కార్మికశాఖ తన యత్నాలను ముమ్మరం చేసింది. అమెరికా పౌరులైన ఉద్యోగులకు అధిక వేతనాలు ఇవ్వాల్సి వస్తున్నందునే కంపెనీలు హెచ్1బీ దారిని ఎంచుకుంటున్నాయని, దీనివల్ల అమెరికన్లకు ఉపాధి లభించడం లేదని ట్రంప్ ప్రభుత్వం ఆక్షేపిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితిని మార్చి అమెరికన్లకు ఉద్యోగాలు వచ్చేలా చేసేందుకు హెచ్1బీ వీసాదారులకు చెల్లించే వేతనాలను గరిష్ఠంగా 33.39 శాతం, కనిష్ఠంగా 20.79శాతం పెంచేందుకు సిద్ధమవుతోంది. దీనిపై ఈ నెల 26 వరకూ అభిప్రాయాలను సేకరించి ఆ తర్వాత తుది నిర్ణయం తీసుకోనుంది.

# నేడు కలెక్టరేట్ లో పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్

- అర్జీల సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100కు కాల్ చేసి తెలుసుకోవాలి
- జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి మే 10 మనం న్యూస్ :ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్), రెవిన్యూ క్లినిక్ ల కార్యక్రమాలను నేడు మే 11 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంతో పాటు జిల్లాలో అన్ని మండల, డివిజన్ స్థాయి కార్యాలయాల లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ప్రకటన లో పేర్కొన్నారు.పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్ లలో సమర్పించిన అర్జీల సమాచారం కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవాలని అర్జీదారులకు కలెక్టర్ సూచించారు.పి జి ఆర్ ఎస్, రెవిన్యూ క్లినిక్ ల కు హాజరు కాని అర్జీదారులు (మీ కోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా అర్జీలు నమోదు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పేర్కొన్నారు.

# బండి భగీరథను వెంటనే శిక్షించాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను వెంటనే భర్తరఫ్ చేయాలి
- ఎర్రబెల్లి స్వర్ణ



**హనుమకొండ, మే 10 (మనం ప్రతినిధి):** బండి సంజయ్ తనయుడు బండి సాయి భగీరథ్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలనిడిమాండ్ చేశారు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్త ధర్నా మరియు నిరసన కార్యక్రమాల్లో భాగంగ ఆదివారం హనుమకొండ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ ఆధ్వర్యంలో హనుమకొండ కాంగ్రెస్ భవన్ కూడలి వద్ద ధర్నా మరియు నిరసన కార్యక్రమం చెప్పటారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ హాజరై ధర్నా కార్యక్రమంలో పాల్గొని బండి సంజయ్ తనయుడు బండి సాయి భగీరథ్ ను అరెస్ట్ చేయాలని కేంద్ర మంత్రివర్గం నుండి బండి సంజయ్ ను వెంటనే భర్తరఫ్ చేయాలి అంటూ ప్లకారడ్స్ చేత పట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం బండి సంజయ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తనయుడు బండి సాయి భగీరథ్ మైనర్ బాలికను లైంగికంగా వేధించిన కేసులో అతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రివర్గం నుండి ఆయన్ను వెంటనే భర్తరఫ్ చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 'బేటీ బచావో - బేటీ పడావో' అంటూ ప్రచారం చేసే బీజేపీ నాయకులు, ఇప్పుడు ఈ ఘటనపై ప్రజలకు సమాధానం చెబుతారు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కొనసాగితే బాధిత మైనర్ బాలికకు న్యాయం జరిగే అవకాశం లేదని కేంద్రంలో అధికారంలో ఉన్నామనే గర్వంతో విర్రవీగుతూ చట్టాన్ని చుట్టంలా మార్చుకోవాలని చూస్తున్నారని విమర్శలు చేశారు. బీజేపి పాలిత రాష్ట్రాల్లో ఆబ్కకు చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు అత్యాచార, లైంగిక వేధింపుల కేసుల్లో ఉన్నారని, ఈ ఆరోపణలపై రాజకీయ రక్షణ కింద ఆయా నేతలకు ఆబ్క రక్షణ కల్పిస్తుందని తెలిపారు.ల బేటీ బచావో' అనేది కేవలం ఎన్నికల నినాదమేనా కేంద్ర మంత్రి కుమారుడిపై చట్టపరమైన చర్యలు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ ఎం.పిలను ఎంతలా కాపాడుకునే ప్రయత్నం చేస్తోందో దీన్ని బట్టి తెలుస్తుందని అన్నారు. సాధారణ పౌరులపై పోక్సో కేసు నమోదైతే వెంటనే అరెస్టులు చేస్తారు, కానీ కేంద్ర మంత్రి కుమారుడు కాబట్టి పోలీసుల విచారణ నెమ్మదిగా సాగుతోందా అని పేర్కొన్నారు. బండి సంజయ్ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్నందున, పోలీసులపై ఒత్తిడి ఉండే అవకాశం ఉందని న్యాయం అనేది అందరికీ సమానంగా ఉండాలని , అధికారం ఉన్నవారికి ఒక చట్టం, సామాన్యులకు మరొక చట్టం ఉండకూడదన్నారు. చట్టం ఎవరికీ చుట్టం కాకూడదు. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేసే స్థాయికి పరిస్థితి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవాలని తెలిపారు. ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. కేంద్ర మంత్రివర్గం నుండి ఆయన్ను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన లావుడియా పల్లవి రాజు నాయక్



**భూపాలపల్లి, మే 10(మనం న్యూస్):** భూపాలపల్లి జిల్లా గొల్ల బుద్ధారం పెద్ద తండాలో లావుడియా ఫుల్ బంద్ సీతారాం నాయక్ కుమారుడు లావుడియా కృష్ణవేణి రాందాస్ మ్యారేజ్ రిసెప్షన్ లో నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పల్లవి రాజు నాయక్ సర్పంచ్ అజ్మీర జైపాల్ నాయక్,లావుడియా తారాబాయి, జ్యోతి బాలు నాయక్, శారద రాము నాయక్, చాంది దాసు నాయక్, సరోజన, విజయ రఘురాం, లలిత, ఫుల్ బంద్, లలిత కరణ్, అరుణ రాజన్న, అజ్మేరా ఆనందా రవి నాయక్, అజ్మీర వసంత చీమన్ నాయక్, మమత గణపతి, అజంత రాజు, హట్కర్ రజిత రాజన్న, లావుడియా వనిత గోవర్ధన్, విజయ హేమ నాయక్, పల్లవి రాజు నాయక్, సరిత గణపతి, సునీత సునీల్, కల్పన గోపాల్, సంధ్య సందీప్, కవిత జయపాల్, సుజాత ఉదయ్ సింగ్, సరిత జెల్ సింగ్, మమత సంతోష్, రాజు నాయక్, సంపూర్ణ, చంద్రం, సురేందర్, హనుమంతు, రాహుల్, అనంతరం, రాజు నాయక్ గోపి నాయక్, ప్రతాప్ నాయక్, మల్లయ్య మొదలైన వారు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు



## బాలికపై లైంగిక వేధింపులు
### శ్రీలంక బౌద్ధ సన్యాసి అరెస్టు

**కొలంబో, మే 10 :** పదిహేనేళ్ల బాలికను లైంగికంగా వేధించారన్న ఆరోపణలతో శ్రీలంకకు చెందిన 71ఏళ్ల బౌద్ధ సన్యాసి పల్లెగామ హేమరథనను అరెస్టు చేసినట్లు పోలీసులు శనివారం వెల్లడించారు. ఆయన దేశంలోని ప్రసిద్ధ ఆలయానికి ప్రధాన భిక్షువుగా ఉన్నారు. హేమరథనతోపాటు ఈ అకృత్యానికి సహకరించిన బాలిక తల్లిపైనా అనురాధపురలోని మేజిస్ట్రేట్ కోర్టు అరెస్టు వారెంటు జారీ చేసింది. ఆలయ ఆవరణలో జరిగిన ఈ ఘటనపై ఒక బాలికను అపహరించి నిర్బంధించినట్లు గత మార్చి నెలలోనే ఫిర్యాదు నమోదైంది. విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చాయి. కొలంబోలోని ప్రైవేటు ఆసుపత్రి ఎమర్జెన్సీ యూనిట్లో చికిత్స పొందుతుండగా హేమరథనను.. బాలిక తల్లిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వక్ఫ్ భూములపై అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు
- సంబంధిత శాఖలకు లేఖరాసిన కలెక్టర్

**హనుమకొండ మే 10( మనం ప్రతినిధి):** వరంగల్ జిల్లా ఫోర్ట్ వరంగల్ మండలంలోని ఉర్సు జాగీర్ గ్రామ పరిధిలో ఉన్న దర్గా జిందా బిక్కన్ దర్వేష్ మరియు మసీదు వక్ఫ్ భూములపై జరుగుతున్న అక్రమ ఆక్రమణలు, నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఎం. సత్య శారదాదేవి సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సర్వే నంబర్లు 273, 274, 275, 276లలో మొత్తం 17 ఎకరాల 5 గుంటల మేర నమోదైన వక్ఫ్ భూములను రక్షించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ భూములు ఇప్పటికే గెజిట్లో వక్ఫ్ ఆస్తిగా నమోదై ఉన్నాయని, కోర్టు తీర్పులు కూడా వక్ఫ్ బోర్డు పక్షాన వచ్చినట్లు లేఖలో స్పష్టం చేశారు ఈ భూములపై ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేయవద్దని సబ్-రిజిస్ట్రార్కు, అనుమతులు జారీ చేయవద్దని జీడబ్ల్యూఎంసీ కమిషనర్కు ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే అక్రమ ఆక్రమణదారులపై వక్ఫ్ చట్టం-1995 సెక్షన్ 52-అ ప్రకారం కేసులు నమోదు చేయాలని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ అధికారులకు సూచించారు. భూముల వాస్తవ పరిస్థితిని పరిశీలించేందుకు రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్, వక్ఫ్ బోర్డు, టాస్క్ ఫోర్స్, పోలీస్ శాఖలతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలు, ప్లాటింగ్ కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని ఆదేశించారు.

అంతేకాకుండా ప్రొహిబిటెడ్ వక్ఫ్ ల్యాండ్‌గా ఉన్న భూములు ఎలా రిజిస్ట్రేషన్ చేశారు అనే దానిపై ఉన్నత స్థాయి విచారణ జరపాలని సూచించారు. వక్ఫ్ భూముల రక్షణ కోసం అత్యవసర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత శాఖలను ఆదేశించారు.

## త్యాగాలకు మారు పేరు తల్లి ప్రేమ



**హన్మకొండ, మే 10 (మనం ప్రతినిధి):** మాతృ మూర్తి గొప్పతనం వెళ్లకట్టలేనిదని అమ్మ ప్రేమ త్యాగాలకు మారు పెరన్ని ఈగ మల్లేష్ అన్నారు. హన్మకొండ లోని పబ్లిక్ గార్డెన్ లో, పద్మ శ్రీ డాక్టర్ నేరెళ్ల వేణు మాధవ్ కళా ప్రాంగణం లో జరిగిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో జె.బి కల్చరల్ ఆరట్స్ సొసైటీ, వరంగల్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ మూర్తి దినోత్సవం పురస్కరించుకొని మాతృ మూర్తులకు రుద్రమ నంది పురస్కారాలు -2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కేంద్ర ఖాదీ చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . శనివారం రోజున సాయంత్రం మొదలైన కార్యక్రమం అర్ధరాత్రి వరకు అంగరంగ వైభవంగా కూచిపూడి నృత్యాలతో , ఆటపాటలతో సందడిగా జరిగింది. ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ అమ్మ త్యాగాలకు, నిద్రలేని రాత్రులకు మాటల్లో చెప్పలేని ప్రేమకు కూడా ధన్యవాదం చెప్పే రోజు కావాలని అన్నారు మాతృ మూర్తుల దినోత్సవం అంటే ఒక్కరోజు అమ్మను ప్రేమించడం కాదని ప్రతిరోజూ ప్రేమించే ఒక ప్రత్యేక గుర్తు మాత్రమే అని అమ్మ గొప్పతనాన్ని చాటి చెప్పారు. కళాకారుల వృత్తికి అంకితభావం, సృజనాత్మకత మరియు క్రమశిక్షణ అవసరం. నిజమైన కళాకారుడు కేవలం ప్రశంసల కోసం కాకుండా, కళ కోసం, భగవంతుని కోసం తన ప్రదర్శనను ఇస్తాడని పేర్కొన్నారు. కళాకారుడు వ్యక్తిగత చైతన్యాన్ని కోల్పోయి విశ్వ చైతన్యంలో కలిసిపోవడం వారి పరమావధి. స్టేజ్ కళాకారులు సమాజానికి అద్దం పడతారని తెలిపారు. వ ప్రతిభ, నిబద్ధత, కళ పట్ల వారికున్న అంకితభావం అభినందనీయం. వారిని ప్రోత్సహించడం, వారి కళను గౌరవించడం మన బాధ్యత అని వారు కొనియాడారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు ఈగ మల్లేశం గారిని మెమెంటో తో ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో జె.బి కల్చరర్ ఆరట్స్ సొసైటీ అధ్యక్షులు జడల శివ, జడల హరిత,డాక్టర్. హరినాధ రావు, బీటవరం శ్రీధర స్వామి,పొట్లపల్లి శ్రీనివాస్ రావు, కాజీపేట తిరుమలయ్య, జూలుకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, కూరపాటి శ్రీధర్ రాజు,ఆకుల సదానందం, జనగాం రాము, కీర్తి, జూలూరి శ్రీనివాస్, కరిమిల్ల సంపత్ రావు, లక్ష్మా రెడ్డి తదితరులు మరియు అధిక సంఖ్యలో కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

## ఇరాక్‌లో ఇజ్రాయెల్ రహస్య స్థావరం?



- అంతర్జాతీయ మీడియా కథనం

**బుడాపెస్ట్, మే 10:** ఇరాన్‌పై దాడులు చేసేందుకు ఇజ్రాయెల్ అనేక వ్యూహాలు, ముందస్తు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఇరాక్ ఎడారిలో రహస్యంగా ఓ తాత్కాలిక సైనిక స్థావరాన్నే నిర్మించిందట. అంతేకాదు.. ఈ ప్రాంతాన్ని గుర్తించిన ఇరాకీ దళాలపైనా ఇజ్రాయెల్ సైన్యం దాడులు చేసినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి ఓ అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది. ఇరాన్‌పై ఫిబ్రవరి 28న అమెరికాతో కలిసి దాడులు మొదలు పెట్టడానికి కొన్ని రోజుల ముందే ఇజ్రాయెల్ దీనిని నిర్మించింది. తమ వాయుసేనకు లాజిస్టిక్ కేంద్రంగా పనిచేయడానికి దాన్ని ఏర్పాటు చేసిందని, ఈ విషయం అమెరికాకు తెలుసునని సమాచారం. యుద్ధ భూమిలో ఇజ్రాయెల్ పైలట్లు ప్రమాదానికి గురైతే.. వేగంగా రెస్క్యూ చేసేందుకు ప్రత్యేక దళాల బృందాన్ని అక్కడ మోహరించినట్లు తెలిసింది. అయితే, ఈ స్థావరాన్ని మార్చి తొలి వారంలోనే ఇరాక్ సేనలు దాదాపుగా గుర్తించాయి. ఈ క్రమంలో చెక్‌పోస్టును రక్షించేందుకు ఇరాక్ సేనలపై ఇజ్రాయెల్ దాడులు చేయగా, ఇందులో ఓ సైనికుడు ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై ఇరాకీ దళాలు దర్యాప్తు చేయకుండా నిరోధించడంలో నెతన్యాహు సైన్యం సఫలమైందని సమాచారం. అయితే, ఇరాక్‌పై దాడిలో అమెరికా ప్రమేయం లేదని సంబంధిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి.

### అధికారం కోసం మిత్రుడిని వదిలేసి
## కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు

- బెంగళూరులో పేలుడు పదార్థాలు లభ్యం



**బెంగళూర్, మే 10:** కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర విమర్శలు చేశారు. ఆ పార్టీవి అవకాశవాద రాజకీయాలని దుయ్యబట్టారు. 30ఏళ్లుగా డీఎంకేతో కాంగ్రెస్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆ పార్టీతో పొత్తు వల్లే కాంగ్రెస్ అనేక సార్లు సంక్షోభాల నుంచి బయటపడిందని అన్నారు. 2014కు ముందు పదేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం డీఎంకే వల్లే మనుగడ సాగించిందని పేర్కొన్నారు. అయినప్పటికీ కష్టసమయంలో కాంగ్రెస్ స్టాలిన్ పార్టీని వదిలి టీవీకేతో చేతులు కలిపిందని విమర్శించారు. అధికారంపై ఉన్న దురాశతో దొరికిన తొలి అవకాశంలోనే మిత్రుడికి వెన్నుపోటు పొడిచిందని దుయ్యబట్టారు. రాజకీయంగా తన ఉనికిని నిలుపుకోవడానికి కాంగ్రెస్ ఎంతటి దారుణానికి అయినా ఒడిగడుతుందన్నారు. కర్ణాటకలోనూ అంతర్గత అధికార పోరాటాల కారణంగా సుపరిపాలన అందించడంలో కాంగ్రెస్ విఫలమైందని నరేంద్రమోడీ దుయ్యబట్టారు. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి బదులుగా అంతర్గత కలహాలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వ నేతలు ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు. సీఎం ఎంతకాలం కొనసాగుతారో మరో వ్యక్తికి అవకాశం లభిస్తుందో లేదో కూడా కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించలేకపోతోందన్నారు. సరైన ఎజెండా లేకపోవడం వల్లే కాంగ్రెస్‌కు ప్రజల్లో వ్యతిరేకత వస్తోందన్నారు. దేశప్రజల్లో ఆ పార్టీకి ఆదరణ తగ్గిపోతుందన్నారు. ˇసురక్షిత పాలన, అభివృద్ధి కోసం దేశ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. అందువల్లే తాజా ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రజలు కాషాయ పార్టీకి పట్టం కట్టారన్నారు. భవిష్యత్తులో కర్ణాటకలోనూ బీజేపీప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

కర్ణాటకలోని బెంగళూరులో నిర్వహించిన బీజేపీ సభలో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశానికి హాజరుకావడానికి ముందు వేదికకు 3కిలోమీటర్ల దూరంలోని కగలిపురలో రెండు జిలెటిన్ స్టిక్స్ లభ్యమైనట్లు పోలీసులు వెల్లడించారు. బాంబు నిర్వీర్వ దళాలు వాటిని అక్కడి నుంచి తరలించాయన్నారు. వాటిని అక్కడ పెట్టినట్లు భావిస్తున్న ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. దీంతో అధికారులు అప్రమత్తమై ఆ ప్రాంతంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ప్రధాని మోడీ వేదిక వద్దకు చేరుకోవడానికి ముందు ఆయన కాన్వాయ్ వచ్చే మార్గంలో నిర్వహించిన సాధారణ భద్రతా తనిఖీల్లో ఈ జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టామన్నారు.

## ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు దశకు..
### రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటన

**మాస్కో, మే 10:** ఉక్రెయిన్‌తో యుద్ధానికి సంబంధించి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ యుద్ధం ముగింపు దశకు వస్తోందని అన్నారు. మాస్కోలో జరుగుతున్న రష్యా విక్టరీ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. దీంతో యుద్ధం విరమించడానికి సంప్రదింపుల కోసం సిద్ధమైనట్లు రష్యా సంకేతాలు ఇచ్చినట్లైంది. అయితే యుద్ధం ముగింపునకు సంబంధించి ఎలాంటి కాలపరిమితిగానీ, శాంతి ఒప్పందం గానీ పుతిన్ ప్రకటించలేదు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో ప్రపంచం దృష్టి ఒక్కసారిగా రష్యా వైపు మరలింది. తన అభ్యర్థనతో రష్యా, ఉక్రెయిన్‌లు మూడు రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిన్న ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ రెండు దేశాల మధ్య యుద్ధం ముగింపునకు చర్చలు సాగుతున్నాయని ట్రంప్ వెల్లడించారు. ఆ మరునాడే పుతిన్ కీలక వ్యాఖ్యలు చేయడంతో ఒక్కసారిగా ఆశలు చిగురించాయి. ఉక్రెయిన్ నుంచి ముప్పు ఉండవచ్చనే నేపథ్యంలో గతానికి భిన్నంగా రష్యా ఈసారి విక్టరీ డే సెలబ్రేషన్స్‌ను అత్యంత భద్రత మధ్య చాలా చిన్న కార్యక్రమంలా నిర్వహించింది. ఈ పరేడ్‌లో రెడ్‌స్క్వేర్‌పై రష్యా ఎలాంటి ట్యాంకులను, ఆయుధాలను ప్రదర్శించలేదు. కేవలం భారీ తెరలపై, డిజిటల్ స్క్రీన్లలో అధునాతన క్షిపణులు, యుద్ధ విమానాలు, డ్రోన్లను ప్రదర్శించింది. ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొన్న సైనికులు కవాతు నిర్వహించారు. ఉత్తర కొరియా బలగాలు సైతం ఈ కవాతులో పాల్గొన్నాయి. ఇక ఉక్రెయిన్‌తో శాశ్వత శాంతి ఒప్పందం కుదిరన తర్వాతే తాను జెలెన్‌స్కీతో నేరుగా భేటీ అవుతానని పుతిన్ అన్నారు. 2022 ఫిబ్రవరిలో రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. ఇప్పటికే నాలుగేళ్లు పూర్తయింది. ఈ యుద్ధంలో ఇరుపక్షాలకు చెందిన వేలాది మంది సైనికులు మృతి చెందారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో అత్యంత రక్తపాతం సృష్టించిన యుద్ధం ఇదే.



# బీజేపీపై సమైక్య పోరాటానికి కదలి రండి



- విపక్షాలకు మమత పిలుపు

**కోల్‌కతా, మే 10 :** బీజేపీపై సమైక్య పోరాటానికి కలిసి రావాల్సిందిగా తృణమూల్ కాంగ్రెస్ అధినాయకురాలు మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. కాషాయ శిబిరానికి వ్యతిరేకంగా బీజేపీ వ్యతిరేక భావజాలం కలిగిన విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఏకం కావాలని పేర్కొన్నారు. 'వామపక్షాలు, వామపక్ష అతివాదులతో సహా ప్రతిపక్ష పార్టీలన్నింటికీ ఇదే నా పిలుపు. బీజేపీకి వ్యతిరేకంగా ఒక ఉమ్మడి వేదికను ఏర్పాటు చేద్దాం రండి' అని మమత కోరారు. ఈ విషయంలో తనతో సంప్రదింపులకు రాదలచిన ఏ పార్టీతోనైనా మాట్లాడేందుకు సిద్ధమేనని స్పష్టం చేశారు. 'శత్రువుకు శత్రువు మన మిత్రుడు అన్న సూత్రాన్ని పక్కనపెట్టి మనందరి శత్రువు బీజేపీ అని గుర్తిద్దాం' అని కాళీఘాట్‌లోని తన నివాసంవద్ద శనివారం నిర్వహించిన రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సభలో ఆమె పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రవ్యాప్తంగా తృణమూల్ కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులు ప్రారంభమయ్యాయని తెలిపారు. 'గూండాయిజం చెలరేగుతోంది. బీజేపీ శ్రేణుల్లో అసాంఘిక శక్తులు ప్రబలిపోయాయి' అని మమత ఆరోపించారు. 2011లో తాను తొలిసారి అధికార పగ్గాలు చేపట్టినప్పుడు వేధింపులు, అరాచకాలను అనుమతించలేదని తెలిపారు. పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, శివసేన యూబీటీ నేత ఉద్ధవ్ ఠాక్రే, ఆర్జేడీకి చెందిన తేజస్వీ యాదవ్ తదితరులు తనతో మాట్లాడారని వెల్లడించారు. ప్రముఖ న్యాయవాదులు అభిషేక్ మను సింఘ్వీ, కపిల్ సిబాల్‌లు తనతో మాట్లాడి సంఘీభావం ప్రకటించారని తెలిపారు. రవీంద్రుని జయంతి నాడు టీఎంసీ కొత్త పయనాన్ని ప్రారంభించబోతోందని తెలిపారు. 'నాకు ఎవరి సానుభూతీ అక్కర్లేదు. ఎందుకంటే ఈ ఎన్నికల్లో గెలిచింది మేమే. మమ్మల్ని అక్రమంగా ఓటమి పాలు చేశారని భవిష్యత్తులో రుజువవుతుంది' అని స్పష్టం చేశారు.

మనం ముద్ర
సోమవారం 11 మే 2026

వీక్షణం

# కనీస హక్కులకు దూరంగా 'గిగ్ వర్కర్లు'

'పిజ్జా..., బిరియానీ..., నాన్‌వెజ్ వంటకాలు లేదా బియ్యం, నూనె, పప్పుదినుసులు, వగైరా పదార్థాలు, వస్తువులు, బట్టలు'... వీటన్నింటి కోసం మనం ఎవరి మీద ఆధారపడతున్నాం? చేతిలో స్మార్ట్‌ఫోన్, కాసింత డబ్బు ఉంటే సరిపోతుందా? లేదు, డబ్బు చెల్లించినా, ఆయా వస్తువుల్ని, సేవల్ని మనింటి దాకా తీసుకువచ్చే వ్యక్తులు లేకపోతే మనం గడపదాటాల్సిందే! అవసరాల కోసం షాపుల చుట్టూ, ఆకలేసినపుడు హోటళ్ళ చుట్టూ తిరగాల్సిన అగత్యాన్ని మనకు తప్పించిన 'డెలివరీ ఏజెంట్లు', బస్టాపుల్లో నిలువునా మాడ్చేసే ఎండల్లో నిలబడే కష్టాన్ని తప్పించే 'క్యాబ్ లేదా ఆటో డ్రైవర్లు' లేకపోతే మన జీవితం ఎలా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి! ఈ సేవల్ని ఎండనకా, వాననకా, రాత్రింబవళ్ళు నిరంతరాయంగా మనకు అందిస్తున్న వీళ్ళని 'గిగ్ వర్కర్లు' అంటారు. మన ఆర్డర్ చేతికి అందడానికి కాసింత ఆలస్యమైతే, కన్నెర్ర చేసే ముందు వీళ్ళ జీవితం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

మనది పూర్తిగా 'నెట్‌వర్క్'తో అనుసంధానమైన ప్రపంచం. ఇలాంటి ప్రపంచంలో ఉద్యోగిగా మీరు ఒక గుర్తింపును, గుర్తింపు కార్డును, సౌలభ్యాల్ని, సౌకర్యాల్ని, హక్కుల్ని కలిగి ఉండడమన్నది క్రమంగా కనుమరుగై



పోతోంది. ఈ పరిస్థితే ఇవాళ 'గిగ్ వర్కర్లు' అనే ఒక కొత్త కార్మిక వర్గాన్ని సృష్టించింది, సంప్రదాయ యజమాని-ఉద్యోగి సంబంధానికి వెలుపల నడిచే 'గిగ్ ఎకానమీ' అనే ఆర్థిక వ్యవస్థకు తెరతీసింది. కాస్త తేలికభాషలో చెప్పాలంటే, జొమాటో, స్విగ్గీ, ఉబెర్, అర్బన్ కంపెనీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా స్వల్పకాలిక ప్రాతిపదికపై పనులు లేదా సేవల్ని అందించే వ్యక్తుల్ని 'గిగ్ వర్కర్లు' అంటున్నాం. మనం 'డెలివరీ ఏజెంట్లు.., క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు...' అంటూ పిలుచుకునే ఈ గిగ్‌వర్క్‌కు చెందిన కార్మికులు సాధారణ జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్న ప్రస్తుత వేసవి ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నారు. ఎలాంటి హక్కులు, కనీస సదుపాయాలు, ఆర్థికపరమైన స్థిరత్వం లేని అంధకారంలో జీవిస్తున్న గిగ్‌వర్కర్ల పరిస్థితి గురించి సమాజం మానవీయ కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

భారతదేశంలోని గిగ్ వర్కర్ల సంఖ్య 2026 సంవత్సరం ప్రారంభం నాటికి 12 మిలియన్ల (1.2 కోట్ల) మంది కార్మికులకు పెరిగింది. ఇది 2021 నుండి 55% పెరుగుదలను సూచిస్తూ, మొత్తం శ్రామిక శక్తిలో 2% కంటే ఎక్కువగా ఉంది. క్విక్-కామర్స్, రైడ్‌షేరింగ్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నడిచే ఈ రంగం, ఆదాయ అస్థిరత, భద్రత, సామాజిక భద్రత లేకపోవడం వంటి తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. మనదేశం ప్రస్తుతం గిగ్ వర్కర్లను 'స్వతంత్ర కాంట్రాక్టర్లు'గా పరిగణించడం నుండి వారికి అధికారిక చట్టపరమైన గుర్తింపు ఇవ్వడం వైపు పరివర్తన చెందుతోంది. సామాజిక భద్రతపై కోడ్ (2020) అనేది గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను అధికారికంగా నిర్వచిస్తుంది, జీవిత బీమా, ప్రసూతి ప్రయోజనాల వంటి సామాజిక భద్రతా పథకాల ఏర్పాటును తప్పనిసరి చేస్తుంది. అసంఘటిత కార్మికుల కోసం 'ఇ-శ్రమ్' పోర్టల్ అనే జాతీయ డేటాబేస్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ గిగ్ వర్కర్లు సంక్షేమ పథకాలను పొందేందుకు 'యూనివర్సల్ అకౌంట్ నంబర్' (యుఎఎన్) కోసం నమోదు చేసుకోవచ్చు. ఆయుష్మాన్ భారత్ (పీఎం-జేఏవై) పథకం కింద కేంద్ర బడ్జెట్ 2025-26 ఆరోగ్య సంరక్షణ ప్రయోజనాలను, గిగ్ వర్కర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులను ప్రకటించింది. వీరి పనుల కేటాయింపుపై అల్గారిథమిక్ నియంత్రణ, అధిక ప్లాట్‌ఫామ్ కమీషన్ రేట్ల కారణంగా సంపాదన చాలా అస్థిరంగా ఉంటుంది. కఠినమైన డెలివరీ లక్ష్యాలు (ఉదాహరణకు, 10 నిమిషాల నమూనాలు) అధిక ఒత్తిడికి, రహదారి భద్రతా ప్రమాదాలకు దారితీస్తాయి. చాలా మంది కార్మికులకు ఇప్పటికీ వేతనంతో కూడిన సెలవు, ఓవర్‌టైమ్ చెల్లింపు, తదితర ప్రామాణిక ఉద్యోగ ప్రయోజనాలు లభించడం లేదు.

గిగ్ వర్కర్ల వ్యవస్థలో సుమారు 47% మంది మధ్యస్థ నైపుణ్యం గల ఉద్యోగాలలో (ఉదాహరణకు, డెలివరీ, లాజిస్టిక్స్), 22% మంది అధిక నైపుణ్యం గల ఉద్యోగాలలో (ఉదాహరణకు, ఫ్రీలాన్సింగ్, టెక్), 31% మంది తక్కువ నైపుణ్యం గల పాత్రలలో ఉన్నారు. శ్రామిక శక్తిలో అధికశాతం యువకులు (సగటు వయస్సు 28) ఉన్నారు, అయినప్పటికీ మహిళల భాగస్వామ్యం పెరుగుతూ, ఈ విభాగంలో సుమారు 28% కి చేరుకుంది. ఇంధనం, తదితర నిర్వహణ ఖర్చులు పోను, డెలివరీ కార్మికులకు నికరంగా చేతికి అందే జీతం గంటకు సుమారు 75-115 రూపాయలు ఉంటుందని అంచనా. వీరిలో చాలామంది సంవత్సరానికి 2.5 లక్షల రూపాయల కంటే తక్కువ సంపాదిస్తారు.





### అధిక పనిభారం, తక్కువ వేతనం



భారతదేశంలోని పట్టణాల్లో నిరుద్యోగరేటు మార్చి, 2026 నాటికి 6.8%గా ఉంది. ఇందులో 15-20 ఏళ్ళ మధ్య వయస్సున్న యువతలో నిరుద్యోగ రేటు మార్చి 2026 నాటికి 15.2 శాతంగా ఉంది. చాలామటుకు పట్టణాలు, నగరాల్లోని తయారీ, సేవా పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు, కాలవ్యవధి అనేవి కాంట్రాక్టు పద్ధతి మీదే ఆధారపడి ఉంటుంది. హామీ లేని ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతూనే ఉంది. ఈ వాస్తవాల దృష్ట్యా పట్టణ పేదలకు స్థిరమైన జీవనోపాధిని, వేతన భద్రతను కల్పించడానికి పట్టణ ఉపాధి హామీ (యుఇజి) వంటి పథకాల అవసరం ఎంతైనా ఉంది. గిగ్ వర్కర్లు, లేదా ప్లాట్ఫామ్ వర్కర్లు, పట్టణ ప్రాంతాలలో క్యాబ్ డ్రైవర్లుగా, ఆహారం, కిరాణా సామాగ్రి, మందులు, ఇతర నిత్యావసరాలను డెలివరీ చేసే కొరియర్లుగా కీలకమైన సేవలను ఎక్కువగా అందిస్తున్నారు. ఓలా, ఉబెర్, జొమాటో, స్విగ్గీ వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వ్యవస్థాపకత, స్వయంప్రతిపత్తి, సౌలభ్యం, క్రమబద్ధీకరణలో ఒక కొత్త శకానికి నాంది పలికాయని ప్రశంసలు అందుకున్నాయి. అవి విపరీతంగా విస్తరిస్తున్నప్పటికీ, ఈ ప్లాట్‌ఫామ్‌ల ఉనికిలో కీలకపాత్ర వహించే వ్యక్తులు మాత్రం వాటి విజయం తాలూకు ప్రయోజనాలను పొందలేకపోయారు. గిగ్ వర్కర్లకు సంబంధించిన చర్చ, వారు ఎదుర్కొంటున్న దోపిడీ, దుర్బలత్వం తాలూకు చీకటి కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. తక్కువ మూల వేతనం, ప్రోత్సాహకాల ఆధారిత చెల్లింపు విధానాలు, అధిక కమీషన్లు, పని నాణ్యతను అంచనా వేసే ఏకపక్ష నిఘా వ్యవస్థల కారణంగా, ఈ కార్మికులు ప్రమాదకరమైన పరిస్థితులలో ఎక్కువ గంటలు పనిచేస్తూ లేదా పని కోసం వెతుకుతూ గడుపుతారు. డెలివరీ, టాక్సీ డ్రైవింగ్ రంగాలపై జరిపిన పరిశోధనలో, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు చారిత్రాత్మకంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వలస కార్మికులపై ఆధారపడతాయని వెల్లడైంది. సామాజిక భద్రత విషయంలో ఈ కార్మికులు ఎంతో వివక్షను ఎదుర్కొంటూ ఉంటారు. గిగ్ వర్కర్లను ఈ విధంగా నిర్వచించడం వల్ల, వారు సామాజిక భద్రత, వేతనంతో కూడిన సెలవులు, కనీస పని గంటలు, ఆరోగ్య బీమా వంటి ఉద్యోగ ప్రయోజనాలను కోల్పోతారు, ఇది బలహీనమైన ఉద్యోగ భద్రతకు, తక్కువ ఆదాయాలకు దారితీస్తుందన్నది గమనార్హం.

**- పసుపులేటి గీత (అసిస్టెంట్ ఎడిటర్)**

**గిగ్ కార్మిక శక్తి పరిమాణం:** గిగ్ వర్కర్ల సంఖ్య 2012లో **77** లక్షల నుండి 2025 నాటికి **120** లక్షలకు (12 మిలియన్లు) పెరిగింది, అంచనాలు మరింత వృద్ధిని సూచిస్తున్నాయి.

**ఆదాయం, ఉపాధి:** దాదాపు **40%** గిగ్ వర్కర్లు నెలకు **15,000** రూపాయల కంటే తక్కువ సంపాదిస్తున్నారు.

**క్విక్-కామర్స్ విజృంభణ:** క్విక్-కామర్స్ (ఉదా: బ్లింకిట్, జెప్టో) వేగంగా విస్తరిస్తోంది, దీనితో సుమారు **20** లక్షల కొత్త గిగ్ ఉద్యోగాలు సృష్టించబడతాయని అంచనా.

**ఆర్థిక ప్రభావం:** 2029-30 నాటికి గిగ్ ఎకానమీ భారతదేశ జీడీపీకి **2.35** లక్షల కోట్ల రూపాయల మేర దోహదపడుతుందని అంచనా.

**సామాజిక భద్రతా నియమావళి (సిఒఎస్ఎస్):** గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులకు సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించడమే లక్ష్యంగా ఉన్న సిఒఎస్ఎస్ అమలు కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది.

**వడగాలుల నుండి రక్షణ:** పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా, గిగ్ వర్కర్ల సంఘాలు అమలు చేయదగిన వడగాలుల రక్షణ, భద్రతా నిబంధనలను డిమాండ్ చేస్తున్నాయి. తీవ్రమైన వేసవిలో, డెలివరీ భాగస్వాములు, డ్రైవర్ల ఆరోగ్యం, ఆదాయంపై ప్రభావం చూపుతోంది.

## సమగ్ర సంస్కరణలు

బలహీనమైన డిమాండ్, నైపుణ్యాల అసమతుల్యత లేదా భద్రతా వలయం లేకపోవడం వంటి కారణాల వల్ల కార్మికులు గిగ్స్(తాత్కాలిక ఉపాధి)లోకి నెట్టబడకుండా, వారికి సరైన జీవనోపాధిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండేలా నిబంధనలను పునఃరూపకల్పన చేయడమే గిగ్-ఎకానమీ విధానం లక్ష్యం కావాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 జనవరి 29న పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'భారత ఆర్థిక సర్వే 2025-26' నొక్కి చెప్పింది. 2021లో 7.7 మిలియన్లుగా ఉన్న గిగ్ సెక్టార్ కార్మికుల సంఖ్య, 2025 నాటికి 12 మిలియన్లకు పెరిగిందని ఆ పత్రం పేర్కొంది. 'ప్రస్తుతం భారతదేశంలోని మొత్తం శ్రామిక శక్తిలో రెండు శాతానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న గిగ్ వర్కర్ల వృద్ధి, మొత్తం ఉపాధిని అధిగమిస్తోంది. వ్యవసాయేతర గిగ్ వర్కర్లు 2029-30 నాటికి శ్రామిక శక్తిలో 6.7 శాతంగా ఉంటారని, జీడీపీకి 2.35 లక్షల కోట్లరూపాయల్ని అందిస్తారని అంచనాలు చెబుతున్నాయి' అని అది పేర్కొంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, 2030 నాటికి అధిక నైపుణ్యం గల గిగ్ వర్కర్ల వాటా 27.5 శాతానికి చేరుకుంటుందని అంచనా. తక్కువ నైపుణ్యం గల కార్మికుల వాటా 2030 నాటికి 33.8 శాతానికి చేరుకుంటుందని అంచనా. గిగ్ ఎకానమీ పుంజుకుంటున్నప్పటికీ, ఆదాయంలో అస్థిరత కొనసాగుతుండటంతో రుణాలు పొందడంలో సవాళ్లు ఎదురవుతున్నాయని నివేదిక చెప్పింది. చారిత్రాత్మకంగా భారతదేశం ఈ కార్మిక శక్తిని ప్రస్తుత కార్మిక చట్టాల పరిధిలోకి రాని అసంఘటిత కార్మిక వర్గంగా గుర్తించినందున, కచ్చితంగా ఈ రంగాలను లక్ష్యంగా చేసుకుని విధానపరమైన జోక్యాలు అవసరమని ఆ పత్రం పేర్కొంది. గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులను అధికారికంగా గుర్తించి, వారికి సామాజిక భద్రతా పథకాలను అందించడం ద్వారా 'సామాజిక భద్రతా కోడ్ 2020' అమలులోకి వస్తుందని అది పేర్కొంది. 'సీఎస్ఎస్ ఈ కార్మికులకు చట్టపరమైన గుర్తింపును అందించి, వారి హక్కులు, రక్షణలను స్థాపించడానికి పునాది వేస్తుంది.' అని అది పేర్కొంది. వాహనాల కొనుగోలు శక్తి లేకపోవడం, రుణాలు అందకపోవడం, ఒకవేళ రుణాలు అందినా, ఆయా వాహనాలకు అవసరమైన ఇంధనాన్ని పొందడానికి ఆర్థికపరమైన పరిమితులు అడ్డుపడడం వంటి సవాళ్ళను గిగ్‌వర్కర్లు ఎదుర్కొంటున్నారు. బైక్, కారు లేదా ఇతర ప్రత్యేక పరికరాలు లేకపోవడం వల్ల చాలా మంది తక్కువ-నుండి-మధ్యస్థ నైపుణ్యం గల గిగ్స్ నుండి ఉన్నత స్థాయికి వెళ్లలేకపోతున్నారని సర్వే గమనించింది. వారికి తక్కువ ఖర్చుతో కూడిన అత్యవసర పొదుపు పథకాలు, బదిలీ చేయగల సామాజిక భద్రతా ప్రయోజనాలు, బడ్జెటింగ్ లేదా ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలతో సహా ప్రాథమిక ఆర్థిక ప్రణాళిక మద్దతు అవసరం. గిగ్ వర్కర్ల ఆదాయ నమూనాలను పరిగణనలోకి తీసుకునే మరింత సరళమైన, చురుకైన ఆర్థిక ఉత్పత్తులను అందించేలా మార్కెట్‌ను ప్రోత్సహించాలి' అని సర్వే పేర్కొంది. తక్కువ, మధ్యస్థ నైపుణ్యం గల గిగ్ కార్మికుల ఆదాయాలను పెంచడం ద్వారా సాధారణ ఉద్యోగాలు, గిగ్ వర్క్ మధ్య వ్యయ వ్యత్యాసాన్ని తగ్గించవచ్చని కూడా సర్వే పేర్కొంది.

**- అభిరామి**

**తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్, హీట్వాచ్ సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనంలో, కార్మికులలో వడదెబ్బ, డీహైడ్రేషన్, చర్మ వ్యాధులు, జీర్ణాశయ సంబంధిత సమస్యలు, మూత్రపిండాల సంబంధిత అనారోగ్యాలు వంటి లక్షణాలు కనబడుతున్నట్లు తేలింది. ఎక్కువసేపు వేడికి గురికావడం తక్షణ, దీర్ఘకాలిక పరిణామాలతో కూడిన ఒక తీవ్రమైన, వృత్తిపరమైన ఆరోగ్య ప్రమాదం.**

## వేడిగాలులు ఒక విపత్తే!

కిటికీ

జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ జూలై 2025న జారీ చేసిన ఒక సలహాలో షిఫ్టుల పునర్వ్యవస్థీకరణ, సేవా పరిధి తగ్గింపు, భద్రతా పరికరాలు,నీటి సరఫరా చర్యలు, విశ్రాంతి విరామాలు, శీతలీకరణ ఆశ్రయాలు వంటి సిఫార్సులను సూచించింది. యువి-రక్షణ దుస్తులు, కూలింగ్ క్యాప్‌లు, సన్‌గ్లాసెస్, సన్‌స్క్రీన్, ఫోన్-కూలింగ్ కవర్లు, ఎలక్ట్రోలైట్లు, ఇన్సులేటెడ్ కూల్ ఫ్లాస్కులు కలిగిన భద్రతా కిట్‌ను అందించాలని ఇది ప్లాట్‌ఫామ్‌లను కోరుతోంది. ప్లాట్‌ఫామ్‌లు మధ్యాహ్నం రద్దీ సమయాల్లో పనికి అందుబాటులో ఉన్నందుకు ప్రోత్సాహకాలను అందిస్తాయి, రద్దు చేయబడిన ఆర్డర్లకు జరిమానాలు విధిస్తాయి, దీనివల్ల విరామం తీసుకోవడం కష్టమవుతుంది. అయినప్పటికీ భద్రతా కిట్లు వీళ్ళకి ఉచితంగా లభించవు. ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల మధ్య పనిని తప్పనిసరి చేయవద్దని జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ జారీ చేసిన సలహా ప్లాట్‌ఫామ్‌లకు, అగ్రిగేటర్లకు విజ్ఞప్తి చేస్తోంది.



తీవ్రమైన వేడి గిగ్ కార్మికుల ఆరోగ్యంపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతుంది. పదేపదే వేడికి గురికావడం కార్మికుడి శారీరక సామర్థ్యాన్ని, ఓర్పును, ఉత్పాదకతను గణనీయంగా తగ్గిస్తుంది. తీవ్రమైన వేడి సమయంలో, డెలివరీల సంఖ్య తగ్గిపోతుంది, ఇది వీరి ఆదాయంపై నేరుగా ప్రభావం చూపుతుంది.

**- కల్కి**

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.